# రేపటి కొడుకు

## మల్లాది వెంకట కృష్ణమూర్తి




శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 4




ఆంధ్రుల ఆహ్లాద రచయిత కలంనుంచి అగ్రశ్రేణి ధారావాహిక నవల

*1974-75ల్లో ఆంధ్రజ్యోతి వారపత్రికలో నవలా స్రవంతి పోటీల్లో ఒక నవలగా ధారావాహికంగా ప్రచురించబడింది. ఆ ఎంపిక వెనుక ఒక చిన్నకథ వుంది.. ప్రాథమిక వడపోత అనంతరం తుది ఎంపిక కోసం నవలల్ని ప్రఖ్యాత రచయిత శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్య గారికి ఇచ్చారు. ఆయన ' తిరస్కరించబడిన నవలలని కూడా ఇవ్వండి ' అని అడిగి తీసుకుని వాటిల్లోంచి ఈ నవలని ఎంపిక చేశారు. నవలా స్రవంతి పథకంలో ప్రచురించబడిన 6 నవలల్లో పాఠకుల అభిప్రాయాల ప్రకారం అత్యధిక శాతం ఓట్లు తెచ్చుకుని ప్రథమ బహుమతిని గెలుచుకుంది ఈ నవల. హిందీలో డైరెక్ట్ సినిమా కుంవారీ బహు (పెళ్ళికాని కోడలు) గా రూపొందించబడింది. తెలుగులో కూడా 'రేపటికొడుకు '(ముత్యాలసుబ్బయ్య దర్శకత్వం, చంద్రమోహన్, జయసుధ తారాగణం) చలనచిత్రంగా రూపుదిద్దుకున్న ఈ నవల కన్నడంలోకి కూడా అనువాదం చేయబడింది. 'కౌముది 'లో ప్రత్యేక ప్రచురణకి అనుమతినిచ్చిన శ్రీ మల్లాది వెంకటకృష్ణ మూర్తి గారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం - సం.*

## 1

అలారం మ్రోగినట్లుగా, ఉదయం అయిదు గంటలకల్లా మెలుకువ వచ్చేస్తుంది ఠక్కున ఛాయకి.

మెలుకువ వచ్చాక, ఇక నిద్రపోదామనుకున్నా నిద్ర పట్టదు. చిన్నప్పటినుంచీ వచ్చిన అలవాటది. తన తల్లి చిన్నప్పుడే, రోజూ అయిదు అయేసరికల్లా లేపడం వల్ల ఛాయకి అభ్యాసమైపోయింది త్వరగా లేవడం.

హైదరాబాద్ రావటం వల్ల ఆ అలవాటులో మార్పేమీ లేదు. కొత్త ఇంట్లో, కొత్త మనుష్యుల మధ్య పడుకున్నా ఆ అలవాటులో మార్పురాలేదు. మెలకువ రాగానే కొన్ని క్షణాలదాకా తను సత్తెనపల్లిలో ఉన్నట్లుగా భ్రమించింది ఛాయ ముందర.

ఎదురుగా కనిపిస్తున సీలింగ్ కొత్తగా కనిపించింది. బూజుపట్టిన పెంకులు బదులు, నీలం రంగు డిజైనులో కనిపిస్తున్న సీలింగ్ చూడగానే ఒక్క క్షణం ఛాయ తబ్బిబ్బు పడింది. కానీ వెంటనే గుర్తుకొచ్చింది, ఆ క్రిందటి రోజే తను విజయవాడ నుంచీ కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్ వచ్చిన సంగతి.

గదిలో వెలుగుతున్న చిన్న బెడ్‌లైట్, నీలం రంగు కాంతిని మందంగా అందిస్తోంది. ఇంకా చీకటిగానే ఉంది. వెలుగు రాలేదు. సూర్యుడు ఇంకా ఉదయించలేదు. అంతే కాదు, తను భరించలేనంత చలిగా కూడా ఉంది.

ఒత్తిగిలి పడుకుని, కాళ్ళతో జారిపోయిన దుప్పటిని పైకి లాక్కుంది. దుప్పటికూడా చల్లగా ఉంది చలివల్ల. తనకి చలివల్ల మెలుకువ వచ్చిందేమో? ఇంకా అయిదు కాలేదేమో? అందువల్లనేనేమో, ఇంకా నిద్రమత్తుగా ఉంది. చలికి గుండెలు కూడా చల్లబడినట్లుగా అనిపిస్తుంది. చర్మంలోంచి గుండెల్లోకి పోగలదా చలి? ఏమో? మరయితే ఎందుకింత చలి?

పక్క మీద నుంచీ లేవబుద్ధి కాలేదు ఛాయకి. తను కృష్ణాఎక్స్‌ప్రెస్ లోంచి, సికింద్రాబాద్ స్టేషనులో దిగి, ఇంటికి వచ్చేదాకా జరిగినవన్నీ నెమరువేసుకోసాగింది ఛాయ.

బండి దిగి, చేతిలోని సంచితో దిక్కులు చూస్తూ నిలబడ్డ తనదగ్గరికి ఓ ఏభైఏళ్ళ ముసలాయన వచ్చాడు. తన వంక ఎగాదిగా చూశాడు. ఖద్దరు చొక్కాకి, ఛాతీమీద ఒక వైపు ఉన్న పెద్ద జేబులోంచి చిన్న ఫోటో తీసి ఆ ఫోటోని, తనని మార్చి మార్చి చూశాడు కాసేపు తదేకంగా. ఆ ఫోటోని జేబులో పెట్టుకుని, తనవంక చూసి నవ్వుతూ అడిగాడు.

"నీ పేరు ఛాయేనా?"

"అవును" బెరుకుగా సమాధానం ఇచ్చింది తను.

"సత్తెనపల్లి నుంచి వస్తున్నావా?"

"అవును" ఈ సారి కూడా బెరకుగానే సమాధానం ఇచ్చింది.

"మీరు సోమయాజులుగారా?" తనతో పాటు ప్రయాణం చేసిన విధవావిడ అడిగింది ఆ ముసలాయనని.

"అవును ఛాయ కోసం వచ్చాను నేను స్టేషన్‌కి, నాకు సత్తెనపల్లి నుంచీ సహజానందంగారు ఉత్తరం వ్రాసారు ఛాయని పంపిస్తున్నట్లు, ఫొటో కూడా పంపారు. మీరెవరు?"

"సహజానందంగారు మాకు తెలిసినాయన, ఛాయని హైదరాబాద్ నాతో పంపారు. మీరెవరూ స్టేషన్‌కి రాకపోతే, మీ ఇంటికి చేర్చమని చెప్పి పంపారు. మీ ఇంటి అడ్రసు కాగితం కూడా ఇచ్చారు. మీరు రాకపోతే నాతో పాటు మా అల్లుడింటికి తీసుకెళ్ళి, తీరిగ్గా సాయంత్రమో, రేపో తీసుకువద్దామనుకున్నాను." కొంగు తలమీదకి లాక్కుని చెప్పిందా విధవావిడ.

"నేను తీసుకెళ్తాను లెండి" చెప్పాడు సోమయాజులు.

ఆ విధవావిడ తనతో వెళ్ళొస్తానని, వెంటనే క్షేమంగా చేరినట్టు సహజానందంగారికి ఉత్తరం వ్రాయమని చెప్పి స్టేషన్‌కి వచ్చిన అల్లుడితో వెళ్ళిపోయింది. రైల్లో ఆవిడ బాగా ఇబ్బంది పెట్టేసింది, తనని పచ్చి మంచినీళ్ళయినా త్రాగనివ్వకుండా 'మడి, మడి' అంటూ.

సోమయాజులు గారి వెంట నడిచింది తను. స్టేషన్ బయటికి వచ్చాక, స్టేషన్ ముందు విశాలంగా ఉన్న ఆవరణ చూసి, ఆగి ఉన్న కార్లని, కారు లాగా పరుగెత్తే అదోరకం రిక్షాలని, బస్సుమీద బస్సువున్న బస్సులని, బస్సు వెనకాల తోకలాగా ఉన్న బస్సులని చూసి చెప్పలేనంతగా ఆశ్చర్యపడిపోయింది.

తనని ఆ బస్సులవైపు తీసుకెళ్ళారు సోమయాజులు. ఓ బస్సు ఎక్కాక అడిగారు.

"ఏం అమ్మాయ్! ప్రయాణం కులాసాగా జరిగిందా?" తల ఊపింది తను సమాధానంగా.

"సహజానందం నీకెలా పరిచయం?"

"వారింట్లోనే ఉండేదాన్ని ఇంతకాలం"

"వంటా అదీ బాగా చేయగలవా?"

"చిన్నప్పటినుంచీ వంటా, ఇంటి పనులు అన్నీ అలవాటు. మా అమ్మ నాకన్నీ నేర్పింది. జిలేబీలు కూడా చుట్టగలను."

ఓసారి తన వంక పరీక్షగా చూసి అడిగారు. "నీకు ఎన్నేళ్ళు?"

"పద్దెనిమిది"

ఆయన కండక్టర్ దగ్గరికి రాగానే రెండు టిక్కెట్లు కొన్నారు ఏదో అని. ఇంటికి వెళ్ళేదాకా మాట్లాడలేదు. దారిలో తను దాదాపు ఇరవై నిముషాలదాకా కిటికీలోంచి బయటికి, రోడ్లవంక చూస్తుండిపోయింది. కార్లు, సైకిళ్ళు గమ్మత్తుగా ఉన్న ఆకుపచ్చ రిక్షాలు ఈ వూళ్ళో ఎక్కువ అనుకుంది. చీరలే కాకుండా రకరకాల గమ్మత్తు బట్టలు తొడుక్కున్న అమ్మాయిలని అనేక మందిని చూసింది.

ఆయన దిగమని చెప్పేదాకా, అసలు తను ఆయన ప్రక్కన కూర్చున్న సంగతే మర్చిపోయింది. బస్సు దిగాక ఆయన తన చేతిని పట్టుకుని రోడ్డు దాటించాడు. లెక్కలేనన్ని వాహనాలు అటూ ఇటూ తిరుగుతూనే ఉన్నాయి. ఆ రోడ్డు మీద. చచ్చే సిగ్గేసింది తన చేతి నాయన పట్టుకుంటే.

నాలుగయిదు నిమిషాలు నడిచాక ఓ ఇంట్లోకి తీసుకువచ్చారు. తను బిడియపడుతూ ముందు గదిలోనే నిలబడిపోయింది.

తనని, సోమయాజులుగారి భార్య ముందు గదిలోకి వచ్చి కొంచెం సేపు నిశితంగా చూసి అన్నది నవ్వుతూ.

"రా అమ్మాయ్, బిడియపడకు కొత్తవాళ్ళలాగా" అన్నది.

మరో అరగంటదాకా తనకి గుండెదడ తగ్గలేదు. క్రొత్తచోటు, క్రొత్తవాళ్ళు, అంతకు మునుపెప్పుడూ ఎవరింటికీ వెళ్ళి ఎరగదు తను.

స్నానం చేయమని నీళ్ళగది చూపించిందావిడ. స్నానం చేసి వేరే బట్టలు కట్టుకున్నాక కానీ, ఇంకా రైల్లో ప్రయాణం చేస్తున్న అనుభూతి, చెవుల్లో రైలు చక్రాల ఆలాపన తగ్గలేదు.

ఆవిడే అన్నం వడ్డించింది. అన్నం తింటూంటే చాలా ప్రశ్నలే అడిగింది.

"నీ పేరేమిటి?"

"ఛాయ"

"పద్దెనిమిదా నీకు?"

"అవును."

"ఇంకాస్త కలుపుకో, మరీ అలా బుచ్చిబువ్వలా కలుపుతావే కూర, ఇంతకు మునుపు సహజానందంగారింట్లో పని చేసేదానివా?"

"సత్తెనపల్లిలో సహజానందంగారు డాక్టర్‌గారింటికి అప్పుడప్పుడు భోజనానికి వస్తూండేవాళ్ళు."

"డాక్టర్‌గారికి ట్రాన్స్‌ఫర్ అయిందటగా?"

"అవును"

"నీకెవరూ లేరా?"

"మా అమ్మ కిందటేడే చచ్చిపోయింది."

కాసేపు ఆవిడ మౌనంగా ఉండిపోయింది. పెరుగు కలుపుకుంటూంటే మళ్ళీ అడిగింది. "అయితే చుట్టాలు, బంధువులూ ఎవరూ లేరా అసలు?"

"లేరు".

"భయం వేయలా ఒంటరిగా ఇంతదూరం రావడానికి?" నవ్వుతూ అడిగారు సోమయాజులు.

"వేసింది, మీరు స్టేషనుకి రారేమోననుకుని భయపడ్డాను."

"నీకు మా ఇంటి సంగతులు చెప్పారా సహజానందంగారు?"

"లేదు."

"మేం మొత్తం ఏడుగురం. నేను, ఆయన, ముగ్గురు పిల్లలు, కోడలు, మనువడు. నాకు వంట్లో ఎప్పుడు ఏదో ఒకటి ఉంటూనే ఉంటుంది. రెండు రోజులు లేచి తిరిగితే, పదిరోజులు పడకెయ్యాలి. పిల్లలంతా పెద్దవాళ్ళే, ముగ్గురూ అబ్బాయిలే. ఉద్యోగాలకి

వెళ్ళిపోతారు. కోడలు కూడా ఉద్యోగం చేస్తోంది. ఇంట్లో వంట, వార్పు, ఇంటి పని, బాబుని చూసుకోవడం, వీటన్నిటికీ మనిషి కావాలని సహజానందంగారికి రాసి సంవత్సరం అయింది. నీకు అంతా చెప్పే పంపి ఉంటారనుకున్నాను.''

''వివరంగా ఏం చెప్పలేదు.''

''ఒక వారం రోజులు పోతే నీకే అంతా తెలుస్తుంది. ఎవరూ చెప్పకుండా నీ అంతట నువ్వే చేసుకుపోవచ్చు. ఈ లోపల మాత్రం కాస్త శ్రద్ధగా చూస్తూండు ఈ ఇంటి సంగతి, ఇక్కడి మనుషులు, నువ్వు నెగ్గుకురాగలుగుతే ఇక్కడే ఉండిపోదువుగానీ మా పిల్లల్లో పిల్లలా, నచ్చకపోతే చెప్పు ఎప్పుడయినా సరే.''

''నాకెలా ఉన్నా ఫర్వాలేదు'' మెల్లిగా అన్నది తను.

''ఫర్వాలేకపోతే మంచిదే, ఏదయినా ఇబ్బంది కలిగితే భయపడకుండా, ఎవరయినా ఏమయినా అంటారని అనుకోకుండా నిర్మొహమాటంగా చెప్పేయి, నేనయినా అంతే.''

''అలాగేనండి.''

''ముగ్గురు పిల్లలూ మొగవాళ్ళే. అంతా ఎదిగినవాళ్ళే పెద్దబ్బాయి శర్మ. ఏదో మందుల ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు జీతం బాగానే వస్తుంది కానీ, సరయిన వేళపాళలుండవు వాడి ఉద్యోగానికి, రాత్రి డ్యూటీలు కూడా ఉంటుంటాయి.

పెద్దకోడలు శాంత, పొద్దున పదిగంటలకి వెళితే, దీపాలు పెట్టే వేళకి వస్తుంది. ఏదో గవర్నమెంట్ ఆఫీసులో ఉద్యోగం చేస్తోంది. మనమడుకి నాలుగేళ్ళు. వచ్చే సంవత్సరంలో బళ్ళో వేసేదాకా నువ్వు చూసుకోవాలి వాణ్ణి. తల్లితండ్రులిద్దరూ ఆఫీసుకి వెళితే వాడు దిగులుగా ఉంటాడు.

రెండో అబ్బాయి దీక్ష ఫొటో స్టూడియో ఉంది మాకు. వాడికి పెళ్ళయిపోయింది. మూడోవాడు అవధాని, మొన్ననే బి.ఎస్.సి పాసయ్యాడు. రేపో, మాపో వాడికి ఉద్యోగం వస్తుంది.

ఆయన ప్రొద్దున్నే ఎనిమిదిన్నరకి భోజనం చేసి వెళితే రాత్రి తొమ్మిదవుతుంది వచ్చేసరికి. ఇంట్లో ఉండేది నువ్వూ, నేనూ, బాబు ముగ్గురమేనన్నమాట.''

తను జాగ్రత్తగా విన్నది ఆవిడ చెప్పే మాటలు. ఇంటినిండా గంపెడు పిల్లలు రెక్కలు ముక్కలయేలా చాకిరీ ఉంటుందని భయపడింది తను, రాబోయే ముందు. కాని పని తేలికే.

''ఇంట్లో ఎవరూ ఉన్నట్లు లేరూ?'' తన సందేహాన్ని వెలిబుచ్చింది కంచం ఎత్తుతూ.

''అంతా ఎక్కడికో వెళ్ళారు వస్తారు.''

కంచం కడిగాక మధ్యగదిలో గోడకి వేలాడుతున్న ఫొటోవంక చూసింది తను. చాలామంది ఉన్నారు ఫొటోలో, ఏభైమంది పైనే ఎవరెవరో తెలియలేదు తనకి.

ఇల్లంతా కలియ తిరిగి చూసింది, ఇంక చేసే పనేం కనబడక మొత్తం అయిదు గదులు, ముందర వరండా, వరండా దాటి లోపలికి వస్తే మధ్య గది. ఆ మధ్యగదికి అటూ ఇటూ రెండు గదులు, మధ్యగది దాటి లోపలికి వెళితే వంటగది.

వరండాకి ఆనుకుని ఉన్న ఇంకో గది తలుపు తాళం వేసి ఉండడం గమనించింది తను, అది ఆరో గది.

ఆవలిస్తున్న తనని చూసి అడిగాడు సోమయాజులు. ''నిద్రవస్తోందామ్మాయ్? పడుకుంటే పడుకో.''

ఆయన ఆ గది తాళం తీసి అన్నారు.

''ఈ గదిలో నీ సామాను ఆ అలమారులో ఉంచుకో. మా అవధాని చదువుకుంటుండేవాడు దీంట్లో. ఆ మంచం మీద పడుకో, రాత్రి చీకటిగా ఉండకుండా ఉండటానికి దీపం కూడా ఉంది చూడు.''

తను తొమ్మిదిన్నరదాకా సోమయాజులుగారి భార్యతో కబుర్లు చెప్పింది. ఆవిడ వసపిట్ట. ఏవేవో చెపుతూనే ఉంది. ఆవిడ మాటల్లోనే నిద్రపోయిన తర్వాత తనూ పడుకుంది. తను పడుకునేదాకా ఎవరూ రాలేదు ఇంటికి.

సోమయాజులుగారి భార్య పేరు తెలియలేదు తనకి. తెలుసుకోవాలి. ఉద్యోగం చేస్తున్న పెద్ద కోడలు ఎలా ఉంటుందో చూడాలి. రెండో అబ్బాయికి పెళ్ళయిందన్నారు కానీ కోడలు గురించి ఏం చెప్పలేదు. బహుశ పుట్టింటికి వెళ్ళి ఉంటుంది. కడుపుతో ఉందేమో!

అబ్బ ఈ ఊళ్ళో ఎంత చలి, కప్పుకున్నా ఇంకా చలేస్తోంది. రోజూ ఇలా ముందరే మెలుకువ వచ్చేస్తే ఇబ్బంది.

ఛాయ మళ్ళీ నిద్రపోవడానికి ప్రయత్నించింది కాని నిద్రరాలేదు. తను పడుకున్న మంచం మీదకి మళ్ళాయి ఆమె ఆలోచనలు.

ఎంత పెద్ద మంచం ఇది? నలుగురు హాయిగా పడుకోవచ్చు. గదిలో సగం ఉంది మంచం, ముందరే కొలతలు తీసుకుని పరుపు కుట్టి ఉంటారు. పట్టెమంచం చాలా పురాతనమయినది అయి ఉంటుంది.

కొద్దికొద్దిగా వెలుగురేఖలు పొడచూపేదాకా ఛాయ దేన్నో ఓదాన్ని గురించి ఆలోచిస్తూనే ఉంది.

తర్వాత ఇక నిద్రపట్టదని నిశ్చయించుకుని లేచింది. బాత్‌రూం లోకి వెళుతూ, వంటగదిలో దేవుడి గూటి ముందు కూర్చుని పూజ చేసుకుంటున్న సోమయాజులుగారిని చూసింది ఛాయ.

మొహం కడుక్కుని, రాక్షసి బొగ్గుతో బాయిలర్ అంటించింది ఛాయ. పంపుకి రబ్బర్ ట్యూబ్ తగిలించి, పంపు తిప్పి, బాయిలర్ మూత తెరచి ట్యూబ్ రెండో చివరని బాయిలర్‌లో ఉంచింది.

బాత్‌రూంలో ఉన్న స్టీలు గిన్నెలని, ఇత్తడిగిన్నెలని తోమటం ప్రారంభించింది. సగం గిన్నెలు తోమటం పూర్తవగానే బాయిలర్ నిండిపోయింది. పంపు కట్టేసి, ఓ మూలవున్న ప్లాస్టిక్ డ్రమ్‌ని నీళ్ళతో బాగా కడిగి, ట్యూబ్‌ని డ్రమ్ములో పడేసి మళ్ళీ పంపు తిప్పింది.

ఛాయ గిన్నెలన్నీ తోమి కడుగుతుండగా బాత్‌రూంలోకి పాతిక, ముప్పైలో ఉండే యువతి వచ్చింది. ఛాయని ఎగాదిగా చూస్తూ అడిగింది.

"నువ్వేనా ఛాయ?"

"అవును."

లేచి నిలబడి, కొంగుతో చేతిని తుడుచుకుంటూ చూసింది ఛాయ ఆ యువతి వంక.

చామనఛాయ, అప్పుడే నిద్ర లేచినట్లుగా ఉన్న మొహం, గుండ్రటి ఆ మొహంలో నిద్రమత్తు చక్కగా కనిపిస్తోంది స్పష్టంగా. నుదుటి మీద చిందరవందరగా పడింది జుట్టు. రేగిపోయి ఉంది జడ, నుదిటి కుంకుమ లేదు, నిద్రలో చెరిగిపోయింది.

"మీరు శాంత అవునా?" అడిగింది ఛాయ.

"అవును, అంట్లన్నీ నువ్వే తోమావా?" అడిగింది ఆ ఇంటి పెద్ద కోడలు శాంత.

"అవును."

"రేపటినుంచీ నువ్వు తోమక్కరలేదు. పనిమనిషి వచ్చి తోముతుంది."

"తెలియదు, అలాగే."

ఛాయవంక పరిశీలనగా చూస్తూ, టూత్‌పేస్టుని బ్రష్ మీదకి ఎక్కించింది శాంత. ఛాయని గమనించసాగింది.. పద్దెనిమిదేళ్ళు ఛాయకి, తనకన్నా పదకొండేళ్ళు చిన్నది. తనలాగే ఛామనఛాయే అయినా తనకన్నా అందంగా, ఆకర్షణీయంగా ఉంది. కారణం అప్పుడే యవ్వనంలోకి అడుగుపెట్టటమే కాదు, పదుకొండేళ్ళ క్రితం తను ఇంత అందంగా, ఛాయ అంత అందంగా లేదు. తనకన్నా స్వతహాగా ఛాయ ఎక్కువ అందమయింది. శరీర సౌష్టవం తీర్చిదిద్దినట్లుగా ఉంది.

తన ఆలోచనలని ఆపి, నీళ్ళతో మొహం కడుక్కుంది శాంత ఓ మూలకి వెళ్ళి. ఛాయ గిన్నెలు కొన్నింటిని వంట గదిలోకి తీసుకెళ్ళి బోర్లించి, మిగతావి తీసుకువెళ్ళడానికి రాగానే శాంత పిలిచింది.

"ఛాయా."

ఏమిటన్నట్లుగా చూసింది శాంత మొహంలోకి.

కొన్ని క్షణాలు మనసులో మాటలు పేర్చుకుంటూ మౌనంగా ఉండిపోయింది శాంత ఛాయ మొహంలోకి చూస్తూ తర్వాత చెప్పింది.

"ఏం లేదు"

ఛాయ తెల్లబోయి చూడటం గమనించి అన్నది.

"ఉంటే తర్వాత చెపుతాను, మరచిపోయాను."

తనతో తెచ్చుకున్న సంచిలోంచి తువ్వాలు తీసుకుని స్నానం చేసింది ఛాయ. అందరికన్నా ముందే బయట చలిగా ఉన్నప్పుడు వేన్నీళ్ళు స్నానం చేస్తుంటే ఎంత హాయిగా ఉంటుంది అనుకుంది స్నానం చేస్తూ.

## 2

ఛాయకి ఆ ఇంట్లోని అందరినీ పరిచయం చేశాడు సోమయాజులు, లేదా పరిచయం చేసుకున్నారు. చివరబ్బాయి అవధాని మాత్రం ఊళ్ళో లేడు. తిరుపతి వెళ్ళాడు మొక్కు తీర్చుకోడానికి, రెండూ మూడు రోజుల్లో వస్తాడు తిరిగి.

ఛాయకి శర్మని, అతని భార్య పరిచయం చేసింది ఆరోజు ఉదయం.

"నమస్తే" అన్నాడు శర్మ నవ్వుతూ.

ఛాయకి "నమస్తే" అని చెప్పాలని తెలియదు. చూస్తూ నిలబడింది అలాగే. శాంత చెప్పింది ఎవరినయినా పరిచయం చేస్తే "నమస్తే" అనాలని.

"సత్తెనపల్లి కాదిది చిక్కడపల్లి" అన్నాడు శర్మ మరోసారి నవ్వి.

ఛాయకి శర్మ నచ్చలేదు. అవసరం ఉన్నా లేకపోయినా అదేపనిగా నవ్వుతాడు. ముప్పైఅయిదేళ్ళుంటాయి. కొంచెం కొంచెం ముందు భాగంలో వస్తున్న బట్టతల, నవ్వినప్పుడు తెలుస్తుంది పైవరుసలో మధ్య పన్ను లేదని. కళ్ళు చూపు కోపంగా ఉంటాయి ఎప్పుడూ. గడ్డం కూడా చెవుల క్రింద నెరవటం ప్రారంభించింది. మొహంలోకి చూడగానే కనబడేవి మీసాలు. అర్ధచంద్రాకారంలో క్రిందకి దిగాయి రెండు మొనలు.

ఉదయం డ్యూటీ ఉందని ఏడున్నరకే కాఫీ తాగి వెళ్ళిపోయాడు శర్మ. ఎనిమిదిన్నరకల్లా దాదాపు పన్నెండు మైళ్ళ దూరంలో ఉన్న ఫ్యాక్టరీలో ఉండాలి. ఆ ఫ్యాక్టరీ బస్ వచ్చి తీసుకెళుతుంది వాళ్ళని. సాయంత్రం అయిదులోగా తిరిగి వచ్చేస్తాడు కంపెనీ షిఫ్ట్ బస్సులో.

దీక్ష సాధారణంగా తొమ్మిదిన్నర లోపల నిద్రలేవడు. చిన్నప్పటినుంచీ అదే అలవాటు. రాత్రి ఎప్పుడు పడుకున్నా, ఉదయం తొమ్మిదిన్నర, పది మధ్యే లేచేది. సోమయాజులకి ఎవరయినా అంతసేపు నిద్రపోవటం అంటే గిట్టదు. దీక్షకి అందరిలాగా ఉదయం లేవటం అతనికి కానిపని. నిద్రలో ఎవరయినా లేపితే లాగి లెంపకాయ కొట్టి పడుకుంటాడు, ఎవరయినా సరే.

దీక్షకి ఇరవై తొమ్మిది. కానీ పాతికేళ్ళన్నా నమ్మరు. సన్నగా, తెల్లగా, అందంగా హుందాగా ఉంటాడు. అవసరం అయితే కానీ మాట్లాడడు. ఒకోసారి అవసరం అయినా మాట్లాడడు. ఒంటరిగా, మౌనంగా ఉండాలంటేనే ఇష్టం దీక్షకి.

చుట్టుపక్కల ఎంతమందున్నా, వాళ్ళేం తనకు పట్టనట్లు కూర్చుంటాడు.

బాబుకి నాలుగేళ్ళు, సంవత్సరం నుంచీ విపరీతంగా అల్లరి చేయడం నేర్చుకున్నాడు.

ఆఖరి అబ్బాయి అవధాని, ప్రస్తుతం ఇంట్లో లేడు.

ఉదయం ఆరింటికి బాయిలర్ అంటించడంతో ప్రారంభిస్తుంది ఛాయ తన దిన చర్య. అన్నింటినిండా నీళ్ళు పట్టి స్నానం చేసి

దేముడికి దణ్ణం పెట్టుకోవటం, తనకి తెలిసిన ఆంజనేయ దండకం పదేపదే బయటికి చదవుతూ గ్యాస్ స్టౌవ్ వెలిగించి అంతా నిద్ర లేచేలోపలే కాఫీ కలపడం, శాస్త్రికి ఉదయం డ్యూటీ ఉంటే ఎనిమిది లోపలే అతనికి మాత్రం అన్నం వండడం, బాబుని లేపి నీళ్ళుపోసి బట్టలు వేయడం, సోమయాజులు భార్య కామేశ్వరమ్మకి కావల్సినవి చూడటం వంట చేసి శాంతకి ఆఫీసు టైం లోపల వడ్డించడం, అందరి భోజనాలయాక వంటిల్లు సర్ది కంచాలు కడగటం, ఇల్లు సర్దటం, బట్టలు ఉతకటం, ఓ గంట పడుకుని లేచి టీకాచడం శాంత ఆఫీసునుంచీ తిరిగి వచ్చేలోగా టిఫిన్ చేయడం, రాత్రి వంట చేయడం.

వారం తిరక్కుండానే ఛాయ తను చెయ్యాల్సిన పనులు తెలుసుకుని చేసుకుపోసాగింది. మొదటి నాలుగు రోజులు శాంత, కామేశ్వరమ్మ ఏం చేయాలో ఎలా చేయాలో చెప్పారు. వారం దాటాక ఛాయ ఏం చేయాలో, ఎలా చేయాలో నేర్చుకుంది, ఇంక మళ్ళీ తనకి మరొకరు చెప్పాల్సిన అవసరం లేకుండా.

కామేశ్వరమ్మ అన్నది సోమయాజులతో,

"ఛాయ చాలా బుద్ధిమంతురాలు, వంచిన తల ఎత్తకుండా చేసుకుపోతుంది పని. పని ఉంటే చేయకుండా ఊరుకోలేదు. తర్వాత చేద్దామని వాయిదా కూడా వేయదు. గొణగకుండా ఇంటిల్లపాది పనీ చేసుకుపోతుంది. ఇంత పనివంతురాలు అనుకోలేదు మొహం చూసే"

"ఎలాగయినా పట్నవాసులు పట్నవాసులే, పల్లెటూరి నుంచి వచ్చినవాళ్ళు పల్లెటూరి నుంచీ వచ్చినవాళ్ళే, పని విషయంలో ఆరోగ్య విషయంలో "

"మీరు నన్నేం దెప్పక్కర్లేదు."

కామేశ్వరమ్మ విశాఖపట్నంలో పుట్టి పెరిగింది. సోమయాజులు సత్తెనపల్లి దగ్గర ఓ పల్లెటూరులో పుట్టి పెరిగాడు.

"పని చేయాలి అని కోరిక ఆ పిల్లకి బాగా ఉన్నట్లుంది. రోజూ సంధ్యావందనానికి నాకు పీట, విభూదీ పెడుతోంది అడక్కుండానే. మడీ నీళ్ళు మాత్రం పట్టుబట్టలతో నేనే తెచ్చుకుంటున్నాను."

"కేవలం మెప్పు కోసం కాదు."

"అవును, సహజానందంగారు మంచమ్మాయినే పంపారు. ఛాయ గురించి వివరాలు అడిగి తెలుసుకోమన్నాను అడిగావా?"

"లేదు మనకింకా అంత చనువెక్కడ ఏర్పడింది? రాగానే అడిగితే బాగుండదని అడగలేదు. నెమ్మది మీద అడుగుతాను. మనకి ఛాయలాంటి కూతురు పుడితే ఎంత బావుండేదో?"

"లేనిదాన్ని కావాలనుకోవటమే మానవ లక్షణం" అన్నాడు సోమయాజులు చిన్నగా

❀❀❀❀

ఈ నవల సినిమా కావడం వెనుక సంగతులు

*హిందీలో 'కుఁవారి బహు'(పెళ్ళికాని కోడలు) గా ఈ నవల చలనచిత్రంగా రూపొందించబడి 1984లో విడుదలైంది. ఐతే ఈ నవలని తెలుగులో సినిమాగా తీద్దామని చాలామంది అంతకుముందు ప్రయత్నించారు.*

*మొట్టమొదట దీన్ని నవలగా ప్రచురించిన నవభారత్ బుక్ హౌస్ ప్రొప్రయిటర్ శ్రీ ప్రకాశరావు 1975లో ఓ టెలిగ్రామ్ పంపారు నాకు. దీన్ని లక్ష్మీదీపక్ దర్శకత్వంలో సినిమాగా తీద్దామనుకుంటున్నానని, ఎవరడిగినా తను కాదంటేనే ఇవ్వమని. తర్వాతెప్పుడో కలసినప్పుడు చెప్పారు, క్లయిమేక్స్ ఏం చెయ్యాలో తెలియక ఆ ప్రయత్నం విరమించుకున్నానని.*

*1977 లో మద్రాసులోని ఓ నిర్మాతకి ఇది నచ్చిందని ఫిల్మింగ్ రైట్స్ కావాలని, హైదరాబాదులోని ఓ డిస్ట్రిబ్యూటర్ ఫోన్ చేసి రెండు కాపీలు అడిగి తీసుకున్నారు. అదీ అక్కడితో అంతే సంగతులు...*

*- రచయిత*

## 3

**ఛాయ** మధ్య హాల్లో ఉన్న ఫోటో ముందు నిలబడి చూడసాగింది. పనంతా అయ్యాక ఛాయకి కామేశ్వరమ్మ ప్రక్కన, మంచం మీద కాసేపు కూర్చుని ఏదయినా మాట్లాడటం అలవాటు. ఆవిడ నిద్రపోగానే లేచి, గోడకి వేలాడే ఫోటోలని వింతగా చూడటం అలవాటు. అలా ఓసారయినా చూడకపోతే తృప్తిగా ఉండదు.

ఆ ఫోటోలలో అనేక మంది ఉన్నారు. తను చూసిన వాళ్ళని తప్ప, బయటవాళ్ళని గుర్తుపట్టలేదు ఛాయ. శర్మ తను వచ్చిన మూడోరోజు చెప్పాడు, ఆ ఫోటోలో వాళ్ళు ఎవరెవరో.

ఫోటోల వంక చూస్తుంటే, వీధి తలుపు తట్టినట్లు చప్పుడు వినబడింది. గబగబా వెళ్ళింది ఛాయ, బయట నుంచి వీధి తలుపు ఎవరో ఆగకుండా బాదుతుంటే.

తలుపు తెరిచి, చటుక్కున ఓ అడుగు వెనక్కి వేసింది విభ్రాంతిగా.

గుమ్మం అవతల నిలబడి ఉన్నాడో కుర్రాడు. ఆ కుర్రాడిని చూసి కాదు ఛాయ వెనక్కి తప్పుకుంది, ఆ ఆకారాన్ని చూసి. ఇరవై పైనే ఉంటాయి అతనికి.

"ఎవరు కావాలి?" అడిగింది.

ఆ కుర్రాడు కూడా తనలాగే తెల్లబోయి చూస్తూండటం గమనించి అన్నది.

"ఎవరు కావాలో చెప్పండి?"

ఆ కుర్రాడి వంటి మీద నడుమునుంచి కట్టుకున్న టర్కీటవల్ తప్ప మరేం లేదు. భుజానికి మాత్రం జంధ్యం వ్రేలాడుతోంది. నున్నగా మెరుస్తోంది గుండు. కట్టుకున్న ఆ టవల్ కూడా మాసిపోయి ఉంది.

అతను లోపలికి వచ్చాడు, ఛాయవంక ఎగాదిగా చూస్తూ.

"ఎవరు మీరు?" అన్నది ఛాయ గాభరాగా.

"మీరెవరు?" అతను లోపలికి వెళ్ళాడు ఛాయని రాసుకుంటూ "అమ్మా అమ్మా" అని గట్టిగా పిలుస్తూ.

ఆ కుర్రాడు వెళ్ళి కామేశ్వరమ్మ మంచం మీద కూర్చోవడం, ఆవిడ లేవడం గమనించి తలుపు దగ్గరికి వేసి లోపలికి వచ్చింది ఛాయ.

"ఏమ్రిటా ఇది? ఇదేం అవతారం? ఎప్పుడొచ్చావ్? ఎవరింట్లోనయినా దిగావా?" కామేశ్వరమ్మ లేచి కూర్చుని అడిగింది చిన్నకొడుకుని.

"ఈ అమ్మాయి.." ఛాయ వంక చూస్తూ అన్నాడు అనుమానంగా.

"ఛాయ, సత్తెనపల్లి నుంచీ సహజానందంగారు పంపించారు."

"ఎందుకు?"

"ఎందుకేమిటి? అప్పుడు మనం అనుకోలా, బాబుని చూసుకునేందుకు ఎవరయినా తోడువుంటే బావుంటుందని."

"గుర్తొచ్చింది. నన్ను చూసి ఎవరు మీరు ఎవరు కావాలి?" అని గుమ్మంలో నిలబెట్టి అడుగుతుంటే పొరపాటున మరో ఇంటికి వచ్చానా అని బిత్తరపోయాను.

"కూర్చో ఛాయ! మా మూడో అబ్బాయి అవధాని, తిరుపతి వెళ్ళాడని చెప్పానే, వాడు."

"నమస్తే" అన్నది ఛాయ.

"అది సరే నీ సామానేది? ఏమిటీ వేషం? ఆ సంగతి చెప్పవేం?" అడిగింది కామేశ్వరమ్మ.

"అదో పెద్ద కథ. చెప్పుకుంటే సిగ్గుచేటు" అన్నాడు అవధాని ఛాయవంక ఓరగా చూస్తూ.

"ఏం జరిగిందో చెప్పు. ట్రైన్‌లో ఎవరయినా కొట్టేశారా?"

"కాదు. కొండ మీదే పోయింది!"

"తిరుపతి కొండమీదా?"

"అవును. అక్కడే"

"ఏం జరిగిందో చెప్పి చావరా, డబ్బు దస్కం, బట్టలు అన్నీ పోయాయా?" కోపంగా అడిగింది కామేశ్వరమ్మ.

"అన్నీ పోయాయి. ఈ తువ్వాలు మాత్రం మిగిలింది. నిన్న మద్రాస్ నుంచీ తిరుపతి వెళ్ళాను..."

"ముందర మద్రాస్ వెళ్ళావా?"

"అవును,"

"నీ బొంద. ముందర తిరుపతి వెళ్ళి ఆ తర్వాత మద్రాసు వెళ్ళమన్నామా? తిరుపతికే టిక్కెట్ కొన్నానన్నావుగా? మాతో అబద్ధం చెప్పి మద్రాస్‌కి కొన్నావా టిక్కెట్?"

"అవును"

"తిక్క రోగం కుదిరింది. జరిగిందేమిటో చెప్పేడు" రౌద్రంగా అన్నది కామేశ్వరమ్మ. తెల్లబోయి వింటూండిపోయింది ఛాయ అవధాని చెప్పేది.

"మద్రాస్ నుంచీ నిన్న పొద్దున చేరుకున్నాను తిరుపతి. కొండమీదకి వెళ్ళాను. ధర్మసత్రంలో గది ఫ్రీగా ఇస్తారని తెలిసి ఓ గది తీసుకున్నాను. ముందర మొక్కుతీర్చుకుందామని క్షవరానికి డబ్బులు తీసుకుని, తువ్వాలు ఒకటి కట్టుకుని, ఇంకొకటి వంటిమీద కప్పుకుని సబ్బుబిళ్ళతో కళ్యాణ ఘట్టానికి వెళ్ళాను. వెళుతూ, వెళుతూ నా గదికి తాళం వేసుకున్నాను నా సూట్ కేసుదే. క్షవరం చేయించుకుని ఓ బక్కెట్ వేడినీళ్ళు కొనుక్కుని స్నానం చేశాను. నా గదికి వచ్చాను. తాళం లేదు, తలుపులు తెరిచి ఉన్నాయి. లోపల నా సూట్ కేస్ గానీ, బట్టలు కానీ ఏమీ లేవు, ఆ సత్రం నాలుగయిదు అంతస్తులుంది. ఒక అంతస్తు బదులు మరో అంతస్తులోకి వెళ్ళానేమోనని అన్నీ చూశాను కానీ ఏ గదికీ నేను వేసిన తాళం కనిపించలేదు. కింద నా పేరు చెప్పి నా గది నంబర్ అడిగాను. వాళ్ళు నాకిచ్చిన గదే నేను మొదట వెళ్ళింది. నేను లేనప్పుడు ఎవరో నా గది తాళం తీశారు మారు తాళం చెవితో. నా సామాను, డబ్బు అంతా కొట్టేశారు నిన్నీపాటికల్లా."

"గదికి నీ సూట్‌కేస్ తాళం అంటే, ఆ మిల్లర్ లాక్ వేశావా?"

"అవును అదే"

"నీ తెలివి తెల్లారినట్టే ఉంది. గదికి ఆ చిన్న నంబర్ లాక్ వేసుకుంటారా పరాయి చోట? ఒంటి మీద రెండు తువ్వాళ్ళు తప్ప మరేమీ లేవా అప్పుడు? చెప్పులు?"

"చెప్పులు కూడా గదిలోనే వదిలేశాను, స్నానానికి వెళ్ళేటప్పుడు ఎక్కడ వదలాలో తెలియక."

"శుభ్రంగా బట్టలు కట్టుకుని వెళ్ళకుండా కళ్యాణ ఘట్టానికి తువ్వాళ్ళు చుట్టుకుని వెళ్ళాల్సిన కర్మేం పట్టిందీ!'

"వాటితో వెళ్ళినా, నన్ను చూసేవాళ్ళెవరూ లేరు. తెలిసిన వాళ్ళెవరూ లేరు అంతా కొత్తవాళ్ళే. బట్టలు కట్టుకెళితే తర్వాత తడపాలి. అంతే కాక, చాలామంది టవల్స్‌తో వెళుతూంటే..."

"ఆ తర్వాత ఏం చేశావ్ మరి?"

"పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి రిపోర్టు చేయుమంటే, రిపోర్టు చేశాను."

"తువ్వాలుతోనే?"

"అవును, తువ్వాలుతోనే. వాళ్ళు నా వెంట వచ్చి ఆ గదీ, అదీ చూశారు. దర్యాప్తు చేస్తామన్నారు. నేను అయిదారుగురిని అప్పు ఇమ్మని అడిగాను జరిగింది చెప్పి. ఎవరూ ఇవ్వలేదు. అసలు నేను చెప్పిందే నమ్మినట్లు కనబడలేదు ఇంక ఎవరినడగాలన్నా సిగ్గేసింది."

"ఆ తర్వాత?"

"ఏం చేయాలో తోచలేదు. నడిచి కొండ దిగి కిందకి వచ్చేశాను... దిగడం కష్టం కాదులే. నాలుగ్గంటల్లో దిగేశాను."

"తువ్వాలుతోనే?"

"అవును. కొండ దిగి కింద షాపుల్లో, కొంతమంది ప్రయాణీకుల్ని అప్పడిగాను. ఇంటికి వెళ్ళగానే మనియార్డరు చేస్తానన్నాను. కానీ ఎవరూ డబ్బివ్వలేదు. ఎలానో తంటాలు పడితే యాభైరూపాయలదాకా పోగయ్యాయి."

"ఎలా?"

"కొంతమంది పదిపైసలు, పావలాలు ఇచ్చారు."

"శివశివా  తర్వాత?"

"దాంతో టిఫిన్ తిని, రైలెక్కాను."

"తువ్వాలుతోనే?"

"తువ్వాలుతోనే, తువ్వాలుతోనే అంటావే పదేపదే తువ్వాలుతోనే. అదికూడా ఉండకూడదా? డ్రాయర్‌తోనే రావాలా? దేముడి దయవల్ల అదయినా ఉంది?"

"రెల్లో టిక్కెట్టు?"

"టిక్కెట్టా పాడా? రాత్రంతా నిద్రలేకుండా ఎక్కడ టి.సి. వచ్చి పట్టుకుంటాడో అని మేలుకుని జాగారం చేస్తూనే ఉంటే. గుంటకల్లో బండి మారి ఇక్కడికి రావడానికి నేపడ్డ అవస్థ పగవాళ్ళకి కూడా వద్దు. రైల్లో ప్రతీ వాళ్ళు 'బట్టలు వేసుకోరే? బట్టలు వేసుకోరే?' అని అడిగేవాళ్ళే."

"మరయితే ఇంకో తువ్వాలేది?"

"రైల్లో ఎవడో కొట్టేశాడు అదికూడా. ఏ.టి.సి చేతుల్లో పడకుండా ఇంటికి వచ్చి చేరాను."

"స్టేషన్ నుంచీ ఎలా వచ్చావ్?"

"అరెరె, మాటల్లో మర్చిపోయాను. ఆటోలో వచ్చాను. వాడికో రెండున్నర ఇవ్వాలి. బయట వెయిట్ చేస్తున్నాడేమో, ఓ మూడు రూపాయలుంటే ఇవ్వమ్మా."

కామేశ్వరమ్మ మాట్లాడకుండా మూడు రూపాయలు తీసి అందించింది కొడుక్కి ముఖంలో కోపాన్ని ప్రదర్శిస్తూ.

ఆటోని పంపించి వచ్చాక అన్నది కోపంగా. "ఇంకా ఆ తువ్వాల్లోనే తగలడతావే. బట్టలు కట్టుకో."

"స్నానం చేయాలి ముందర, ఒళ్ళంతా దుమ్ము దుమ్ము, తర్వాత అన్నం తినాలి కడుపునిండా, అన్నం తిని ఓ రోజు దాటింది. ఆ తర్వాత హాయిగా నిద్రపోవాలి, రైల్లో నిద్రపోతే టి.సి. పట్టుకుంటాడని ఓ క్షణం కూడా నిద్రపోలేదు."

"చదవటం బి.ఎస్సీ చదివాడు. అయితేనేం బుర్రనిండా వట్టి మట్టి. ఈసారి చిక్కుడు గింజలు దొడ్లో నాటే బదులు వీడి నెత్తిన నాటితే సరి. ఛీ, ఛీ తిరుపతి నుంచీ తువ్వాల కట్టుకుని వచ్చాడుట తువ్వాల. ఏ వియ్యాలవారో అదే బండిలో వస్తూ చూస్తే నవ్వరూ?" కామేశ్వరమ్మ గొణుగుతూనే ఉంది చాలాసేపు.

సాయంత్రం శర్మ, శాంత, దీక్ష, సోమయాజులు ఇంటికి రాగానే జరిగింది చెప్పింది కామేశ్వరమ్మ. శర్మ విరగబడి నవ్వాడు. దీక్ష చిన్నగా నవ్వి "పాపం" అని లోపలికి వెళ్ళిపోయాడు, సోమయాజులు మండిపడ్డాడు. శాంత మరిదిని లేపడానికి వెళ్ళింది.

లేపుదామనుకుని, మళ్ళీ ఆ ప్రయత్నం విరమించుకుని తన గదిలోకి వెళ్ళిపోయింది నవ్వుకుంటూ.

"ఇలాంటి వెధవకి ఉద్యోగం దొరికినా ఏం చేస్తాడు?" సోమయాజులు, కామేశ్వరమ్మ అవధానిని తిట్టసాగారు.

అవధాని మాత్రం హాయిగా నిద్రపోసాగాడు, తువ్వాలు, టి.సి. లాంటి భయాలేమీ లేకుండా.

మర్నాడు గుండుకి టోపీ కొనుక్కోవాలని పదిరూపాయలు ఇవ్వమని అడిగాడు అవధాని కామేశ్వరమ్మ.

"పది రూపాయలు కాదుకదా, పైసా కూడా ఇవ్వను. ఎంత ఖరీదయిన బట్టలు పారేశావ్? అసలు ముందర తిరుపతి వెళ్ళమంటే, మాతో అబద్ధం ఆడి తిరుపతికి వెళ్ళకుండా మద్రాసు దేనికి వెళ్ళినట్టు?"

"గుండుతో ఎలా బయటికి వెళ్ళటం?"

"జుట్టు పెరిగేదాకా ఇంట్లో కూర్చో."

ఇంట్లో కూర్చోలేదు అవధాని. నిజానికి కూర్చోలేడు కూడా. సుందరిని చూడాలి అవధాని. వదినని అడిగాడు ఓ పదిరూపాయలు వుంటే ఇమ్మని.

"మీ అమ్మగారు ఇవ్వనన్నారా?" అడిగింది శాంత నవ్వుతూ.

"మీకు తెలుసుగా ఆవిడ సంగతి?" సమాధానం చెప్పాడు అవధాని.

"ఎడ్వాన్స్‌కి అప్లయ్ చేసి, వచ్చాక రెండు మూడురోజుల్లో ఇస్తాను. ఏం?"

"పది లేదంటే నమ్మను. ఇస్తే ఇప్పుడే ఇవ్వండి లేకపోతే బయట ఎవరి దగ్గరయినా తీసుకుంటాను."

"ఇది తిరుపతి కాదుగా. ఎవరయినా ఆ మాత్రం అప్పివ్వకపోరు."

నవ్వుతూ హేండ్‌బేగ్ తెరచి పది రూపాయలు తీసి అందించింది శాంత, మరిదికి.

"నాకు ఉద్యోగం రాగానే తిరిగి ఇచ్చేస్తాను."

"మంచిదే అలా అయితే నీ మొదటి జీతం అంతా నాకు ఇవ్వాల్సి ఉంటుంది. నేను రాసుకుంటున్నానులే నీ కిచ్చేదంతా."

"థాంక్స్."

"ముందర మద్రాస్ ఎందుకు వెళ్ళావో చెప్పనేలేదు ఇంతకీ?"

"సినిమా ఏక్టర్లని చూద్దామని వెళ్ళాను."

"తిరుపతిలో దేముడిని చూశాక వెళితే ఏమవుతుంది? కోప్పడతారా వాళ్ళు?"

"సినిమా ఏక్టర్ల దగ్గరికి అసహ్యంగా గుండు వేసుకుని వెళితే ఏం బావుంటుంది? నన్ను చూసి నవ్వుకోరూ!"

## 4

ఛాయ ఆ ఇంటికి వచ్చి పదిరోజులు దాటిపోయాయి. ఛాయకి ఆ ఇంట్లోని మనుష్యులు మనస్తత్వాలు పూర్తిగా అర్థం అయ్యాయి. వాళ్ళలోని మంచీ, చెడు కూడా అర్థం అవుతున్నాయి. బలహీనతలు ఒక్కొక్కటే బయట పడుతున్నాయి ఛాయ ముందు.

శాంతకి అనుమానం ఎక్కువ. వీలయినంతవరకు తన భర్త పనంతా తనే చూసుకుంటుంది. ఇంట్లో వున్నంతసేపు, శర్మ ఛాయ దగ్గరికి వెళ్ళకుండా జాగ్రత్త పడుతుంటుంది.

శర్మ మాత్రం శాంత ఇంట్లో వున్నా, లేకపోయినా ఛాయతో అవసరమున్నా, లేకపోయినా తన ఇష్టం వచ్చినప్పుడు ఛాయ దగ్గరకి వెళ్ళి కబుర్లు చెపుతుంటాడు నిర్మొహమాటంగా.

శర్మ మాటల్లో హాస్యం, చాకచక్యం, నేర్పు మిళితమయి ఉంటాయి. విసుగనిపించవు వింటుంటే.

దీక్షకి ఛాయతో మాట్లాడాలని వున్నా, అన్నయ్యలా ధైర్యంగా వెళ్ళి మాట్లాడలేడు. అందరిముందూ, అందరికీ తెలిసేలా మాట్లాడాలంటే బెరుగ్గా ఉంటుంది మనసులో. అందుకనే అవసరం అయినా పిలవడు ఛాయని. ఎవరూ లేనప్పుడు మాత్రం వంటరిగా ఛాయతో కాసేపు మాట్లాడతాడు ఏదో ఒకటి.

అవధానికి ఇల్లు పట్టదు. ఇంటిలో ఉండే సమయమే తక్కువ. ఉన్న కాసేపు తల్లి దగ్గర కుర్చుని కబుర్లు చెపుతాడు. లేదా వంటగదిలో డబ్బాలు సర్దుతాడు అటుకులు, వేరుశెనగపప్పు, వేయించిన శెనగపప్పు, పచ్చి ఒడియాలు, జీడిపప్పు వాటికోసం.

ఓరోజు పనంత అయ్యాక ఛాయ తను రోజూ పడుకునే పెద్ద మంచం మీద పడుకుంటే శర్మ వచ్చి, గుమ్మం దగ్గర నించుని అడిగాడు.

"మేం సినిమాకు వెళుతున్నాం, నువ్వూ వస్తావా?"

"రాను" చెప్పింది ఛాయ.

"పోనీలే, ఇంకోరోజు వెళ్ళేటప్పుడు వద్దువుకాని" అని ఆగి కాసేపు ఛాయవంక చూశాడు.

శర్మ కళ్ళని చూసి భయపడింది ఛాయ. ఆ కళ్ళలో ఎప్పుడూ ఉండే కోపంతో పాటు ఈసారి కోరికలాంటి భావం ఏదో స్పష్టంగా ఛాయకి తోచింది.

చప్పున తల దించుకుని, కొంగుతో భుజాలు కప్పుకుంది. శర్మ గుమ్మానికి ఆనుకుని అన్నాడు.

"ఈ మంచం కథ తెలుసా నీకు?"

ఛాయ సమాధానం చెప్పలేదు.

"నువ్వు పడుకుంటున్న మంచం, చాలా పాతది. చాలా చాలా పాతది. సత్తెనపల్లి నుంచీ తెప్పించారు దాన్ని లారీలో ప్రత్యేకంగా ఎందుకో తెలుసా?"

ఎందుకన్నట్లుగా చూసింది ఛాయ. ఈసారి శర్మ కళ్ళల్లో కోపం లేనేలేదు. ఏదో మృదుత్వం చోటు చేసుకుంది.

"ఆ మంచమే మాకు జన్మనిచ్చింది. మా తాతగారు బామ్మగారు, మా నాన్న, అమ్మ, తర్వాత నేను, శాంత, ఇంకా దీక్ష, వాడి భార్య, రేపు అవధాని, వాడి పెళ్ళాం. మా అందరికీ మొదటి రాత్రి ఆ మంచం మీదే గడిచింది. ఇప్పుడు నువ్వా మంచం మీద పడుకుంటున్నావు."

శర్మ గిరుక్కున వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు, శాంత తనకోసం ఎదురు చూస్తుంటుందని.

ఆ రాత్రి ఛాయకి చాలాసేపు నిద్రపట్టలేదు. శర్మ మాటలే చెవుల్లో గింగురుమంటున్నాయి, "ఇప్పుడు నువ్వా మంచం మీద పడుకుంటున్నావు -"

ఛాయ ఆ మంచం మీద రోజూలాగా ప్రశాంతంగా పడుకోలేకపోయింది. నిద్రపట్టలేదు. ఆ మంచం మీద కాసేపు అడ్డంగా పడుకుంది. కాసేపు నిలువుగా పడుకుంది. దొర్లింది అటు ఇటు. రెండు గుప్పిళ్ళతో బూరుగు దూది పరుపుని గట్టిగా పట్టుకుంది. వెల్లకితలా పడుకుంది కాసేపు, బోర్లా పడుకుంది కాసేపు. కుడిప్రక్కకి తిరిగి కాసేపు ఎడమ పక్కన తిరిగి కాసేపు పడుకుంది. చివరికి లేచి కూర్చుని దాని వంక చూసింది.

మల్లెపూలు, పూలదండలతో అలంకరిస్తే ఎలా ఉంటుందా మంచం? తెల్లటి దుప్పటి పరిస్తే ఎలా ఉంటుంది? అగరొత్తులు వెలిగిస్తే ఆ గది ఎలా ఉంటుంది.

మళ్ళీ పడుకుంది.

సెకండ్ షో చూసి శర్మ. శాంత తిరిగి వచ్చినా ఇంకా నిద్రపట్టలేదు ఛాయకి ఆ మంచం మీద.

ఛాయకి నిద్రపడుతుందని శర్మకూడా అనుకోలేదు.

## 5

"ఛాయా, పనయిందా? ఇలా కూర్చో" కామేశ్వరమ్మ ప్రక్కకి జరిగింది.

ఛాయ మంచం ప్రక్కన కూర్చుంది.

"పాలు తోడేశావా?" అడిగింది.

తల ఊపింది ఛాయ.

"నువ్వు హైదరాబాదు వచ్చి ఇవాల్టికి సరిగ్గా పదిహేను రోజులయింది కదూ?"

"అవును."

"ఎలా ఉంది నీకిక్కడ?"

"బాగానే ఉంది."

"ఏమైనా ఇబ్బంది కలుగుతోంది?"

"దేనికీ? ఇబ్బందేమీ లేదు."

"ఉంటే, మొహమాటం లేకుండా చెప్పమ్మా. నా మనసులో ఏం ఉంటే అది బడబడ వాగే స్వభావం నాది. అలాగే నువ్వు కూడా చెప్పు."

ఛాయ మౌనంగా ఉండిపోయింది - చెప్పాల్సిందేమీ లేదన్నట్లుగా.

"వచ్చినప్పటినుంచీ నిన్నోటి అడగాలనుకుంటున్నాను. ఆయన కూడా అడగమన్నారు."

"అడగండి"

"అదే మీ అమ్మా నాన్నలగురించి, వాళ్ళ గురించి మాకేం తెలియదు. నీకు తోబుట్టువు లెవరూ లేరా?

"లేరు. నేనొక్కతినే. నేను పుట్టిన సంవత్సరంలోపే మా నాన్న పోయారట. రాజకీయాలవల్ల మా నాన్నని అయిదారుగురు కలిసి, ఊరి చివర కర్రలతో కొట్టికొట్టి చంపేసారుట. ఆస్పత్రిలో స్పృహ ఉండగానే పోలీసులు అడిగారుట కొట్టిన వాళ్ళెవరో చెప్పమని, చెపితే కసితో మమ్మల్ని కూడా చంపేస్తారని భయపడి చెప్పలేదు ఆయన.

ఆస్తేమీ లేదు మాకు. అప్పటి నుంచీ అమ్మ వంట పనిచేయటం మొదలుపెట్టింది. మా అమ్మ వైపు బంధువులెవరూ లేరు దగ్గరవాళ్ళు. నాన్నవైపు వాళ్ళు మా సంగతి పట్టించుకోవడంతో, అమ్మ వంటమనిషిగ స్థిరపడిపోయింది సంఘంలో.

నాలుగేళ్ళ క్రితం చచ్చిపోయింది అమ్మ. మొదటి నుంచీ అన్ని పనులూ నేను నేర్చుకోవడంవల్ల అట్టే ఇబ్బంది లేకపోయింది. అదృష్టవశాత్తు నేను పనిచేసిన ఇళ్ళవాళ్ళందరూ మంచివాళ్ళే. ఎవరితోనూ ఒక్క మాటపడకుండా నెగ్గుకొచ్చాను ఇంతకాలం. సహజానందంగారు చెప్పిన మీదట మొదటిసారిగా సత్తెనపల్లి వదిలి ఇక్కడికి వచ్చాను."

"శాంతతో చెప్పాను. సాయంత్రం శాంత ఆఫీసు నుంచీ రాగానే నిన్ను బయటికి తీసుకెళ్ళి, నీకు బట్టలు కొనిపెడుతుంది. మరీ చిరిగిపోయేటట్లుగా ఉన్నాయి నీవి."

వద్దు అనలేదు ఛాయ. అలాగే అనికూడా అనలేదు. మౌనంగా ఉండిపోయింది.

"ఇంకా ఏం కావాలో మొహమాటపడకుండా అడిగి అన్నీ కొనుక్కో."

"అలాగే"

సాయంత్రం శాంతతో బయటకి వెళ్ళింది. మొదటిసారిగా చిక్కడపల్లిలోని ఆ ఇంట్లోంచీ బయటికి వెళ్ళింది ఛాయ, తను ఆ ఇంట్లో అడుగు పెట్టినప్పటి నుంచీ.

సత్తెనపల్లి, విజయవాడ మాత్రమే తెలుసు ఛాయకి. హైదరాబాద్ గురించి చాలాసార్లు చెప్పుకోగా వింది. కానీ సుల్తాన్ బజారులో అడుగు పెట్టగానే శాంత చేయి గట్టిగా పట్టుకుంది. ఆ సందులోంచి రద్దీని చూసి, తను మారిపోతే ఇక మళ్ళీ ఇంటికి చేరుకోవడం దుర్లభం అనిపించింది.

శాంత మనసులోనే నవ్వుకుంది ఛాయ భయానికి. గాజులు, రెండు చీరలు, తిలకం, రిబ్బన్లు, జాకెట్ బట్ట, చెప్పులు లాంటివి రెండువందల ఏభై ఖర్చు పెట్టి కొన్నది శాంత కోసం ఛాయకోసం.

తనకోసం అంత డబ్బు ఖర్చు పెడతారని తెలియదు ఛాయకి. ఆశ్చర్యం, సంతోషం కూడా కలిగాయి.

"నాకు చీరెలు అలవాటు లేదు. లంగా ఓణీలే ఇప్పటి దాకా వేసుకుంటున్నాను" చీర కొంటుంటే అన్నది ఛాయ కొద్దిగా ఇబ్బందిగా.

శాంత నవ్వింది కానీ సమాధానం చెప్పలేదు. చీరలే కొంది. షాపింగ్ పూర్తయ్యాక ఛాయని దగ్గరే వున్న ఓ హోటల్‌కి తీసుకెళ్ళింది. ఆడవాళ్ళు, మొగవాళ్ళు కలిసి వచ్చి తినటం, వాళ్ళు విడిగా కూర్చోటానికి అనువుగా చేసిన ఏర్పాట్లు ఛాయని మరింత ఆశ్చర్యపరిచాయి. ఈ ఊళ్ళో ఇంతేకామోసు అనుకుంది.

రిక్షా మాట్లాడింది శాంత. ఇద్దరూ రిక్షాలో కూర్చున్నారు. ఛాయ వింతగా జనప్రవాహాన్ని, డబల్ డెక్కర్స్‌ని, కార్లని, లైట్లని చూడటం గమనించి నవ్వుకుంది శాంత. కాసేపాగి అన్నది ఛాయతో శాంత.

"ఛాయా!"

"ఊఁ" బదులు పలికింది ఛాయ.

కాసేపు మౌనంగా ఉండిపోయింది శాంత. చూడ్డానికి ఇంత అమాయకంగా, పిచ్చిపిల్లలా ఉంది. ఛాయతో ఇలాంటి విషయం మాట్లాడొచ్చా అనుకుని తర్జనబర్జన పడింది శాంత కాసేపు.

ఇల్లు దగ్గరవుతుండగా మళ్ళీ పిలిచింది శాంత.

"ఛాయా."

"చెప్పండి."

ఈసారి ఛాయ శాంత మొహంలోకి చూసి అడిగింది చెప్పమన్నట్లుగా.

"నువ్వు ఇంతదాకా చీరలు కట్టలేదన్నావు కదూ?"

"అవును. నాకు పద్దెనిమిదేళ్ళేగా! ఇరవైరెండో, ఇరవై మూడో వస్తే కానీ కట్టక్కరలేదని, లంగా ఓణీలే కావాలన్నాను. మీరేమో చీరలే తీసుకున్నారు."

చిన్నగా నిట్టుర్చి అన్నది శాంత ఛాయతో.

"నువ్వు ఇంక ఓణీలు మానేసి చీరలు కట్టలేదన్నావు కదూ?"

"అవును. నాకు పద్దెనిమిదేళ్ళేగా! ఇరవై రెండో, ఇరవై మూడో వస్తే కాని కట్టక్కరలేదని, లంగా ఓణీలే కావాలన్నాను. మీరేమో చీరలే తీసుకున్నారు. "

చిన్నగా నిట్టూర్చి అన్నది శాంత ఛాయతో.

"నువ్వు ఇంక ఓణీలు మానేసి చీరలే వేసుకుంటూండు. ఏం?"

"అదేం? నేను లంగా, ఓణీల్లోనే బావుంటానని అంతా అంటారే."

"నిజమే. అయితే"

"మరి"

"నీకెలా చెప్పాలో తెలియటం లేదు..."

ఛాయ మనసులో ఏదో అనుమానం పొడసూపింది. శాంత కళ్ళలోకి చూసింది. మనసు కంపించింది తను భయానికి. ఛాయలోని మార్పుని గమనించి నవ్వి అన్నది శాంత.

"చీరలు కట్టుకుంటే మరీ ఇంత చిన్నపిల్లలా ఉండవు. అలా ఉండకూడదు నువ్వు."

"నా వయసు పద్దెనిమిదే నిజమే చెప్పాను."

"నువ్వు ఇరవై అన్నా ఎవరూ నమ్మరు కాని..." ఛాయవైపు చూడకుండా, రిక్షాలోంచి బయటికి చూస్తూ చెప్పింది శాంత.

"...ఇంట్లో ముగ్గురు మొగాళ్ళు తిరుగుతుంటే, నువ్వు చిన్నపిల్లలా లంగా, ఓణీల్లో ఉండటం నాకు నచ్చదు. అందాన్ని దాచుకోవాలి కానీ ప్రదర్శించకూడదు నీలాంటి వాళ్ళు. ఈ సంగతి ఎప్పటికీ గుర్తుంచుకో."

"నమస్తే. నాకు తెలియదు ఇంతకాలం" తల వంచుకుని జవాబిచ్చింది ఛాయ.

శాంత మృదువుగా నవ్వి అన్నది.

"నమస్తే కాదు, సారీ అనాలి లేదా క్షమించండి అనాలి. నీకీ సంగతి తెలుసా, మన ఆడవాళ్ళ గురించి?"

ఛాయ తలవంచుకునే తల ఊపింది తెలియదన్నట్టుగా.

"మనం వేసుకునే బట్టలు వయసుని దాయగలవు, పెంచగలవు, తగ్గించగలవు. ఎంత చిన్న పిల్ల చీర కట్టుకున్నా వయసు పెరిగినట్లు కనిపిస్తుంది. నేనే కనక లంగా, ఓణీలు వేసుకుంటే, ఇంత పెద్దదానిలా కనబడను."

ఛాయ మౌనంగా ఉండిపోయింది.

"తలెత్తి చూడు, అవునా?

ఛాయ తలెత్తి శాంత మొహంలోకి చూసి నవ్వింది అవునన్నట్టుగా.

"ఈ విషయం గురించి మాట్లాడుతున్నాం కాబట్టి, నీకు ఇంకో సంగతి కూడా చెప్పాలి" అన్నది శాంత.

"చెప్పండి" అడిగింది ఛాయ.

"ఇల్లు దగ్గరయింది, ఇప్పుడు కాదు . మళ్ళీ అవకాశం దొరికినప్పుడు చెపుతాను ఇంకోసారి."

రిక్షా వాళ్ళ ఇంటి సందులోకి తిరిగింది. ఛాయ తను ఇందాక హోటల్‌లో చూసిన అవధాని ప్రక్కన కూర్చున్న అమ్మాయి ఎవరయి ఉంటుందా అని ఆలోచించసాగింది. మధ్య హాల్లో గోడకున్న ఫోటోల్లో ఆ అమ్మాయి ఫోటో ఒక్కటీ లేదు.

### ఈ నవల సినిమా కావడం వెనుక సంగతులు

తర్వాత ఫిల్మ్ ఆర్టిస్ట్ శ్రీ టి.ఎల్.కాంతారావుకి ఈ నవల నచ్చడంతో, ౧౯౭౮ లో అనుకుంటా, నన్ను మద్రాసు పిలిపించారు. దర్శకుడు శ్రీ బీరం మస్తాన్ రావు, నేను రెండు మూడు రోజులు క్లయిమేక్స్ ఏం చేస్తే బావుంటుందని ఆలోచించాం. నేను నాలుగు రకాల క్లయిమేక్స్ చెప్పాను..

ఒకటి - నవల్లోలాగా కారణం ఎవరన్నది ప్రేక్షకులకి తెలియకుండా, పాత్రలకి మాత్రమే తెలియటం. ఇందుకోసం సుందరి పాత్రని, కథని పొడిగించాను. ఛాయకి కొడుకు పుట్టాక ఆమె చనిపోయే ముందు, అదే హాస్పిటల్లో సుందరి తల్లి అడ్మిట్ అవడం వల్ల సుందరి వస్తుంది. ఛాయకి సుందరి ఎవరో తెలిసి, ఆమె ప్రియుడు అవధాని మాత్రం కారణం కాదని చెప్తుంది. తన గర్భానికి బాధ్యుడైన వారి పేరు చెప్తుంది.. క్లయిమేక్స్‌లో సుందరి అవధాన్ని వెదుక్కుంటూ వచ్చి జరిగింది వివరించి, అతన్ని వివాహం చేసుకోడానికి తను సిద్ధం అని చెప్తుంది. 'రేపటి కొడుకు'కి తండ్రి యెవరో అవధానికి చెబుతుంది. సరిగ్గా అదే సమయంలో పైన ఓ విమానం వెళుతుండడంతో, శబ్దంలో సుందరి డైలాగ్ కల్సి పోతుంది. ఇది క్లోజప్ లో తీస్తే పెదాల కదలిక వల్ల ప్రేక్షకుల్లో కొందరయినా గ్రహించగలరు. లేదా మిడ్ లాంగ్ షాట్లో తీసి ఆ అవకాశం లేకుండా చెయ్యొచ్చు..

*- రచయిత*

## 6

నడిచి వస్తున్న సుందరిని, దూరం నుంచే చూసి చెయ్యి ఊపాడు అవధాని. సుందరి దగ్గరికి వచ్చాక అడిగింది చిరుకోపంగా

"ఎవరైనా చూస్తే?"

"టాంక్‌బండ్‌కి వెళదామా?" అడిగాడు.

"అందుకే నిన్ను తిరుపతి గుండంటాను."

"ఎందుకు పోకూడదు?" విసురుగా అడిగాడు అవధాని.

"ఈ చలికాలంలో టాంక్‌బండ్‌కి వెళ్ళే వాళ్ళెవరో చూపించు నాకు. నవ్వుతారు ఎవరయినా చూసినా"

"అక్కడే ఉంది తెలివి. ఇప్పుడు ఎవరూ లేరు కాబట్టే మనం వెళ్ళినా ఎవరూ చూడరు."

"పబ్లిక్ గార్డెన్‌కి వెళదాం"

"నీ ఇష్టం"

"రిక్షా"

ఇద్దరు రిక్షాలో పబ్లిక్ గార్డెన్స్ చేరుకున్నారు. చీకటి పడే సమయానికి, రిక్షా దిగగానే అన్నది సుందరి.

"ఓ పావలా వేరు శెనక్కాయలు కొను."

ఇద్దరూ వేరుశెనక్కాయలు తింటూ నడవసాగారు లోపలికి.

"టోపీ కొనుక్కోలేదా ఇంకా?" అడిగింది సుందరి అవధానిని.

"లేదు. డబ్బులు చిక్కాలిగా"

"ఐ యామ్ సారీ."

"దేనికి?"

"ఆరోజు మీ వదిన ఇచ్చిన డబ్బుతోనేగా నేను గొడవపెడితే సినిమాకి తీసుకెళ్ళావు? సినిమా అయ్యాక చెప్పావు. ముందే చెబితే, గొడవచేసేదాన్ని కాదుగా."

"టోపీ అక్కర్లేదు. నాకు సిగ్గు అనిపించడం లేదు. అలా అనిపిస్తేనే కొనాలి టోపీ."

"నీ పక్కన నడవడానికి నాకు సిగ్గనిపిస్తుందని నీకెప్పుడూ అనిపించలేదా?

"లేదు. అనిపించినా ఫర్వాలేదు."

"ఎలా ఉంది ఛాయ?"

"అబ్బ. మీ ఆడవాళ్ళకి ఏం చెప్పకూడదు. ఎంత అనుమానమో?"

"అనుమానం కాదు ఊరికే అడిగాను."

"ఎప్పుడూ మా ఇంట్లో ఎవరి గురించీ అడగని దానివి, పనిమాలా ఛాయ గురించే అడగటంలో అంతరార్థం?"

"సింపుల్"

"అంటే"

"ఇంట్లో అందమయిన అమ్మాయి - నువ్వు చెప్పినదాన్ని బట్టి అందమయిన అమ్మాయికిందే లెక్క - పెళ్ళి కాని బ్రహ్మచారివి నువ్వు ఒక్కడివే. నీ బుద్ధి నాకు తెలుసు. నా అనుమానాలు నాకు కలగటంలో అసహజం ఏమీ లేదు."

"నా అంతట నేను నిన్ను పలకరించాననేగా నీ అనుమానం, కనబడిన ప్రతి ఆడదాన్ని పలకరిస్తాననుకున్నావా? ఒకళ్ళనే పలకరించేది. ఒకళ్ళనే పెళ్ళాడేది."

"కానీ అందమయిన ఆడవాళ్ళు ఒకళ్ళే కాదు."

"ముందే చెప్పేస్తున్నాను సుందూ. అలాంటి అనుమానాలేమీ పెట్టుకోకు, లేకపోతే ముందు ముందు జీవితం నరకం అవుతుంది. మా వదిన చూడు ఎంత తెలివయినదో, అంతా తెలిసి ఎలా నిర్వహించుకొస్తోందో."

"మీ రెండో అన్నయ్య అలాంటివాడు కాదు. మొదటన్నయ్య ఇలాంటివాడు. ఆ అన్నలుంగారి తమ్ములుంగారేగా మీరు కూడా."

అవధాని కోపంతో కాసేపు మాట్లాడలేకపోయాడు.

"ఆల్ రైట్. కాసేపు ఛాయని వదిలేద్దాం. నాకో కథ చెప్పవూ?" అడిగింది సుందరి.

"ఏం కథ?"

"అదే ఇంకేముంటుంది?"

"ఏది?" విసుగ్గా అడిగాడు.

"నీ తిరుపతి కథ. తిరుపతిలో ఎలా నీ బట్టలు, పెట్టెపోయాయి, ఎలా వచ్చావ్, ఛాయ ఎలా తలుపు తెరిచి 'ఎవరు నువ్వు' అని అడిగింది వగైరాలు."

"కూర్చుందామా."

ఇద్దరూ జూబిలీహాల్ ముందున్న గడ్డిలో కూర్చున్నారు.

"వేరుశెనక్కాయలు బావున్నాయి ఇవాళ. కొత్త కాయలు" అన్నాడు అవధాని.

మాట మార్చకు! నీ తిరుపతి ప్రయాణం..."

"సుందూ!"

"ఆ"

"నీకు నన్ను వేధించడం తప్ప మరింకేం చాతకాదా?"

"నేను వేధిస్తున్నానా?"

"కాక ఏదో పొరపాటు జరిగిపోయింది. అవన్నీ గుర్తు చేసి నన్ను వేధించడం దేనికి?"

"పొరపాటున మరిస్తే, మళ్ళీ మళ్ళీ చేస్తారు మానవులు. అవే గుర్తుంచుకోవాల్సినవి."

కాసేపు మౌనంగా ఉండిపోయారు ఇద్దరూ.

నిన్ను "ఏవండీ టై ఎంతయింది - అని రోజూ పలకరించడం కన్న పెద్ద పొరపాటు నా జీవితంలో చేయలేదు. చేయబోను" నవ్వుతూ అన్నాడు అవధాని.

"చేయనివ్వను" సుందరి కూడా నవ్వి మళ్ళీ అన్నది "నేను సమాధానం చెప్పడం నాది మరింత పెద్ద పొరపాటు, పేరడిగితే ఏ రాకేష్ అనో, రాజేష్ అనో చెప్తావనుకున్నాను కానీ 'అవధాని' అని చప్పగా అంటావనుకోలేదు."

"అబ్బా సుందూ. స్టాపిట్ ఐసే."

"ఆల్‌రైట్ మానేద్దాం, ఇప్పుడేం చేద్దాం మరి" చిలిపిగా చూస్తూ అన్నది.

"మీ అక్కయ్య పెళ్ళి అట్టే దూరం లేదు."

"ఫిబ్రవరి రెండున్నర నెలలు, కానీ నీ ఉద్యోగమే ఎంత దూరంలో ఉందో కనబడటం లేదు. అప్పుడు గానీ మన పెళ్ళి ఎంత దూరమో తెలియదు."

"అప్పటిదాకా నేనడిగింది ఇవ్వవా?"

"ఊహూ'

"ఇదన్యాయం, మనం ఇంతకాలం ఒకర్నొకరు ప్రేమించుకుంటున్నాం. ఒక్కము...'

"తప్పు. అర్థం చేసుకుంటున్నాం. డేటింగ్, ప్రేమించుకోవడం పెళ్ళయాకే ఆ తర్వాతే ము...లు మరేదయినా".

"ప్లీజ్ ఒక్క ముద్దు"

కాసేపు అటూ ఇటూ చూసి, ఎడం చేత్తో అవధాని కళ్ళు మూసి అన్నది సుందరి.

"అయితే, మనం కూర్చున్న లాన్‌లో ఎంత మందున్నారో చప్పున చెప్పేయ్."

"అయిదు అటూ ఇటూ అయినా ఫర్వాలేదా?"

"ఫర్వాలేదు చెప్పు."

"కరెక్ట్ చెపితే?"

"ముద్దు."

"గుడ్.. ఊ... నలభై."

సుందరి చేతిని తీసేసి అన్నది.

"లెక్కపెట్టు"

"అరె ఇందాక ఇక్కడున్న వాళ్ళంతా ఏమయ్యారు? ఆ పంజాబీ వాళ్ళు."

"ఇరవైలోపే ఉన్నారు. లేద్దాం"

"అయితే నా ముద్దు?"

"నెక్స్‌టైం, బెటర్లక్."

"ఇదన్యాయం."

"ఏదన్యాయం? ముందర చేతులు పట్టుకుని నడవాలనిపిస్తుంది. ఆ తర్వాత ఒకరి నడుముచుట్టూ మరొకరు చేతులు వేసి, ఆనుకుని నడవాలనిపిస్తుంది. ఆ తర్వాత ముద్దుపెట్టుకోవాలనిపిస్తుంది. అంతటితో ఆగదు మనసు, ఆ తర్వాత"

"ఆ తర్వాత?"

"పెళ్ళి చేసుకోవాలనిపించటం కాదు. ఇంకా ముందుకు వెళ్ళాలనిపిస్తుంది."

"అంటే?"

"చెప్పను"

"చెప్పాలి"

"చెప్పనా?"

"చెప్పు, ఎలా చెప్తావో విందామని"

"గది, ఏకాంతం, నిరోధ్, మాత్రలు"

"షటప్, షటప్"

పకపకా నవ్వింది సుందరి. "చెప్పమన్నావుగా"

బయటికి వచ్చాక, బస్‌స్టాప్‌లో నిలబడ్డారు ఇద్దరూ.

"రేపు సెలవేగా, ఏం చేద్దాం?"

"మనకి రోజూ సెలవేగా మార్నింగ్ షోకి వెళదాం."

"గుడ్ - దేనికి?"

మర్నాడు ఉదయం సినిమా గురించి మాట్లాడుకుంటూంటే, 139 నంబర్ బస్ వచ్చి ఆగింది. ఇద్దరూ బస్ ఎక్కారు. బస్ ఖాళీగా ఉండటం వల్ల ప్రక్క ప్రక్కనే కూర్చున్నారు, అవధాని టిక్కెట్స్ కొన్నాడు ఇద్దరికి.

"ఎల్లుండే దీపావళి" అన్నది సుందరి.

"దేముడు దయతలిస్తే, వచ్చే దీపావళి ఇద్దరం కలిసి జరుపుకుంటాం" అన్నాడు అవధాని.

తామిద్దరికి మొదటిసారి పరిచయం ఏర్పడిన రవీంద్రభారతి వైపు చూశారిద్దరూ బస్సు మలుపు తిరుగుతుంటే, చిన్నగా నవ్వుకున్నారు.

ఆ రాత్రి పనంతా అయ్యాక ఛాయ ముందు గదిలో తన మంచం మీద పడుకుంది. ఆ పెద్ద పట్టెమంచం మీద నిద్ర రావటం లేదు ఛాయకి.

శాంత నడిగి తెచ్చుకున్న పుస్తకం చదువుతూ గడిపింది కాసేపు. పుస్తకం మూసేసి లైటు తీసేసింది. నీలం రంగు నైట్‌లాంప్ వెలిగించి, పడుకుంది కళ్ళుమూసుకుని, కళ్ళ ముందు శాంత, శర్మ, కామేశ్వరమ్మ, సోమయాజులు, తనెప్పుడూ చూడని తాతగారు, బామ్మగారు, దీక్ష, ఫోటోలో చూసిన దీక్ష భార్య, అవధాని, హోటల్లో చూసిన అమ్మాయి మెదులుతున్నారు.

ఏదో అలికిడి వినబడి కళ్ళు తెరిచి చూసింది ఛాయ. ఎదురుగా తను వేసిన తలుపులు తెరిచి ఉన్నాయి. గుమ్మంలో నిలబడి ఉన్నాడు.

దీక్ష -

తనవంకే చూస్తున్నాడు దీక్షగా జేబులో చేతులుంచుకుని, నవ్వాడు ఛాయవంక చూసి.

"ఇంకా నిద్రపోలేదా?" అడిగాడు.

"పట్టడం లేదు"

"పగలంతా పనిచేసి ఉన్నావ్, పడుకో ఆరోగ్యం చెడిపోతే ఇబ్బంది" ఆప్యాయంగా అన్నాడు. ఆ మాటలకన్నా ఆ మాటల వెనక ఆప్యాయత వినబడింది ఛాయకి అమితంగా!

మంచం మీద లేచి కూర్చుంది.

"ఫోటో తీస్తాను రేపు తీయించుకుంటావా? నీకు తెలుసుగా నేను ఫోటోలు తీస్తానని"

"తెలుసు"

"అమ్మతో చెబుతాను. రేపు స్టూడియోకి వద్దువుగాని దగ్గరే"

దీక్ష నవ్వుతూ చూశాడు. ఛాయ మనసులో ఏదో చెప్పలేని ఆత్రం, ఆశ, మాట్లాడలేకపోయింది.

వేలితో ఛాయ కూర్చున్న మంచం వంక చూపిస్తూ చెప్పాడు దీక్ష.

"ఆ మంచానికి చాలా పెద్ద చరిత్ర ఉంది తెలుసా?" ఛాయ తెలుసు అనబోయి ఆగి తెలియదన్నది. "ఆ మంచం చాలా పాతది, ఆ మంచం మీదే."

దీక్ష కళ్ళలోకి చూసింది ఛాయ.

"ఆ మంచం మీదే మా తాతయ్య, మా బామ్మ చచ్చిపోయారు. మా పెదనాన్న కూడా దానిమీదే పోయారు."

ఛాయ అప్రయత్నంగా లేచి నిలబడింది మంచం మీద నుంచి. దీక్ష వెళ్ళిపోయాడు తలుపు దగ్గరికి వేసి. ఛాయ ఆ మంచం వైపు చూస్తూ నిలబడిపోయింది. ఆ మంచం మీద ముగ్గురు చచ్చిపోయారు? మూడు ఆత్మలు ఆ మంచం మీద దేహాన్ని వదిలాయి.

గుండె బితుకు బితుకు మంటూంది ఛాయకి, ఆ మంచం మీద పడుకోవాలంటే, మళ్ళీ చాలా సేపు దానివంకే చూస్తూ నిలబడిపోయింది. కాళ్ళు పీకుతుంటే మంచం మీద కూర్చుంది.

ఈ మంచం మీద చచ్చిపోయారు ముగ్గురు. వాళ్ళ ఆత్మలు ఈ మంచం చుట్టూ తిరుగుతున్నాయేమో? కొంత మంది చచ్చిపోయినా, కొన్ని వస్తువుల మీద ఇచ్ఛ చావక దయ్యాలవుతారట.

భయంగా చూసింది మంచం చుట్టూ, ఒంగి మంచం కింద చూసింది. చీకటిగా ఉంది అడుగు భాగమంతా. చిన్నప్పుడు తను విన్న కథ గుర్తుకొచ్చింది ఛాయకి.

అబ్రహాం లింకన్ అమెరికా దేశం ప్రెసిడెంటు, ఆయనకి ఓ ఊగే కుర్చీ అంటే మోజు, వైట్ హౌస్‌లో, ఆ కూర్చీలోనే కూర్చుంటుండేవాడు. ఆయన మరణించాక ఇంకెవరు ఆ కుర్చీలో కూర్చోవాలని ప్రయత్నించినా ఊరుకునేవాడు కాదట. డాక్టరుగారు ఈ కథ భోజనానికి పిల్చిన వాళ్ళతో మొన్న మళ్ళీ చెపుతుండగా వింది తను.

అలాగే ఈ మంచం కూడా.

ఛ, అలా అయిఉంటే ఎప్పుడో తనని భయపెట్టి ఉండేవి దెయ్యాలు. తనకేం కాదు. గదినిండా నిశ్శబ్దం. మందంగా నీలం రంగు వెలుగు, శవాలని దించిన మంచం మీద తను ఒంటరిగా, చుట్టుప్రక్కల అంతా నిద్రపోతున్నారు గాఢంగా, ఒకవేళ తనకేమయినా అయితే?

ఒక్క గెంతుతో, ఓ చేత్తో దిండుని పట్టుకుని, దుప్పటిని నేలమీద ఈడుస్తూనే ఛాయ తలుపు దగ్గరికి గెంతింది. తలుపు తెర్చుకుని వరండాలోకి వెళ్ళింది. దీక్ష పడుకుని వున్నాడు వరండాలో పక్క పరుచుకుని.

కాసేపు తటపటాయిస్తూంటే అన్నాడు దీక్ష నెమ్మదిగా "ఇక్కడ పడుకుంటే పడుకో."

వెనక్కి తిరిగి, ఛాయ తన గదిలోకి వెళ్ళి దుప్పటి నేలమీద పరుచుకుని పడుకుంది. కానీ వరండాకి తన గదికి తలుపులు మాత్రం తెరిచే ఉంచింది చలయినా.

ఆ రాత్రి హాయిగా నిద్రపోలేకపోయింది ఛాయ. చీమ చిటుక్కుమంటే మెలుకువ వస్తునే ఉంది.

## 7

ఛాయ ఆ ఇంటికి వచ్చి నెలదాటి పోయింది. కొత్తలో ఉన్న బెరుకు, పిరికితనం ఛాయలో పూర్తిగా మాయమయిపోయాయి. వాటి స్థానంలో చొరవ ధైర్యం చోటు చేసుకున్నాయి.

నెల అవటం వల్ల బాబు ఇప్పుడు ఛాయకి బాగా మాలిమి అయిపోయాడు. శాంత లేకపోయినా ఉండగలడు. కానీ, ఛాయ లేకపోతే ఉండలేకపోతున్నాడు. కనబడేదాకా ఏడుస్తాడు.

ఆమె వచ్చిన తర్వాత ఆ ఇంటిలో అందరికీ పని తగ్గిపోయింది. శాంత ఇంటిపని కొద్దో, గొప్పో ఇదివరకు చేసినా ఇప్పుడు అసలు చేయటం లేదు. కేవలం తన గదిలోని సామాను సర్దుకోవటంతోనో, పుస్తకాలు చదువుకోవటంతోనో గడిపేస్తుంది కాలం.

శర్మకి నైట్ డ్యూటీ లేకపోతే ఇద్దరూ కలిసి వాకింగుకి వెళతారు రాత్రి భోజనం అయ్యాక.

కామేశ్వరమ్మకి మందులు సమయానికి అందివ్వటం నుంచీ ఆవిడ భోజనం చేసిన తర్వాత తను తినటం నేర్చుకుంది ఛాయ. వారపత్రికలో కథలు చదివి వినిపిస్తుంటుంది కామేశ్వరమ్మకి నిద్రపట్టేదాకా!

'ఛాయా, నా దోవతేదమ్మా' అని సోమయాజులు ఆమెనే అడుగుతాడు ఏమయినా కనబడకపోతే.

"ఛాయా, కొంచెం గుండీ కుట్టిపెట్టు" అని చొక్కా బొత్తాము ఆమెకే ఇస్తాడు శర్మ.

"ఛాయా, అన్నం వడ్డించు" అని ఆమెనే అడుగుతాడు దీక్ష.

"ఏయ్ పిల్లా, కాసిని వేరుశెనగపప్పులు వేయించి ఉంచు సాయంత్రం" అని ఆమెనే అడుగుతాడు అవధాని.

ఆ ఇంట్లో 'ఛాయ' పేరు ఎవరినోటో, ఒకరినోట పదేపదే వినిపిస్తూంటుంది ప్రతిరోజూ! ఎవరికి ఏం కావల్సినా ఆమెనే అడుగుతారు. అందరికీ ఆమే జవాబుదారి. ఉదయం నుంచీ రాత్రిదాకా ఆమె లేకపోతే, ఆమె కలిపించుకోకపోతే ఏ పనీ జరగని స్థితికి వచ్చింది ఆ ఇల్లు. ఆ ఇంట్లోని ప్రతివ్యక్తి ఆమెని ఆదరించడం, ఆమె అంటే ఇష్టపడటం నేర్చుకున్నారు తమకి తెలియకుండానే.

ఓ ఆదివారం శాంత అడిగింది ఛాయని!

"సినిమా కెళదామా?"

"వెళదాం" ఉత్సాహంగా అన్నది ఛాయ. వచ్చిన దగ్గరనుంచీ సినిమాకి వెళ్ళాలనే కోరిక ఆమెలో వృద్ధి అవుతూనే ఉంది. మేట్నీకి వెళ్ళారు దగ్గరలోనే ఉన్న సినిమా హాలుకి. మెట్లు లేకుండా, ఏటవాలుగా ఉన్నట్లున్న "రేంప్" ఎక్కి వెళుతూంటే ఆశ్చర్యం వేసింది ఆమెకి!

శాంతకి ఆ రంగుల తెలుగు సినిమా అంతగా నచ్చలేదు, ఆ తరహా కథలు, నవలలు ఏ మాత్రం నచ్చవు కాబట్టి! కానీ ఛాయ మాత్రం సినిమాలో లీనమయి పోయి చూసింది!

"చాలా బావుంది కదూ?" అడిగింది శాంతని సినిమా పూర్తయ్యాక ఛాయ!

"నాకు బాలేదు నీకు నచ్చిందా?" అడిగింది శాంత!

"నాకు చాలా బావుంది హీరో హీరోయిన్ మనసు మార్చడానికి ఎంత ప్రయాస పడతాడో చివరిదాకా?"

"జీవితంలో అలాంటి మనుష్యులు, ఐశ్వర్యం అరుదు" ఆమెకి అర్థం కాలేదు శాంత అన్నమాటలు!

"ఆ రోజు ఏదో చెపుతానన్నారు?" అడిగింది ఛాయ కాసేపాగి.

"ఏరోజు?"

"నాకు చీరలు కొన్నరోజు."

నవ్వి అడిగింది శాంత.

"నీకింకా గుర్తుందన్నమాట."

"ఉంది. ఏమయి ఉంటుందా అని ఆలోచిస్తున్నాను."

"అది చెపుదామనే పిలిచాను సినిమాకి, నడిచే వెళదాం ఇంటికి. రిక్షామీద వద్దు, మాట్లాడుకుంటూ వెళదాం."

"నాకు నడవటమంటేనే ఇష్టం."

"మా ఆయన గురించి మనం మాట్లాడేది."

"శర్మగారి గురించా?"

ఛాయ కంఠంలో ఆశ్చర్యం గమనించి అన్నది శాంత.

"అవును, శర్మగారి గురించి."

ఛాయ మౌనంగా ఉండిపోయింది.

"నీకు ఆయన గురించి ఈపాటికి అంతా తెలిసిపోయి ఉండాలి. నెలరోజుల నుంచీ చూస్తూనే ఉన్నావు ఆయన్ని, మనిషి మంచివారు కారు చాలా విషయాల్లో - నేను ఆయన భార్యగా చెప్పకూడదు నీకట్లా. అంతేకాదు నీకన్నా ఎక్కువ చదువుకున్నాను. ఎక్కువ మందిని అర్థం చేసుకున్నాను. విజ్ఞానం, లోకరీతి ఎక్కువ జీర్ణించుకున్నాను. అయినా చెప్పక తప్పటం లేదు. కాబట్టి చెపుతున్నాను."

ఛాయ వింటూండిపోయింది.

"తెలిసో తెలియకో ఆయన్ని చేసుకున్నాను. ఆయనకి మూడు వ్యసనాలున్నాయి. పేకాట ఒకటి, వస్తుందో పోతుందో తెలియదు కానీ దానికోసం  చాలా కాలం వ్యయం చేస్తారు. తర్వాత త్రాగుడు, ప్రతి శనివారం రాత్రి తాగుతేకానీ ఆయనకి నిద్ర పట్టదు. అప్పుడప్పుడు తప్పతాగి ఇంటికొస్తారన్న సంగతి నీకు తెలియంది కాదు."

"తెలియదు."

"తెలుసు. నీకు తెలిసిందని నాకు తెలిస్తే నేను బాధపడతానని అలా అంటున్నావు. బాధపడను, నాలుగురోజుల క్రితం తలుపు తడితే నువ్వు తలుపు తీశావు. ఆయన కావాలని నీ మీదకి తూలడం, నువ్వు ఆయన చేతుల్లోంచీ తప్పించుకోవడం నా కళ్ళబడింది."

ఛాయ ఆశ్చర్యంగా తలెత్తి చూసింది శాంత కళ్ళలోకి, నడుస్తున్నదల్లా చటుక్కున ఆగిపోయి.

"ఆశ్చర్యపడకు, నేను ఆయన్ని ఎందుకు గొడవ చేయలేదనా? అదే పొరపాటు, ఒకసారి గొడవచేస్తే మనం అలుసయిపోతాం. చూసీ చూడనట్లు ఊరుకుంటే, వాళ్ళే భయపడతారు మనముందు తప్పు చేస్తున్నామని. అది నా మనస్తత్వం."

మళ్ళీ ఇద్దరూ నడవసాగారు.

"ఇంట్లో నాకు తెలియకుండా ఎలాంటి వేషాలు వేయలేరు. భయపడతారుకూడా, ఆయన కన్ను నీ మీద పడింది. ఇదే శర్మగారి మూడో వ్యసనం. ఆడవాళ్ళ విషయంలో ఆయన అపర శ్రీకృష్ణుడు. నీతి, నియమం లేవాయనకి, శీలం అసలే లేదు."

ఛాయ ఏదో గొణిగింది వినబడకుండా.

"ఫర్వాలేదు. నీతో చెప్పినంత మాత్రాన నా పరువేం బజారుపాలుకాదులే. మొదటినుంచీ అంతే ఆయన. తొందరపడి నన్నిచ్చి చేశారాయనకి. నీవు మాత్రం జాగ్రత్తగా ఉండాలి ఇంట్లో ఆయన అందరిముందు ఏం చేయలేరు. అంత ధైర్యం లేదు. బయట మాత్రం పులి, ఆయన సినిమాకనిగాని, దేనికయినా సరే పిలిచినా నమ్మి వెళ్ళకు. ముఖ్యంగా మాకెవ్వరికీ తెలియకుండా అసలు వెళ్ళకు, అందరితో చెప్పేస్తానని బెదిరించు"

ఛాయకి ఏం మాట్లాడాలో తెలియలేదు.

"తర్వాత నీ ఇష్టం. అసూయతో మాత్రమే చెప్పటం లేదు నేను ఈ సంగతులు. బయట ఆయన పనిచేసే మందుల కంపెనీలో అనేక మంది పేకర్స్‌తో, ఫార్మసిస్టులతో ఆయన చాలా ఆటలాడుతున్నారని నాకు తెలుసు. వాళ్ళల్లో నువ్వొకదానివనుకుంటాను. కానీ ముందు హెచ్చరించడం నా బాధ్యతని చెపుతున్నాను."

"చెప్పనెవరికీ."

"శర్మగారిలాంటి మొగాళ్ళే లోకంలో ఎక్కువ. ఆడవాళ్ళు అంతమంది లేరు" అన్నది శాంత.

"మీకెలా తెలుసు? ఎంతమంది మొగవాళ్ళుంటే అంతమంది ఆడవాళ్ళుండాలి కదా" అనుకుంది ఛాయ మనస్సులో.

"మీ రెండో మరిది ఎలాంటాయన?" అకస్మాత్తుగా అడిగింది ఛాయ.

"దీక్షా?"

"అవును"

శాంత మొహంలో చిరునవ్వు తళుక్కుమంది.

"ఆయనగారి సంగతి తెలియదా?"

"ఊహూ, ఆయన భార్య గురించి ఎప్పుడూ ఎవరూ మాటాడరే! కానుపుకు వెళ్ళింది?"

"కాదు, పుట్టింటికి వెళ్ళింది అలిగి. ఇక తిరిగి రాదనుకుంటాను."

"ఏం?"

"మా వారంత కాకపోయినా, ఆయనా తక్కువవాడేం కాడు. కాకపోతే గుంభనంగా, ఎవరికీ తెలియకుండా, రహస్యంగా చేస్తాడు."

"అంటే?"

"నిజానికి నాకన్నా దీక్ష భార్య చాలా మంచిది. ఒకరోజు దీక్ష ఫోటో తీయించుకోవడానికి స్టూడియో కొచ్చిన ఎవరో అమ్మాయితో పిచ్చిగా ప్రవర్తించాడట. ఆ అమ్మాయి దీక్ష భార్యకి ప్రాణస్నేహితురాలు. దీక్ష తనతో ఎంత చొరవ తీసుకోబోయాడో దీక్ష భార్య చెవిలో ఊదింది. అంతకుముందు నుంచే అనుమానం ఉన్నట్టుంది. పుట్టింటికి వెళ్ళిపోయింది కాకినాడకి, ఇక అలాంటి భర్తతో చస్తే కాపురం చేయనని ఉత్తరం వ్రాసింది."

"ఎప్పుడు జరిగింది?"

"సంవత్సరం దాటుతోంది. ఆ అమ్మాయికి విడాకులు ఇచ్చి వేరే పెళ్ళి చేసుకోవాలనే ఆలోచనలో ఉన్నట్లున్నాడు దీక్ష" ఇల్లు దగ్గరవుతుండగా అన్నది ఛాయ.

"అవధాని?"

"నాకు తెలియదు, మంచివాడనుకుంటాను. కాకపోయినా ఆశ్చర్యపడక్కరలేదు. ఒకసారి నువ్వూ, నేనూ చీరలు కొనుక్కోవటానికి వెళ్ళినప్పుడు హోటల్ కెళ్ళాం గుర్తుందా? ఆ హోటల్లో ఓ అమ్మాయితో కబుర్లు చెపుతూ కాఫీ తాగుతుంటే చూశాను అవధానిని. గుండు కాబట్టి చూడగానే కనబడ్డాడు. అయినా ఓ అమ్మాయితో హోటల్లో కాఫీ తగినంత మాత్రాన చెడ్డవాడయిపోడు ఏ మగాడు. అందుకే ఆ సంగతి ఎవరితోనూ చెప్పలేదు."

ఇంట్లోకి వెళుతుండగా ఛాయతో చెప్పింది శాంత మరోసారి.

"మనం మాట్లాడుకున్న సంగతులు ఎవరికీ చెప్పకు జాగ్రత్త."

"శర్మగారు ఏమయినా చేసేటయితే మీకు చెప్పేస్తాను" ఛాయ చెప్పింది.

ఆ రాత్రి శాంత శర్మతో చెప్పింది.

"జాగ్రత్తండి, ఛాయ జోలికి వెళ్ళారంటే మాత్రం నేను సహించలేను."

"వెళతానని భయం వేసేనా, చీరలు కట్టిస్తున్నావు? ఛాయేకాదు, అసలే ఆడదాని జోలికి వెళ్ళడం లేదంటే నమ్మవేం. అనుమానాన్ని మించిన పెనుభూతం లేదంటారు అందుకే."

"అలవాటుని మించిన పెనుభూతం అంతకన్నా లేదు. అనుమానాన్ని తప్పించుకోవచ్చు కానీ అలవాటుని తప్పించుకోవటం దుర్లభం. సిగరెట్, పేక, తాగుడు, వ్యభిచారం అలవాట్లేగా మీకు?"

"ఛీ ఛీ నన్ను మరీ తెలుగు సినిమాలో విలన్‌తో పోల్చేస్తున్నావ్ శాంతా!"

"ఈ నెల మీకు బోనస్ వచ్చి ఉండాలి. దాని సంగతి చెప్పరే నేను అడిగేదాకా."

"ఇంకా రాలేదు."

"అబద్ధం మీ ఎకౌంట్స్ సెక్షన్‌కి ఫోన్ చేసి కనుక్కున్నాను. బోనస్ చెక్కు ఇచ్చి వారం దాటింది."

"ఈ నెల కొద్దిగా డబ్బుతో పని ఉంది."

"డిసెంబర్ 31 న కేబరేలకి వెళ్ళి తగలేసుకోవడమేగా?"

"అదేకానీ నువ్వు చెప్పిన తీరు నచ్చలేదు నాకు. రెండువందలదాకా కావాలి టేబుల్ రిజర్వేషన్‌తో కూడా కలిసి, తప్పదు అది."

"మిగతాది?"

"ఇంకెంత నాలుగువందలేగా?"

"ఆ ఇంకెంత ఏదని అడుతుతున్నా ను."

"ఉంది"

"రేపు సాయంత్రం కనకాంబరం రంగు పట్టు చీర తీసుకురండి దాంతో. మిగిలింది బిల్లుతో సహా నాకివ్వండి. లేకపోతే నేను మనిషిని కాను" తీవ్రంగా చెప్పింది శాంత.

"మగాళ్ళని ఇలా లెక్కలడగకూడదు "

"తెస్తారా, తేరా?" ఇంకా తీవ్రంగా అడిగింది.

"తెస్తాను" చెప్పాడు.

"మీకిష్టమయితే ఛాయకి కూడా ఓ చీర చవకలో చూసి తీసుకురండి నూలుది."

"తెస్తాను ఇష్టమే"

భార్యను మీదకి లాక్కున్నాడు శర్మ.

"రేపటిదాకా ఆగండి."

"ప్రామిస్, తెస్తాను."

"సరే అయితే"

"నీవే చూస్తావుగా"

తన గదిలో మంచం మీద పడుకున్న ఛాయ అనుకుంది మనసులో ఆ రాత్రి.

దీక్ష తనను చూసి ఊరికే నవ్వుతున్నాడు రహస్యంగా ఎవరి కంటబడకుండా, కళ్ళు చిత్రంగా ఆర్పుతాడు సౌంజ్ఞలాగా, తను జాగ్రత్తగా ఉండాలి దీక్ష విషయంలో, 'పెళ్ళికాని బ్రహ్మచారిని నమ్మచ్చు కానీ, పెళ్ళయిన బ్రహ్మచారిని చేస్తే నమ్మకూడదు' అనుకుంది.

అర్ధరాత్రి ఎప్పుడో మెలుకువ వచ్చింది ఛాయకి, కళ్ళు తెరిచి చూసి ఉలికిపడింది. ఎదురుగా, మంచానికి దగ్గరగా లాక్కుని కుర్చీ మీద ఆనించి తన వంకే దీక్షగా చూస్తున్నాడు. అలా ఎంతసేపటి నుంచీ చూస్తున్నాడో?

ఛాయకి, మెలుకువ రాగానే నిశ్శబ్దంగా, ఏమాత్రం తత్తరపడకుండా లేచాడు అవధాని. కుర్చీని మళ్ళీ గోడవారికి నెట్టి బయటికి నడిచాడు మామూలుగా.

ఛాయ చెదిరిపోయిన చీర కుచ్చెళ్ళని మోకాలు మీద నుంచీ పాదం దాకా లాక్కుంది. కళ్ళు మూసుకుని నిద్రపోవటానికి ప్రయత్నించసాగింది.

అవధాని ఎంతసేపటి నుంచీ అలా తనని చూస్తూ కూర్చున్నాడో? ఎన్ని రోజులనుంచో? ఇవాళ ఒక్కరోజేనా లేక రోజూ ఇంతేనా?

తనని ముట్టుకోలేదు. తనని ఎవరో ముట్టుకోవటం వల్ల మెలుకువ రాలేదు. ఎందుకో మెలుకువ వచ్చింది. విచిత్రంగా మంచినీళ్ళు తాగి మళ్ళీ పడుకుంది ఛాయ

'మగపురుగు అవధానిని కూడా నమ్మకూడదు. ఎంత పెళ్ళికాని బ్రహ్మచారి అయినా' అనుకుంది.

### ఈ నవల సినిమా కావడం వెనుక సంగతులు

మరో క్లైమాక్స్ నాకు ఎంత మాత్రం నచ్చనిది, సోమయాజులు. ఆయన మీద సింపతీ పోకుండా వుండటానికి, వంటగదిలో ఇంట్లో ఎవరూ లేనప్పుడు ఆమె చీర అంటుకుంటుంటే ఛాయ చీరని ఆర్పుతూ ఆయన ఆవేశానికి లోనై ఆ పని చేసినట్లు చూపడం. మూడోది - కొద్ది కాలం తర్వాత తన కొడుకుని తీసుకోవాలనే తపన పెరగడంతో తండ్రి అయిన వ్యక్తి శాంతని కల్సి తన తప్పుని ఒప్పుకోవడం, అన్నదమ్ములు ముగ్గురిలో ఎవరయినా కావచ్చు. సినిమేటిక్ గా ఇది బావుండదనుకున్నాం. నాలుగో క్లయిమాక్స్ దీక్ష అని తేల్చి ఛాయకి, దీక్షకి వివాహం జరిపించడం.

- *రచయిత*

## 8

"అమ్మా" కామేశ్వరమ్మ పక్కన కూర్చుని పిల్చాడు దీక్ష.

నిద్రపోతున్న కామేశ్వరమ్మ కళ్ళు తెరచి చూసింది దీక్షని.

"ఒళ్ళు కాలిపోతోంది. జ్వరం వచ్చినట్టుంది" అన్నాడు కొంచెం కంగారుగా.

"అవును చలి జ్వరంగా ఉంది. ఆయన సాయంత్రం డాక్టర్ దగ్గరికి తీసుకెళతానన్నారు" చెప్పింది కామేశ్వరమ్మ.

"సాయంత్రం దాకా ఎందుకు? పోదాం పద. రిక్షా తీసుకురానా?" అడిగాడు.

"తీసుకురా, ఇందాకటికన్నా ఎక్కువయినట్లుంది" అన్నది కామేశ్వరమ్మ.

దీక్ష రిక్షాలో ఆస్పత్రికి తీసుకెళ్ళాడు తల్లిని. డాక్టర్ పరీక్షించి, ఇంజక్షన్ ఇచ్చి సాయంత్రం మళ్ళీ ఇంజక్షన్ తీసుకోవడానికి రమ్మని చెప్పాడు.

రిక్షాలో తిరిగి వస్తూ తల్లితో చెప్పాడు దీక్ష.

"విడాకులకి అప్లికేషన్ వేద్దామనుకుంటున్నాను."

"విడాకులా?"

"అవును, నాకేం వయసు ముదిరిపోయిందని? ఇలా ఒంటరిగా ఎంతకాలం? ఏమంటావ్?"

"మీ నాన్నగారిని అడుగు."

"ముందర నువ్వేమనుకుంటున్నావో చెప్పు."

"నాదేముందు, నీ ఇష్టమే నా ఇష్టం."

"అయితే లాయర్‌తో మాట్లాడుతాను."

"ముందర మీ నాన్నగారితో మాట్లాడు."

కాసేపయాక అన్నాడు. "అంతా సరిగా సాగితే త్వరలోనే పెళ్ళి చేసుకుంటాను ఛాయలాంటి అమ్మాయి నెవర్నయినా."

దీర్ఘంగా నిట్టూర్చింది కామేశ్వరమ్మ. అదెలాంటి సమాధానమో అంతుపట్టలేదు దీక్షకి.

ఇద్దరు ఇంటికి తిరిగి వచ్చేసరికి ఛాయ ఇంట్లో లేదు. బాబు ఏడుస్తున్నాడు గట్టిగా, శర్మ ఏదో ఆలోచిస్తూ వరండాలో కూర్చుని ఉన్నాడు.

"ఛాయ ఏది?" అడిగింది కామేశ్వరమ్మ.

"కూరలు తేవాలని వెళ్ళింది. నేను రాగానే నన్ను ఇంటికి కాపలా పెట్టి వెళ్ళి అరగంటయ్యింది కానీ, ఇంకా రాలేదు. ఎక్కడికెళ్ళిందో."

"డ్యూటీ లేదా?" అడిగాడు దీక్ష.

"లేదు సాయంత్రం వెళ్ళాలి. రాత్రి షిఫ్టు చేశాను నిన్న."

"అమ్మా, ఛాయ ఫోటో తీయించుకోవాలనుకుంటోంది చాలా రోజులనుంచీ, మన స్టూడియోకి తీసుకెళతాను రాగానే సరేనా?" అడిగాడు దీక్ష కామేశ్వరమ్మని, లోపలి గదిలోకి వెళ్ళి.

జ్వరంతో ఉన్న కామేశ్వరమ్మకి దీక్ష మాటలు వినపడ్డాయో, వినబడలేదో తెలియదుకానీ, దీక్షకి సమాధానం రాలేదు.

అయిదు నిముషాల తర్వాత ఛాయ వచ్చింది ఛాయ.

"ఎంత సేపయింది మీరొచ్చి? " అడిగింది.

"ఇప్పుడే స్టూడియోకి వెళదాం రా. ఫోటో తీస్తాను నీకు."

ఛాయకి ముందు దీక్ష ఏం చెపుతున్నాడో అర్థం కాలేదు. అర్థం అయాక అన్నది.

"శాంత వచ్చాక ఇద్దరం కలిసి తీయించుకుంటాం"

"సాయంత్రం అవుట్‌డోర్‌కి వెళ్ళాలి నేను, ఎవరిదో పెళ్ళి ఫోటోలు తీయాలి."

"అయితే మరోసారి"

"నాతో రావటం భయమా?"

"అబ్బే, భయమని కాదు."

"అయితే రా"

"మీ అమ్మగారితో చెప్పాలిగా"

"నే చెప్పానులే, ఫర్వాలేదు రా. తాళం చెవులిచ్చి కుర్రాడిని పంపి చాలాసేపయింది.. వెళ్ళాలి."

ఛాయకి వెళ్ళాలని లేదు. 'రాను' అని చెప్పే ధైర్యం కూడా లేకపోయింది. బాబుని ఎత్తుకుని "పదండి" అన్నది. 'బాబెందుకు' అంటాడనుకుంది. కానీ దీక్ష ఏం మాట్లాడలేదు.

పదినిముషాలు నడుస్తూండిపోయారు ఇద్దరూ మౌనంగా. బాబుని ఎత్తుకుని నడుస్తున్న తనని చూస్తే, తనకు దీక్షకు పెళ్ళయిందని అంతా అనుకుంటారని సిగ్గుపడింది ఛాయ.

తన ప్రక్కన ఛాయ నడుస్తూంటే ఎంత హుందాగా హాయిగా ఉంది అనుకున్నాడు దీక్ష. కొద్దిగా గర్వంగా చూశాడు తెలిసిన వాళ్ళవంక.

"ఆ కేబిన్‌లోకి వెళ్ళి పౌడర్ రాసుకుని జుట్టు సరిచేసుకో, దువ్వెన వగైరాలున్నాయి" చెప్పాడు దీక్ష.

బాబుని కిందకి దింపి కేబిన్‌లోకి వెళ్ళింది. లోపల లైటు వెలుగుతోంది. అద్దంలో మొహం చూసుకుని, చేత్తో ముంగరులని సరిచేసుకుంది, అందరూ ఉపయోగించిన దువ్వెనని ఉపయోగించడం ఇష్టంలేక.

అదే మొదటిసారి ఛాయ ఫోటో స్టూడియో చూడటం. ఛాయ ఎలా కూర్చోవాలో, ఎలా నవ్వాలో చేసి చూపించాడు దీక్ష. దీక్ష తనని ముట్టుకోకుండా జాగ్రత్త పడుతూ దీక్ష చెప్పిన విధంగా కూర్చుంది ఛాయ.

రెండు ఫొటోలు తీశాడు దీక్ష.

"నన్ను తీస్తావా ఫోటో, ఎలా తీయాలో చూపిస్తాను."

"వద్దు చేతకాదు" అన్నది ఛాయ.

"ప్రయత్నం చెయ్యి."

"ఉహూ. ఇక వెళతాను"

"అప్పుడే! కాఫీ తీసుకుంటావా?" అని ఛాయ సమాధానం కోసం ఎదురు చూడకుండానే, స్టూడియోలో ఉండే కుర్రాడిని బయటకు పంపాడు కాఫీ తీసుకురమ్మని. ఛాయకి భయం వేసింది. బలవంతంగా వెడితే బావుండదు. బాబుని ఎత్తుకుని గట్టిగా తొడపాశం పెట్టి గిల్లింది. బాబు ఒక్కసారిగా ఏడుపు లంకించుకున్నాడు.

"గాలిలేక ఏడుస్తున్నాడు. బయట నిలుచుందాం"

ఛాయ బాబుతో రోడ్డుమీద ఉన్న అరుగు మీదకి వచ్చి నిలబడి మరోసారి బాబుని గిల్లింది గట్టిగా, ఏడుపు ఆపకుండా ఉండటానికి.

ఆ రాత్రి దీక్షని పిలిచాడు సోమయాజులు. ఒంటరిగా చెప్పాడు.

"ఫోటో తీద్దామని... బాబుకూడా వచ్చాడు."

"నువ్వేకాదు. ఈ ఇంట్లో ఏ మగపురుగూ ఛాయని ఒంటరిగా ఎక్కడికీ తీసుకువెళ్ళడానికి వీల్లేదు."

"ఛాయ చెప్పిందా?" అడిగాడు.

"ఛాయకి సంస్కారం ఉంది" జవాబిచ్చాడు సోమయాజులు.

డిసెంబర్ 31కి ప్రత్యేకత ఉంది ఏకాలంలోనయినా, ప్రతి నెలకి ఆఖరి తేదీ ఉన్నట్టుగానే, డిసెంబర్ నెలకి కూడా ఆఖరి తేదీ ఉంది. కానీ డిసెంబర్ నెల ఆఖరి తేదీకి మాత్రం ప్రతి నెలాఖరికి లేని ప్రత్యేకత ఉంది.

డిసెంబర్ 31 సంవత్సరంలోని ఆఖరి రోజు. రాత్రి పన్నెండుగంటలకి, డిసెంబర్ 31వ, పాత సంవత్సరం చచ్చిపోయి కొత్త సంవత్సరం పుడుతుంది.

మద్యపాన ప్రియులకి, కేబరేలు ప్రదర్శించే నైట్‌క్లబ్స్‌కి ఆరోజు పర్వదినం. ఆరోజు ప్రపంచంలోని అనేక చోట్ల ఉత్సవంలా, పండుగలా జరుపుతారు. నగరాలలో మరీ ఎక్కువ.

హైదరాబాద్‌లో కూడా.

ఆబిడ్స్‌లోని ఓ బార్ లాంటి నైట్ క్లబ్‌లో ఆ రోజు ప్రతి సంవత్సరం ఆనవాయితీగా, స్పెషల్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. ఆరుబయట షామియానా వేసి, దేశంలోని పెద్ద నగరాల నుంచీ కేబరే ఆర్టిస్ట్‌లని ప్రత్యేకంగా రప్పిస్తారు. కనీసం అయిదు కేబరే డాన్సులు, ఒక భాంగ్రా నృత్యం, ఒక వెరైటీ ప్రోగ్రాం ఉంటాయి.

టేబుల్ ముందరే రిజర్వ్ చేసుకోవాలి. శర్మ తనకి, మరో మిత్రుడికి రెండు సీట్లు రిజర్వ్ చేయించాడు. తొమ్మిదిన్నరకల్లా తన సీట్లోకి వెళ్ళి కూర్చోవాలి. కానీ ఆలస్యంగా పదిగంటలకి వెళ్ళి కూర్చున్నారు.

ఎరీనాకి వెనక ఉన్న స్టేజీ మీద మైక్ ముందున్నతను ఇంగ్లీష్ పాట గిటార్ వాయిస్తూ పాడుతున్నారు.

"ఫ్రీడమ్, ఫ్రీడమ్."

గొంతు చించుకుని పాడుతున్నాడు 'వుడ్‌స్టాక్'లోని ఆ పాట. పాట అయిపోయాక మరొకతను తియ్యటి గొంతుతో ఇంగ్లీష్‌లో చెప్పాడు.

"ఇదివరలో ఇక్కడ గులాబీ విత్తనాలు బదులు అప్సరసలు మొలుచుకొచ్చారు. ఆ అయిదుగురినీ కొత్త సంవత్సరం రాకమునుపే చూస్తారు."

చాలామంది నవ్వారు ఆ సంభాషణకి. కానీ శర్మ నవ్వలేదు. మామూలుగా అయితే చప్పట్లు కొట్టి నవ్వేవాడే కానీ ఎదురుగా కూర్చున్న వ్యక్తిని చూసి నవ్వలేకపోయాడు. కళ్ళు కుచించుకుపోయాయి. త్రుళ్ళిపడ్డాడు.

"నువ్వా?" అన్నాడు కోపంగా సంభ్రమంగా.

"అవును, నేనే."

"నువ్వెందుకొచ్చావ్?"

"ఇద్దరి రాకకి కారణం ఒకటే"

"ఎప్పట్నించీ?"

"ఇదే మొదటిసారి" అవధాని - శర్మ తమ్ముడు అవధాని జవాబిచ్చాడు, కొద్దిగా భయంగానే.

"ఛీ, ఛీ, నువ్వు ఇలాంటి చోట్లకి రాకూడదు."

అవధాని మాట్లాడలేదు.

"డబ్బెక్కడిది? వందకి తక్కువ ఖర్చు కాదు ఇక్కడికి వస్తే."

"ఓ స్నేహితుడి దగ్గర అప్పు తీసుకున్నాను. తర్వాత ఇస్తానని."

"ఎలా తీరుస్తావ్?"

"జీతం వచ్చాక"

"ఉద్యోగం వచ్చిందా?"

"ఎప్పటికయినా రాకపోతుందా? కొత్త సంవత్సరంలో తొలి ఘడియల్లో ఇక్కడ సరదాగా గడిపితే, ఆ సంవత్సరం అంతా సంతోషంగా, సరదాగా గడిచిపోతుందని నేనే మీ తమ్ముడిని తీసుకువచ్చాను."

అవధాని పక్కన కూర్చున్న అవధాని స్నేహితుడు చెప్పాడు శర్మతో.

"డామిట్, మా తమ్ముడిని చెడగొడుతున్నారు మీరెవరోగానీ."

"మన టేబుల్ ఒకటే అవటం దురదృష్టం. 1974లో ఇది ఆఖరి దురదృష్టం అనుకుందాం. 1975కి అదృష్టానికి స్వాగతం పలుకుదాం, కాసేపు మీ సంబంధం మరిచిపోయి"

అవధాని మిత్రుడు సిగరెట్ తీసి ఒక్కటి అవధానికి అందించబోతుంటే అన్నాడు అవధాని.

"నాకలవాటు లేదు కదురా"

"మరీ అంత భయమా, ఫర్వాలేదులే" అన్నాడు మిత్రుడు నవ్వి  సిగరెట్ అంటించి అన్నాడు హుంకరిస్తున్నట్లుగా.

"తాగులే."

అవధాని సిగరెట్టు వెలగించాడు. శర్మవైపు కాక మరోవైపు చూడసాగాడు. అవధాని సిగరెట్టు తాగే విధానం గమనించి అన్నాడు శర్మ.

"ఎన్నాళ్ళ నుంచీ అలవాటు"

"రెండు"

"నెలలా?"

"సంవత్సరాలు"

శర్మ పళ్ళు పటపట కొరికాడు కోపంగా.

బేరర్ నీట్‌గా టేబిల్ మీద సర్దాడు ప్లేట్లు. అవధాని నేప్‌కిన్ వడిలో వేసుకుంటుంటే అడిగాడు శర్మ.

"ఏంటది?"

"తండూరి చికెన్, చికెన్ షాజహాని బిర్యాని"

"మాంసం కూడా తింటావా? ఇదెప్పటి నుంచీ?" అడిగాడు కోపంతో ఊగిపోతూ.

"సంవత్సరం నుంచీ"

"ఛీఛీ" అని శర్మ బేరర్‌తో అన్నాడు, "హాఫ్ ఓల్డుటేవరిన్ విస్కీ, సోడాలు, చికెన్ నూడుల్స్, నాలుగు బాయిల్డు ఎగ్స్."

"మాకు క్వార్టర్ మేక్‌డొవెల్స్ బ్రాందీ" భయపడుతూనే నెమ్మదిగా చెప్పాడు అవధాని బేరర్‌తో.

ఆ తర్వాత ఇద్దరూ మాట్లాడుకోలేదు. ఎవరి స్నేహితులతో వాళ్ళు మాట్లాడుకోసాగారు, కేబరే మొదలయింది. మద్య నిషా తలకెక్కేదాకా అవధానికి కేబరే ఉత్సాహం కలిగించలేకపోయింది. మూడోపెగ్ పూర్తి చేశాక చప్పట్లు కొట్టసాగాడు అందరిలాగా, శర్మ సంగతే మర్చిపోయాడు.

భాంగ్రా నృత్యం, సినిమా సాంగ్స్, కేబరేలు క్రమంగా అయిపోతున్నాయి. రాత్రి పన్నెండు దగ్గర పడుతోంది. సీసాలు ఖాళీలవుతున్నాయి. అరుపులు, కేకలు ఎక్కువవుతున్నాయ్. డిసెంబర్ చలితో వైన్స్ వేడి పోటీ పడుతోంది.

మైక్‌లోంచీ చెప్పారు ఇంగ్లీష్‌లో.

"ప్రియమిత్రులారా సరిగ్గా ఇంకో నిముషంలో నూతన సంవత్సరం వస్తుంది. పాత సంవత్సరానికి వీడ్కోలు, కొత్త సంవత్సరానికి స్వాగతం, నాతో కలిసి పాడండి."

'ఫేర్ వెల్ టు సెవంటీ ఫోర్'

'వెల్‌కం టు సెవంటీ ఫైవ్'

అరుపులు, ఈలలు, కేకలు, గెంతులు, నిషా ఎక్కిన మందు పుచ్చుకున్న వాళ్ళంతా సీట్లలో కూర్చోలేకపోతున్నారు. పరిచయం ఉన్నా, లేకపోయినా, కనబడిన ప్రతివాళ్ళని కౌగిలించుకుంటూ, కరచాలనం చేస్తూ, చెంపలమీద ముద్దుపెట్టుకుంటూ, నూతన సంవత్సరం శుభాకాంక్షలని తెలియచేసుకున్నారు.

ఒకటి, రెండు, మూడు, అంటూ మైక్‌లోంచీ క్షణాలు లెక్క పెడుతున్నారు. పాత సంవత్సరంలోని ఆఖరి క్షణాలు లెక్కపెడుతున్నారు.

శర్మ లేచి, అవధానిని లేపి కౌగిలించుకుని 'గుడ్‌బాయ్ కమాన్' అంటూ ఎరీనా మీదకి లాక్కుపోయాడు. సిగరెట్టు అందించి తోరణాల్లా వ్రేలాడ కట్టిన గాలిబూరలని చూపించాడు.

అవధాని సిగరెట్‌తో ఆ బూరలని టపటప పేల్చేశాడు నిప్పు అంటించి.

"హేపీ న్యూఇయర్, ఎవ్విరిబడీ హేపీ న్యూ ఇయర్!"

అరుస్తున్నాడు శర్మ, అవధానిని భుజాలమీద వేసుకుని గిరగిర తిప్పుతూ, విస్కీ పూర్తిగా రక్తంలో కలిసిపోయి, నిషా తలకెక్కింది.

కొందరు ఖాళీ బాటిల్స్‌ని డెక్ మీదకి విసిరేస్తున్నారు. గలగలమంటూ పగిలిపోతున్నాయి ఖాళీ సీసాలు.

1975 వచ్చేసింది.

"నువ్వు ఇంటికి వెళ్ళు. పండగపూట కూడా పాత పెళ్ళామేనా? నేనేదో ఏర్పాటు చేసుకున్నాను. ఇంట్లో వదినకేం చెప్పకు"

తూలుతూ తుళ్ళుతూ ఎటో వెళ్ళిపోయాడు శర్మ, పావుగంట తర్వాత.

"మనకు అమ్మాయి ఉంటే బాగుండేది" అన్నాడు అవధాని మిత్రుడు.

ఆటో డ్రయివర్‌కి షేక్‌హేండ్ ఇచ్చి "మా ఇంటికి తీసుకుపోరా" అన్నాడు అవధాని.

"ఎక్కడ?"

"గొడవ చేయకు తీసుకుపో"

అవధానిని అవధాని మిత్రుడు చేర్చాడు ఇంటికి జాగ్రత్తగా.

అర్ధరాత్రి తలుపు కొడితే ఛాయే తలుపు తీసింది. తూలుతున్న అవధానిని లోపలికి నడిపించుకుని తీసుకెళుతుంటే అవధాని చేతులు ఛాయని చుట్టేస్తున్నాయి!

"ఛాయా! క్రొత్త సంవత్సరం, వద్దనకు" బతిమాలుతుంటే తన గదిలోకి వెళ్ళిపోయింది ఛాయ భయం వేసి!

9

ఛాయ హైదరాబాద్‌లోని సోమయాజులు గారింటికి వచ్చి మూడు నెలలు దాటిపోయాయి. నెలకి రెండు సినిమాలు విధిగా చూపిస్తుంది శాంత. నాలుగయిదు సార్లు ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌కి తీసుకెళ్ళింది.

కానీ వాళ్ళ మధ్య శర్మ గురించి కానీ, శర్మ తమ్ముడు గురించి కానీ ఎలాంటి సంభాషణ రాలేదు. అవసరం ఉంటే ఛాయ చెప్పి ఉండేది అనుకుంది శాంత.

దీక్ష విడాకులకి అప్లికేషన్ పడేశాడు కోర్టులో లాయర్ తో మాట్లాడి, దీక్ష భార్య విడాకులకి ఒప్పుకోలేదు. మధ్యవర్తి ద్వారా తెలిసింది దీక్షకి. తను విడాకులు ఇవ్వకుండా, భర్తతో కాపురం చేయకుండా, దీక్షని సాధించాలనుకుంటున్నారు దీక్ష భార్య, అత్తమామలు.

విడాకులు రావటం ఇలాంటి పరిస్థితుల్లో కొంచెం కష్టమని, అయినా తన శాయశక్తులా ప్రయత్నిస్తాననీ చెప్పాడు లాయర్. విడాకుల విషయంలో రూల్స్, లా, స్త్రీ పక్షానికే మొగ్గుతున్నాయి.

అవధానికి పెన్స్ తయారు చేసే ఓ కంపెనీలో ఓ చిన్న ఉద్యోగం దొరికింది ఫిబ్రవరి చివరి వారంలో. వారం నుంచీ ఉద్యోగానికి వెళుతున్నాడు. ప్రతి శనివారం తప్పకుండా సుందరికి ఫోన్ చేసి, ఆదివారం కలుసుకుంటున్నారు ఎక్కడో అక్కడ.

నెహ్రూ జూలాజికల్ గార్డెన్స్‌కి వెళ్ళారు సుందరి, అవధాని.

మార్చి చివరి ఆదివారం కోటీలో కలుసుకుని, ఇద్దరు కలసి హోటల్‌లో భోజనం చేసి పార్క్‌కు రిక్షాలో వెళ్ళారు మదీనా నుంచి.

ఆదివారం కాబట్టి, ఎండాకాలం సమీపిస్తోంది కాబట్టి పార్కులో కొంచెం రద్దీగానే వుంది ఎప్పటికన్నా.

పార్క్ మొత్తం తిరిగారు గంతసేపు జంతువులని, పక్షులని చూస్తూ, తర్వాత ఓ సిమెంట్ బెంచిమీద కూర్చున్నారు.

సుందరే మొదట మాట్లాడింది. అప్పటిదాకా "ఆ పక్షి బాగుంది కదూ, తెల్ల పులి చూడు"లాంటి మామూలు మాటలే తప్ప వేరేమీ మాట్లాడుకోలేదు ఇద్దరూ.

"నీ జీతమెంత?"

"నీ వయసు ప్రక్కన సున్నా పెట్టి రెండు చేత గుణించి, వచ్చినదాంట్లోంచి నలభై తీసెయ్ అంత."

"ఏదీ మళ్ళీ చెప్పు" అన్నది సుందరి ఉత్సాహంగా ఆ విధంగా గుణించి అన్నది.

"మూడు వందల ఇరవైయా?"

"అవును,"

"అయితే మన పెళ్ళెప్పుడు?"

"ముందర నా ముద్దెప్పుడు?"

"చూద్దాంలే, మీ ఇంట్లో చెప్పాలా?"

"లేదు, వద్దు."

"టచ్, ముట్టుకోకపోతే ప్రేమ బలపడదు."

"ఎక్కడ చదివావ్?"

"ఏదో చెత్త పుస్తకంలో, అదొక్కటే ఆ పుస్తకానికంతటికీ మంచి వాక్యం!"

"అదొక్కటే చెడ్డవాక్యం మిగతా పుస్తకమంతా బావుంటుందయితే."

"సీరియస్‌గా అంటున్నాను, ఐ వాంట్ టు కిస్ యు, కిస్ యువర్ లిప్స్..."

"ఆగు, నా బేగ్‌లోంచీ చిల్లర తీసి గుప్పిటలో పట్టుకుంటాను. ఓ నాణెం తియ్యి. పదిపైసలు తీస్తే నువ్వు గెల్చుకున్నావన్నమాట. మరో నాణెం తీస్తే మళ్ళీ మనం కలిసేదాకా అడక్కు, ఊరికే సిగ్గేసేలా అదే పాటపాడకు."

"అబ్బబ్బ, ఓసారి చూడబోయే సినిమా ఎన్ని రీళ్ళు చెప్పుకుంటేనే అంటావ్. ఒకసారి బస్ టికెట్టు నంబర్ కరెక్ట్‌గా చెప్పాలంటావ్. ఓసారి డబల్ డెక్కర్‌కి లోపల ఎన్ని మెట్లో చెపుకోవాలంటావ్."

"ట్రై అండ్ ట్రై అన్నారు ఇంగ్లీష్ వాళ్ళు"

"ఆల్ రైట్, ఏది నీ గుప్పిట".

తన చేతిలోని హేండ్‌బేగ్‌లోంచీ కొంత చిల్లర తీసుకుంది. ఆ చిల్లరని సుందరి గుప్పిటలో వేసి గలగలలాడించింది కదుపుతూ.

"కళ్ళు మూసుకుని ఒకటి తియ్యి త్వరగా."

అవధాని కళ్ళు మూసుకుని సుందరి చేతిలోని నాణేలలోంచి ఓ నాణాన్ని అందుకున్నాడు. కళ్ళు తెరచి చూశాడు తర్వాత.

పది పైసల బిళ్ళ అది!

"వహ్వా - గెలిచాను" అరిచాడు ఆనందంగా.

"ష్" సుందరి సిగ్గుగా చూస్తూ అన్నది.

"ఇంకా 'ష్' ఏంటి? ఎక్కడ? పద"

"ఛీ వద్దు."

"ఛీ లేదు, ఛా లేదు. అక్కడో చోట నిర్మానుష్యంగా వుంటుంది పద."

"ఓసారి నా చేతిలో ఏం ఉన్నాయో చూడు."

సుందరి చేతిలోకి చూశాడు అవధాని. చేతినిండా పది పదిహేను నాణాలు, అన్నీ పదిపైసల నాణేలే!

"అరె ఏమిటివి?" అన్నాడు.

వాటిని బేగ్‌లో పడేసి, రెండు చేతులతో ముఖం మూసుకుంది సిగ్గుగా.

"నువ్వెప్పుడూ ఓడిపోతూంటే నేను మాత్రం ఏం చేయాలమ్మా."

"పద పద."

అవధాని సుందరి నడుం చుట్టూ చేయి వేసి లేవదీశాడు. ఇద్దరు ముగ్గురు తమవంక చూస్తున్నా వదలకుండా అలానే నడవసాగాడు.

"జీవితంలో మొదటిసారి" అన్నాడు సంతోషంగా.

"ఎవరయినా చూస్తారేమో?" కొద్దిగా అనుమానంగా అన్నది సుందరి.

"నీకాభయం అక్కరలేదు. అక్కడో చక్కటి చోటు చూశాను.... ఎలా ఉంటుంది! చాలాసార్లు ఇంగ్లీషు సినిమాల్లో చూశాను, తియ్యగా ఉంటుందని కథల్లో చదివాను. "

"ఛీపో ఇంక నాతో మాట్లాడకు దాని గురించి" సుందరి బుగ్గలు అప్పటికే సిగ్గుతో ఎర్రగా కందిపోయాయి.

అవధాని తను అంతకుమునుపు చూసిన చోటికి వెళ్ళారు. పందిరి మీద ఏవో లతలు పాకి ఉన్నాయి.

లోపలికి వెళ్ళడానికి దారి వుంది, కొద్దిగా చీకటిగా వుంది లోపల.

"పాములేమయినా వుంటాయేమో?" భయంగా అడిగింది సుందరి.

"ఉన్నా ఏం చేయవులే రా."

చేతిని సుందరి నడుం చుట్టూ పోనిచ్చే ముందు ఓసారి చుట్టూ చూశాడు. ఎవరూ లేరని నిశ్చయించుకున్నాక లోపలికి నడిచాడు.

చటుక్కున ఆగిపోయాడు.

లోపల రెండు జంటలున్నాయి. కాలేజీ స్టూడెంట్స్‌లాగా ఉన్నారు, నలుగురూ ఓ సారి సుందరి, అవధానుల వంక చూసి, చిన్నగా నవ్వి మళ్ళీ ముద్దుల్లో మునిగిపోయారు.

"ఇక్కడ కాదు ఇలా కాదు"

సుందరి బయటకి పోతుంటే పట్టుకుని ఆపాడు అవధాని సుందరిని.

"ఇక్కడే ఇలాగే"

బయటికి లాక్కెళ్ళింది సుందరి అవధాని చొక్కా పట్టుకుని.

"ఛీ,ఛీ" అన్నది బయటికి వచ్చాక.

"వాళ్ళు వచ్చేదాకా ఆగుదామా... అసలిప్పుడప్పుడే రారేమో?"

"మాట్లాడకుండా నడు బయటకు."

బయటకి వెళుతూ అన్నది.

"వచ్చే ఆదివారం ఓ బెంగాలీ సినిమా ఉంది మార్నింగ్ షో, దానికి రా."

"అక్కడా?"

"ఊఁ తెలిసిన వాళ్ళ మాట అటుంచు, అసలు పైక్లాసుకి ఎవరూ రారు బాక్స్‌కి వెళదాం. మన ఇష్టం."

"నాకు బెంగాలీ సినిమా నచ్చదు."

"నాకూ బెంగాలీ రాదు, నచ్చదు, అసలు సినిమా చూడటానికి వెళితేగా?"

"ఏ థియేటర్!"

సినిమా థియేటర్ పేరు చెప్పింది సుందరి.

మే వచ్చేసింది!

1975లో అప్పుడే నాలుగు నెలలు వెళ్ళిపోయాయి. కాదు కానే కాదు, ఖర్చయిపోయాయి. అయిదో నెల సగందాకా ఖర్చయిపోయింది.

శర్మ ప్రతి శనివారం రాత్రి తాగుతూనే ఉన్నాడు. అమ్మాయిలతో తిరుగుతూనే ఉన్నాడు. జీతంలో చాలా భాగం తన సరదాలకి ఖర్చు చేస్తూనే ఉన్నాడు.

శాంత శర్మని తిడుతూనే ఉంది. బుజ్జగిస్తూనే ఉంది, మందలిస్తూనే ఉంది, ప్రాధేయపడుతూనే ఉంది. అయినా శర్మ మారలేదు ఒక్క అణువయినా, మారతాడనే నమ్మకం కూడా ఇంకిపోయింది శాంతలో.

దీక్ష రోజూ ఫోటో స్టూడియోకి వెళుతూనే ఉన్నాడు. లాయర్‌ని అప్పుడప్పుడు కలుసుకుంటూనే ఉన్నాడు.

అవధాని ప్రతి ఆదివారం సుందరితోనే గడుపుతున్నాడు విధిగా. పార్క్‌లోనో, గార్డెన్‌లోనో, సినిమాలోనో, కానీ సుందరి గుప్పిటలో నాణాలు ఉంచుకుని తను చెప్పిన నాణెం తీస్తేనే ముద్దుపెట్టుకోవడానికి ఒప్పుకుంటోంది. ఆ హద్దు ముద్దు దాటడం లేదు, దాటనివ్వడం లేదు సుందరి.

కామేశ్వరమ్మ ఆరోగ్యం అలాగే ఉంది. కొద్దిగా క్షీణించింది కూడా. సోమయాజులు దీక్షకి ఫోటో స్టూడియో వ్యవహారంలో సహాయం చేస్తూనే ఉన్నాడు.

బాబుకి ఛాయ తప్ప మరెవ్వరూ అవసరం లేదు, ఛాయ ఉంటే చాలు.

ఛాయ!

ఛాయలో చాలా మార్పు వచ్చింది. ఆరు నెలల క్రితం వచ్చిన ఛాయలా లేదు ఇప్పుడు ఆమె. ఏదో మార్పు ఒంట్లో, మనసులో కూడా. పనిమీద ఆమె ఇదివరకంత ఉత్సాహం చూపించటం లేదు. అసలు దేనిమీదా ఉత్సాహం చూపించటం లేదు.

ఆమెలోని మార్పులని ఆ ఇంట్లో అంతా నిశ్శబ్దంగా గమనిస్తూనే ఉన్నారు. కానీ ఇదేమిటని ఎవరూ అడగలేదు. వాళ్ళలో వాళ్ళు కూడా మాట్లాడుకోవటం లేదు ఛాయలోని మార్పు గురించి, ఏ క్షణంలో అగ్ని పర్వతం పగులుతుందా అని చూస్తున్నారు నిశ్శబ్దంగా.

ఒకరోజు అగ్నిపర్వతం పగిలిందా ఇంట్లో.

కామేశ్వరమ్మ ఇక ఊరుకోలేకపోయింది. ఛాయని అడిగింది మధ్యాహ్నం.

"కథ చదవమంటారా?" నిర్లిప్తంగా వారపత్రిక పేజీలు త్రిప్పుతూ అడిగింది ఛాయ కామేశ్వరమ్మని.

"చదువుదువుగానీ, ముందర నేనడిగినదానికి సమాధానం చెప్పు. "

"అడగండి"

"ఈ మధ్య అదోమాదిరిగా ఉంటున్నావ్?"

"అవును"

"ఒంట్లో బావుండటం లేదా?"

"అవును"

"ఏం?"

"....."

"ఎన్నో నెల?"

"నాలుగు"

"నాలుగో నెలా?"

"అవును నాలుగో నెల?"

కామేశ్వరమ్మ అనుమానంగా, భయంగా అడుగుతూంటే నిశ్చింతగా సమాధానం చెప్పింది ఛాయ. వారపత్రిక తెరచి చదవసాగింది కథ.

"ఉషా కారులో షికారు కెళదామా అంటూ హుషారుగా లోపలికడుగుపెట్టాడు కిషోర్."

"ఆపు"

ఆపింది.

"ఎవరతను?" అడిగింది కామేశ్వరమ్మ వణికే కంఠంతో

"ఎవరతను, ఎవరతను?"

"నాలుగో నెలకి ఎవరు బాధ్యులు ఎవరు వాడు?"

మౌనం

"ఇంట్లో వాళ్ళా! బయటివాళ్ళా?"

నిశ్శబ్దం

"చెప్పు, ఎవరు వాడు? సహజానందంగారికి తెలిస్తే ఎంత అప్రతిష్ట?"

"ఎవరకు తెలియనక్కరలేదు ఈ సంగతి!"

"నీకు నెల తప్పిందని తెలిసీ ఎందుకు ముందే చెప్పలేదు?"

ఛాయ మాట్లాడలేదు.

"నిన్నే, మాట్లాడవే? ఎబార్షన్ చేయిస్తామని భయపడ్డావా?"

ఛాయ పెదవి కదపలేదు.

"పెళ్ళి కాకుండానే పిల్లల్ని కందామనుకున్నావా? మా ఇంటా, వంటా లేదు. నిన్నీక్షణమే సత్తెనపల్లి పంపిస్తాను."

"వద్దు"

"మరెవరో చెప్పు, చెప్పు వాడెవడో?"

నోరు మెదపలేదు ఛాయ.

"శర్మా? దీక్షా? అవధానా? ఎవరు?"

ఛాయ కిమ్మనలేదు.

"చెప్పవా? అడిగింది కామేశ్వరమ్మ విసురుగా.

చెప్పమన్నట్లుగా తలాడించింది ఛాయ అడ్డంగా.

"అయితే పంపించేస్తాను నిన్ను మీ ఊరు."

"వద్దు"

"మరెవరో చెప్పు, పోస్ట్‌మానా? పాలవాడా? కూరలవాడా? ఎలక్ట్రిక్ మీటర్ రీడింగ్ అతనా? దర్జీవాడా, షాపువాడా? స్టూడియో కుర్రాడా? ఎవడు వాడు? "

తల అడ్డంగా ఊపింది ఛాయ.

"వాళ్ళెవరూ కాదా?"

మళ్ళీ తల అడ్డంగా ఊపింది.

"ఇంట్లో వాళ్ళా?"

తల కదపలేదు ఛాయ.

"చెప్పు మా తల్లివి కదూ, చెప్పు నన్ను ఇంకా హింసించకే తల్లీ. ఎవరు? ఇంట్లో వాళ్ళేనా?"

ఈసారి నెమ్మదిగా, చాలా నెమ్మదిగా, అవునన్నట్లుగా తల తాటించింది ఛాయ.

"ఎవరు? శర్మా?"

"…."

దీక్షా?"

"…."

"అవధానా?"

"...."

"ఆయనా?"

కాదన్నట్టుగా తల అడ్డంగా ఊపింది.

"మరెవరు? శర్మా? దీక్షా? అవధానా?"

సమాధానం చెప్పలేదు ఛాయ.

"మా ముగ్గురబ్బాయిల్లో ఒకరా?"

"అవును" స్పష్టంగా, చక్కగా చెప్పింది ఛాయ.

"ఎవరు? ఎన్నోవాడు? వాడి పేరేమిటి?"

"చెప్పను?"

"చెప్పాలి, చెప్పి తీరాలి. చెప్పు ఎవడా వెధవ? నా కడుపున చెడబుట్టిన వెధవెవడు?"

"చెప్పను"

"ఛాయా, చెప్పి తీరాలి" గది గోడలదిరేలా గర్జించింది కామేశ్వరమ్మ.

"చెప్పను..చెప్పను..చెప్పను.."

ఆమె గబుక్కున లేచి తన గదిలోకి పరిగెత్తింది., కామేశ్వరమ్మ పిలుస్తున్నా వినకుండా.

కామేశ్వరమ్మ మంచం మీద నుంచి లేచి ఛాయ గది వైపు నడిచి, గుమ్మం దగ్గరే ఆగిపోయింది.

పందిరి పట్టెమంచం మీద పడుకుని వుంది ఆమె. వెక్కి వెక్కి ఏడుస్తోంది దిండులో తలదాచుకుని. కామేశ్వరమ్మకి తెలుసు ఆమె ఎంత అమాయకురాలో, నెమ్మదస్తురాలో.

కామేశ్వరమ్మ మనసంతా జాలితో నిండిపోయింది ఆమె మీద. దగ్గరికి నడిచివెళ్ళి, పక్కన కూర్చుని తలమీద చేయి వేసి, చేత్తో తలని రాస్తూ అంది.

"వద్దులే, ఇప్పుడే చెప్పొద్దులే, తర్వాత నెమ్మదిగా చెప్పొచ్చులే..ఏడవక"

"ఎప్పటికీ చెప్పను" ఏడుస్తూనే అన్నది ఆమె.

"ఏడవద్దన్నాగా మరి" లాలనగా అంది కామేశ్వరమ్మ.

"నన్ను సత్తెనపల్లి పంపించేస్తారా?" దీనంగా అడిగిందామె.

"పంపనులే"

అయినా ఏడుస్తూనే వుంది ఛాయ, సాయంత్రం అంతా ఇంటికి తిరిగి వచ్చేదాకా. అంతా తిరిగి వచ్చినా ఇంకా ఏడుస్తూనే వుంది, అలానే పడుకుని.

ఈ నవల సినిమా కావడం వెనుక సంగతులు

...

*క్లయిమేక్స్ దాకా మొత్తం స్క్రిప్ట్ రాశాను. అది చాలా రోజులు కాంతారావు గారి వద్దనే ఉంది. ఆయనా సినిమా తీసే ప్రయత్నం విరమించుకోవడంతో, ఈ నవల మీద ఫిల్మ్ ఆర్టిస్ట్ శ్రీ మురళీమోహన్ ఆసక్తి చూపించారు. అలాగే వరంగల్ కి చెందిన మరో నిర్మాత శ్రీ కేశవరెడ్డి కూడా నన్ను కలిసారు. అప్పటికింకా రైట్స్ కాంతారావు గారి దగ్గరే ఉండడంతో ఆయన్ని సంప్రదించమని చెప్పాను.*

*ప్యాసా, కాగజ్ కేఫూల్ లాంటి గురుదత్ సినిమాలకి పనిచేసిన హిందీ రచయిత శ్రీ అల్ రార్ ఆల్వి తో రెండు మూడు రోజులు నవల క్లయిమేక్స్ గురించి 1982లో చర్చించాను. ఓ నిర్ణయానికి వచ్చాం. కొద్దిపాటి మార్పులతో దాదాపుగా ఆ క్లయిమేక్స్ చిత్రీకరించారు. మొత్తానికి హిందీలో తొలిసారిగా సినిమాగా తీయబడ్డ తొలి తెలుగు నవల అన్న ఘనత ఆ విధంగా నా 'రేపటి కొడుకు ' కి దక్కింది.*

*- రచయిత*

## 10

అందరికన్నా ముందు శాంత వచ్చింది ఆఫీసు నుంచీ. తన గదిలోకి వెళ్ళి బట్టలు మార్చుకుని కాఫీ కోసం వంటగదిలోకి వెళ్ళింది. వంటగదిలో ఛాయ కనపడలేదు. ఎప్పటిలా చిరునవ్వుతో పలకరించి కాఫీ ఇవ్వడానికి.

మధ్య హాల్లో మంచం మీద పడుకుని ఉంది కామేశ్వరమ్మ పైనున్న దూలాలవంక చూస్తూ. తనని చూసి కూడా పలకరించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగించింది శాంతకి.

ప్రక్కన కూర్చుంటూ అడిగింది.

"ఏం జరిగిందత్తయ్యగారూ? అలా ఉన్నారే? ఒంట్లో బాగోలేదా?"

"కూర్చోమ్మా" అంది కామేశ్వరమ్మ, శాంత సర్దుకుని కూర్చోడానికి సరిపడ చోటునిస్తూ.

"ఏం జరిగిందండీ?" అడిగింది శాంత, ఏదో ఉందని గ్రహించేసింది, కామేశ్వరమ్మ కంఠస్వరాన్ని బట్టి.

"చాలానే జరిగింది మనకెవరికీ తెలియకుండా."

కామేశ్వరమ్మ ఏడ్చిన గుర్తుగా, బుగ్గల మీద చారలు కనబడుతున్నాయి. వాటిని చూసి మరింత ఆశ్చర్యపోయింది శాంత.

"టెలిగ్రాం ఏదయినా వచ్చిందా?" అడిగింది భయంగా.

"రాలేదు ఎవరూ పోలేదు, వస్తున్నారు"

"ఎవరు? ఎప్పుడు?"

"మొగో ఆడో తెలియదు కానీ, ఇంకో అయిదు నెలలో వస్తున్నారు."

"నా కర్థం కావటం లేదు మీరు చెప్పేది. వివరంగా చెప్పండి."

"ఛాయకి నాలుగో నెల".

శాంత మొహంలో కత్తివాటుకి నెత్తురు చుక్కలేదు. అలాగే చూస్తుండిపోయింది కామేశ్వరమ్మ కళ్ళలోకి పిచ్చిదానిలా.

"ఏమిటి? మళ్ళీ చెప్పండి?" అని అడిగింది.

"ఛాయని అడిగేశాను ఇందాకే. నాలుగో నెల."

"నాకూ అనుమానం వేసింది కానీ అడగలేదు నేను. నిజమేనన్నమాట."

"నిజమే"

"ఛీ,ఛీ"

"పిచ్చిపిల్ల"

"ఎవరట?"

"చెప్పలేదు"

"సత్తెనపల్లి పంపిచేద్దామత్తయ్యా, ఇరుగు పొరుగుల కెవరికయినా తెలుస్తే మనల్ని తప్పుపడతారు అనవసరంగా."

"ఇప్పుడు జరిగిందదే"

"పక్కింటివాళ్ళెవరయినా మిమ్మల్ని అడిగారా?" గాభరాగా అడిగింది శాంత.

"కాదు, వాడెవడో బయట వెధవ కాదు."

"అంటే?"

"ఛాయని నాశనం చేసిన వెధవ మన ఇంట్లో వాడే"

మరోసారి శాంత మొహంలో కత్తివాటుకి నెత్తురు చుక్కలేదు.

"నిజమా?" అడిగింది వణికే కంఠంతో.

"అవును"

"ఛాయ చెప్పిందా? మీరనుకుంటున్నారా?"

"బతిమాలగా, బతిమాలగా ఛాయే చెప్పింది."

"ఎవరది?" గుండెలు బిగపట్టుకుని అడిగింది.

"చెప్పలేదు,"

"దాయకండి, మా వారేనా?"

"దాయటం లేదు, నాకు ఛాయ చెప్పలేదు ఎవరో?"

"ఎందుకు చెప్పలేదు?"

"ఏమో, చెప్పలేదు."

"అంటే ఈ ముగ్గురిలో ఎవరో ఒకరటా?!

"అవును"

"అవునా?"

"ఎక్కడుంది ఛాయ?"

"గదిలో పడుకుని ఏడుస్తోంది."

"నేనడగనా?"

"అడుగు చెపుతుందేమో."

శాంత కొంగుతో నుదుట పట్టిన చెమటలని తుడుచుకుంది. ఛాయ గదివైపు అడుగులు వేసింది. కాసేపు పడుకుని ఏడుస్తున్న ఛాయ వంక చూసి, పెద్దగా నిట్టూర్చి లోపలికి వెళ్ళింది.

ప్రక్కన కూర్చుని భుజం మీద చెయ్యివేసి పిలిచింది శాంత మృదువుగా.

"ఛాయా"

పలకలేదు ఛాయ, మరోసారి పిలిచింది. అయినా పలకలేదు.

"ఏడవకు అత్తగారు చెప్పారు, లే లేచి కళ్ళు తుడుచుకో."

బలవంతంగా ఛాయని లేవనెత్తింది శాంత. ఆ కాస్సేపు ఛాయ అంటే జాలికలిగింది శాంతకి. బహుశా ఆ స్థితిలో ఉన్న ఆడపిల్లని చూస్తే, మరో ఆడపిల్లకి జాలి తప్పకుండా కలుగుతుందేమో?

"ఏడవకన్నానా? కళ్ళు తుడుచుకో."

తనే స్వయంగా కళ్ళు తుడిచింది శాంత ఛాయ చీర కొంగుతో.

"ఇప్పుడు చెప్పు ఏం జరిగింది? ఎలా జరిగింది? ఎప్పుడు జరిగింది? ఎవరు?

ఛాయ ఇంకా వెక్కి వెక్కి ఏడుస్తూనే ఉంది. ఇన్ని నెలల నుంచీ దాచుకున్న దుఃఖం ఇంకా తీరలేదు.

"చెప్పు, మా ఆయనా?"

"..."

"దీక్షా? ఫోటో తీయించుకోడానికి వెళ్ళినప్పుడా?"

"..."

"అవధానా? తాగి వచ్చినప్పుడా?"

"..."

"చెప్పాలి మరి అడుతుతూంటే, చెప్పు ఎవరూ?"

"చెప్పను"

"చెప్పకపోతే నా మీద ఒట్టే చెప్పు."

"ఊహూ"

"బాధపడనులే, మా ఆయనా."

"చెప్పను."

"ప్లీజ్ ఛాయ చెప్పు ఆయన అయినా నాకు బాధలేదు చెప్పు, ఎవరు?"

"సారీ"

"నువ్వు చెప్పకపోతే నాకివ్వాళ నిద్రపట్టదు."

"సారీ చెప్పనే చెప్పను."

"చెప్పకపోతే ఎలా?" కోపంగా అరిచింది శాంత.

"నాకిష్టం లేదు, చెప్పను."

"నేను ఎవరి చెవిలో ఊదనులే, నాకు మాత్రం చెప్పు" బుజ్జగిస్తూ అడిగింది శాంత.

"నన్ను తిట్టండి, కొట్టండి, నరకండి, నేను చెప్పనుగాక చెప్పను."

ఛాయ మళ్ళీ ఏడుస్తూంటే శాంతకి ఛాయమీద దయ, జాలి, కోపం ఒక్కసారిగా పొంగుకొచ్చాయి.

ఛాయని ఇంక మాట్లాడించడం ఇష్టంలేక, ఒక్క ఉదుటున లేచి తన గదిలోకి వెళ్ళిపోయింది శాంత.

బి షిఫ్టు పూర్తి చేసుకుని శర్మ వచ్చాడు. శాంత తర్వాత, సరాసరి తన గదిలోకి వెళ్ళాడు, చొక్కా విప్పుతూ అడిగాడు శాంతని శర్మ.

"కాస్త కాఫీ తెచ్చిపెట్టు"

శాంత చదువుతున్న పుస్తకంలోంచీ తల ఎత్తకపోవడం వల్ల మళ్ళీ అడిగాడు శర్మ, ఇంకాస్త గట్టిగా.

"కాఫీ"

అయినా శాంత కదలక పోవడం ఆశ్చర్యాన్ని, కించిత్ కోపాన్ని కలిగించింది శర్మకి.

"నిన్నే కాఫీ" ఇంకాస్త గట్టిగా అన్నాడు లుంగీ అందుకుంటూ, లుంగీ కట్టుకుని ప్యాంట్ విడిచి, దాన్ని హేంగర్‌కి తగిలించాడు. చిల్లర డబ్బులు ప్యాంట్ జేబులోంచి గలగలమంటూ కిందపడ్డాయి. ఆ చప్పుడికి కూడా శాంత తిరిగి చూడకపోవటం వల్ల, శాంతకి కోపం వచ్చిందని గ్రహించాడు శర్మ.

వంగి చిల్లర ఏరుతూ ఎందుకు వచ్చి ఉంటుందా అని ఆలోచించాడు, తన గురించి మళ్ళీ ఎవరన్నా చెడుగా చెప్పి ఉంటారు బహుశా, ఎవరయి ఉండొచ్చు? చాలాకాలం తర్వాత శాంతకి కోపం వచ్చినట్లుంది.

"ఏం పుస్తకం అది!" అడిగాడు దగ్గరకి నడిచి.

చలనం లేదు శాంతలో. చేతిలో చిల్లరని చప్పుడయేలా శాంత ఎదురుగా ఉన్న గాడ్రేజ్ ఫోల్డింగ్ టేబుల్ మీదకి చల్లాడు.

"ఏం జరిగింది? ఎవరు చెప్పారీసారి?" అడిగాడు భుజాల మీద చేతులు వేస్తూ.

చప్పుడయేలా పుస్తకం మూసి, పుస్తకాన్ని టేబుల్ మీదకి గిరాటేసి అన్నది శాంత తెచ్చిపెట్టుకున్న శాంతంతో.

"అలా కూర్చోండి" మంచం వైపు చూపించింది.

శాంత దాచుకుంటున్న కోపాన్ని గ్రహించి ఒక్కక్షణం గుండె ఆగిపోయినట్లయింది శర్మకి. కిక్కురుమనకుండా, భార్య చెప్పినట్లుగానే వెళ్ళి కూర్చున్నాడు మంచం మీద. ప్రశ్నార్థకంగా చూశాడు శాంత కళ్ళలోకి.

శాంత లేచి, తమ గది తలుపులు మూసిలోపల గొళ్ళెం పెట్టి, మళ్ళీ వచ్చి కూర్చుంది కుర్చీలో భర్త కెదురుగా.

"ఏం జరిగింది? జీతంలో ఏభైదాచాను. ఎవరు చెప్పారు? అందుకేనా?"

"మీ వయసెంత?" సూటిగా అడిగింది.

"ముప్పై అయిదనుకుంటాను"

"ఛాయ వయసు?"

"ఏం?"

"పద్దెనిమిది, మీకు పదిహేడేళ్ళకే పెళ్ళయి ఉంటే ఛాయ వయసు కూతురుండేది మీకు."

"ఛీ, నేనీ మధ్య ఛాయవంక కన్నెత్తయినా చూడటం లేదు, అబద్ధం చెప్పి ఉంటుంది."

"నేను మొదటే మీకు వార్నింగ్ ఇచ్చాను, ఛాయనేమయినా చేస్తే మీకు విడాకులిచ్చేస్తానని, అందుకు నాకాధారాలున్నాయని, అవకాశాలు కూడా ఉన్నాయని."

"నా మాట నమ్ము, అసలు నిన్నేం జరిగిందంటే, 'ఏమ్మా? ఒంట్లో కులాసాగా ఉండటం లేదూ' అని అడిగానంతే, నీతోడు, మన బాబు తోడు."

"ఛాయ కిప్పుడు నాలుగో నెల."

పక్కలో బాంబు పడ్డట్టుగా, కత్తి పట్టుకుని ఎవరో మీదకి వచ్చినట్టుగా భయపడ్డాడు శర్మ.

"ఛాయకి నాలుగో నెలా?" అడిగాడు.

"అక్షరాలా నాలుగోనెల నడుస్తోంది."

"అసాధ్యం, ఎలా జరిగింది?"

"అది మీరు చెప్పాలి, ఏరోజు? ఎన్ని రోజులు, ఎంతకాలం నుంచీ?"

"శాంతా"

"అదికాదు సమాధానం, చెప్పండి" రౌద్రంగా అరిచింది శాంత.

అయోమయంగా చూస్తూ అన్నాడు శర్మ.

"నాకర్థం కావటం లేదు నువ్వేమంటున్నావో."

"మీరు నాముందు నటించవద్దు, నిజం చెప్పండి."

"నాకేం పాపం తెలియదు, నిజమే చె..."

"నాకు ఛాయ చెప్పింది," శర్మ మాటలకి అడ్డుపడుతూ చెప్పింది శాంత. "ఛాయ నాకంతా చెప్పింది, ఎందుకు చేశారిలా?"

"ఛాయ చెప్పిందా? నేను నమ్మను, చెప్పినా పచ్చి అబద్ధం చెప్పింది."

"అది మీకలవాటు"

"కానీ ఇప్పుడు నిజమే చెపుతున్నాను."

"మీ నోటి మాటలమీద నమ్మకం పోయి చాలా ఏళ్ళయింది. మీ ప్రవర్తన, స్వభావం మీద నమ్మకం కుదిరింది, అవి చెడువని."

తల అడ్డంగా ఊపుతూ అన్నాడు శర్మ.

"నో నో నో, నెవర్, నాకు తెలియదు, ఛాయ అబద్ధం చెప్పింది."

భర్త కళ్ళల్లోకి చూస్తుండిపోయింది శాంత. వెంటనే చేతులతో ముఖం కప్పుకుంది, ఏడుస్తున్న శాంత వంక జాలిగా చూశాడు శర్మ, ముందుకి వంగి ఓదార్చపోయాడు.

"నన్ను ముట్టుకోకండి" అరిచిందిశాంత.

"నిన్ను ముట్టుకోవద్దా" దిగ్భ్రమ చెంది అడిగాడు శర్మ. శాంత దూరంగా తోసేస్తుంటే.

"మీరంటే నాకసహ్యం."

"శాంతా" కోపం, బాధ మిళితమయిన కంఠంతో అన్నాడు శర్మ గట్టిగా.

ఆ దంపతులిద్దరూ మాట్లాడుకోలేదు చాలాసేపు. అలాగే శిలా ప్రతిమల్లా కూర్చుండిపోయారు. శాంత ఏడుపుని ఆపుకుని లేచి నిలబడింది. భర్తవంక చూడనయినా చూడకుండా, కిటికీ దగ్గరికి వెళ్ళి, కూజాలోని నీళ్ళు గ్లాసులోకి వంచుకుని, ఆ నీళ్ళతో మొహం కడుక్కుంది, ఏడ్చిన గుర్తులు కనబడకుండా.

తర్వాత పౌడర్ రాసుకుంది.

"శాంతా నన్ను నమ్ము, నాకేం తెలియదు, ఏ ఒట్టు వేయమంటే ఆ ఒట్టు వేస్తాను."

"....."

"ఛాయ అబద్ధం చెప్పింది, షి ఈజ్ ఎ లయర్, షి ఈజ్ ఎ డెవిల్."

శాంత పొడిగా అన్నది శర్మతో, చేతి గడియారం వంక చూసుకుని.

"అవధాని వచ్చి ఉంటాడు, పిలవండోసారి, నేను పిలుస్తున్నానని."

"అలాగే"

శర్మ బయటికి వెళ్ళి కొన్ని క్షణాల్లో అవధానితో వచ్చాడు.

"కూర్చో అవధాని" అన్నది శాంత.

శాంత సీరియస్‌గా ఉండటం గమనించి కూర్చున్నాడు కుర్చీలో. అన్నయ్య మొహంలోకి చూశాడు, శర్మ మొహం కూడా పాలిపోయి ఉండటం గమనించాడు అవధాని.

"మీరు కాసేపు బయటకి వెళ్ళండి" శర్మ నుద్దేశించి అన్నది శాంత.

శర్మ మాట్లాడకుండా బయటికి నడిచాడు.

"తలుపు దగ్గరికి వేయండి" అరిచింది శాంత, శర్మ గుమ్మం దాటుతూంటే,

"ఏమిటొదినా?"

అవధాని ముందర మాట్లాడాలనే శాంత మౌనంగా ఉండిపోయింది అయిదారు నిమిషాలు. ఆ నిశ్శబ్దాన్ని భరించలేకపోయాడు అవధాని. వదిన తననిలా గుచ్చి గుచ్చి చూడటం అంతకన్నా భరించలేక అడిగాడు.

"ఏమిటొదినా?"

"ఇది కోర్టుకాదు, `అంతా నిజమే చెపుతాను` అని ప్రమాణం చేయకపోయినా నిజం కావాలి నాకు, ఐవాంట్ ది ట్రూత్."

"అడగండి"

"ఛాయకీ, నీకు ఎలా కుదిరింది సంబంధం?"

"వదినా" బిత్తరపోతూ అన్నాడు అవధాని.

"చెప్పు ఎన్ని నెలలనుంచి?"

"మీరు నన్ను అవమానిస్తున్నారు."

"నా ప్రశ్న నేను నిన్ను అవమానిస్తున్నానా అని కాదు, ఆ ప్రశ్న అడిగినప్పుడు ఆ సమాధానం చెప్పు. నా ప్రశ్న ఎన్ని నెలల నుంచి? అని, దానికి సమాధానం చెప్పు. ఎప్పటినుంచీ, సిగ్గులేదూ?"

అవధాని మొహంలో రంగులు మారాయి వెంటనే, కందగడ్డలా అయిపోయింది మొహం, కోపంతో పిడికిళ్ళు బిగిసుకున్నాయి, కాని దాదాపు పుష్కరం నుంచీ ఎంతో ప్రేమతో చూస్తున్న వదిన అలా తిట్టినా, ఎదురు తిరిగే ధైర్యం లేదు అవధానిలో.

కామేశ్వరమ్మ మీదయినా ఎదురు తిరగగలడు కాని, వదినని పల్లెత్తుమాట అనలేదు, శర్మతో కాపురం చేయగలుగుతున్న శాంత అంటే అవధానికి ఎంతో గౌరవం. అందుకే వెంటనే నోరు విప్పలేకపోయాడు. కోపాన్ని, దెబ్బతిన్న అహాన్ని దిగమింగుకోడానికి ప్రయత్నం చేస్తూండిపోయాడు.

"కమాన్ స్పీకప్" కంచుకంఠంలా మ్రోగింది శాంత కంఠం.

"మీరు చాలా పొరబడుతున్నారంటాను" అవధాని తన కోపాన్ని దాచలేకపోయాడు.

తను మరీ అంత గట్టిగా ప్రారంభించి ఉండకూడదనుకుంది శాంత.

"ఛాయ అబద్దం చెబుతుందంటావా? అసలు ఛాయ ఎప్పుడయినా అబద్దం ఆడిందా. ఈ ఇంటికి వచ్చాక."

"లేదు"

శాంత కాసేపు మాట్లాడలేదు, అవధానికి కోపం తగ్గేందుకు అవకాశం ఇస్తూ.

"అర్ధరాత్రి ఈ ఇంట్లో ఏం జరిగినా నాకు తెలియదనుకోకు."

"అంటే?"

"నీవల్ల ఛాయకి నాలుగోనెల ఇప్పుడు."

"శుద్ధ అబద్ధం" అరుస్తూ లేచాడు అవధాని.

"కూర్చో, ఇప్పుడే ఒప్పుకున్నావు ఛాయ అబద్దం ఆడదని."

"నాకు తెలిసినంత వరకు అబద్దం ఆడలేదు, కాబట్టి ఒప్పుకున్నాను. బహుశాఅబద్ధం ఆడేందుకు ఇప్పటిదాకా అవకాశం రాలేదేమో!" రెండో వాక్యం కాస్సేపు ఆలోచించి అన్నాడు అవధాని.

"అయితే నువ్వు ప్రవరాఖ్యుడినంటివా"

"ఇలా నిలదీసి అడిగించుకోవడం కంటే నరకం మరొకటిలేదని తెలుస్తోంది ఇప్పుడే ఐ ప్రామిస్, నాకేం తెలియదు, నమ్మితే నమ్మండి."

"అసలు నీ కెంతమంది ఆడవాళ్ళతో పరిచయం బయట?"

"ఎవరితో పరిచయం లేదు."

"అబద్ధం ఆడకు, ఒకరా? ఇద్దరా? ఇంకా ఎక్కువమందా?

నిస్పృహగా చూసి అన్నాడు అవధాని.

"నిజం?"

"నిజం"

"మరి సుందరి?"

"ఎవరు?"

అవధాని చెయ్యి చొక్కా బటన్ మీదికి వెళ్ళింది ఆదుర్దాగా.

"సుందరి, హెడ్‌మాస్టరుగారమ్మాయి నీకసలు పరిచయమే లేదా?"

"మీకెలా తెలుసు?"

"ప్రశ్నకి ప్రశ్న కాదు సమాధానం"

"సుందరి నా గర్ల్‌ఫ్రెండ్"

"అంతేనా? అసలు పరిచయమే లేదా?"

"పరిచయం ఉంది కాబట్టే గర్ల్‌ఫ్రెండ్ అయింది."

"మరి నా ప్రశ్న ఏమిటి? అర్థం కాలేదా?"

అవధాని తల వంచుకున్నాడు.

"ఈ చిన్న విషయానికే అబద్ధం ఆడిన వాడివి, నిన్ను ఛాయకు నెలతప్పటంలాంటి పెద్ద విషయంలో నమ్మమంటావు?"

శాంత కుడిచేత్తో చిటికలు వేస్తూ అంది.

"ఇది ఇంటర్వ్యూ కాదు నిజం చెప్పు."

"నిజమే చెప్పాను, నాకేం తెలియదు."

నా స్పృహగా, విసుగ్గా చూసింది తల వంచుకుని కూర్చున్న అవధానిని.

"వెళ్ళు, బాగా ఆలోచించుకుని నాకు నిజం చెప్పు, తప్పు చేశావు అని ఒప్పుకో చాలు, ఇది కోర్టు కాదు, నిన్నెవరూ ఇక్కడ ఉరితీయరు, తప్పు ఒప్పుకున్నంత మాత్రాన."

అవధాని లేచి తలుపు వైపు నడిచాడు.

"ఆ అన్నలకి తమ్ముడేగా నువ్వు కూడా, ఆయన్ని లోపలికి తగలడమను" విసురుగా అన్నది.

వెంటనే శర్మ లోపలికి వచ్చాడు, శర్మ వస్తుండగానే అన్నది శాంత.

"ఇక మీరు దాచి ప్రయోజనం లేదు, నాకు అవధాని అంతా చెప్పాడు."

"వాడేడీ?"

"మిమ్మల్నిద్దర్నీ చూశాడు అవధాని."

"నరికి పోగులు పెడతాను వాణ్ణి అబద్ధం ఆడితే, వాడు మాత్రం తక్కువ తిన్నాడా? డిసెంబర్ 31న నైట్‌క్లబ్‌కి వాడు వచ్చాడన్న సంగతి నీకింతవరకూ చెప్పానా? ఎవ్వరికీ చెప్పలేదు, అయినా నా మీద లేనిపోనివి కలిపించి చెప్తాడా?"

"అలా రంకెలు వేయకండి అనవసరంగా, వెంటనే వెళ్ళి దీక్షని ఉన్న పళంగా తీసుకురండి నేను  పిలుస్తున్నానని"

"దేనికి?"

"చెప్పినట్లు చేయండి, నన్ను విసిగించక."

"అలాగే"

"ఛాయ విషయం పొరపాటునయినా అనకండి ఆయనతో."

"అలాగే"

శాంత రెండు నిముషాలు ఊపిరి పీల్చుకుని బయటికి వచ్చింది.

"ఏమిటమ్మా అరుస్తున్నావ్" అడిగారు సోమయాజులు.

ఓ మూలగా వున్న కుర్చీలో మూతి ముడుచుకుని కూర్చుని వున్నాడు అవధాని. కామేశ్వరమ్మ ఏడుస్తోంది.

"ఏం లేదు, తెలిసిందా మీకు? అడిగింది శాంత"

"ఇప్పుడే చెప్పింది, ఇంకోసారి కనుక్కో ఛాయని" అన్నాడు సోమయాజులు.

శాంత మళ్ళీ ఛాయ గదిలోకి వెళ్ళింది. అలాగే పడుకుని ఉంది ఛాయ. నిద్రపోతోంది ఏడ్చి ఏడ్చి, పిలిచినా పలకలేదు, ఛాయని లేపటం ఇష్టం లేక తన గదిలోకి వెళ్ళిపోయింది శాంత.

శర్మ పావుగంట తర్వాత వచ్చి చెప్పాడు.

"స్టూడియోలో లేడు దీక్ష, రవీంద్రభారతికి వెళ్ళాడట ఫోటోలు తీయడానికి, డ్రామా అనుకుంటాను, రాత్రవుతుంది, షాపు తాళం చెవులు ఇంట్లో ఇచ్చేయమని చెప్పాడట కుర్రాడికి.

"మంచిది" అన్నది శాంత.

## 11

రాత్రి ఎనిమిదిన్నరకి నిద్రపోతున్న ఛాయని లేపింది శాంత.

"ఏడ్చి, ఏడ్చి బుగ్గలు చూడు ఎలా అయాయో? మొహం కడుక్కో అన్నం తిందాం" చెప్పింది. ఛాయ వద్దనకుండా లేచింది. బాత్‌రూంలోకి వెళ్ళింది మధ్య గదిలోంచి, ఎవరివంకా చూడకుండా. కామేశ్వరమ్మా సోమయాజులు ఛాయవంక గుడ్లప్పగించి చూస్తుండిపోయారు. అవధాని ఛాయ ఉనికినే గమనించనట్లు ట్యూబ్‌లైట్ వంక చూస్తుండిపోయాడు.

"మీకూ వడ్డిస్తున్నానత్తయ్యా. ఇవాళ ఆడవాళ్ళం ముగ్గురం కలిసి తిందాం" అన్నది శాంత.

"నాకాకలిలేదు. ఇవాళ బాగానే కడుపు నిండీ పోయిందమ్మా" సగం కోపంగా, సగం దుఃఖంగా అన్నది కామేశ్వరమ్మ.

"నాకూ నిండిపోయింది. అయినా ప్రయత్నిద్దాం - లేవండి" అన్నది లేని నవ్వు తెచ్చిపెట్టుకుంటూ.

నాలుగయిదు నిముషాలు బతిమాలించుకుని అన్నానికి లేచింది కామేశ్వరమ్మ. వంటగదిలో ఛాయ ముగ్గురికీ పీటలు వేసి కంచాలు పెట్టింది. వడ్డించింది.

ముగ్గురూ అన్నానికి కూర్చున్నారు. కూర అన్నం పూర్తయేంతదాకా ఎవరూ ఏం మాట్లాడలేదు. మధ్య నడుమ సోమయాజులు కొడుకులిద్దరితో ఏదో నెమ్మదిగా మాట్లాడ్డం వినిపిస్తోంది.

"ఛాయా, నువ్వు నెయ్యి వేసుకోలేదు" సంభాషణలోకి దిగుతూ అన్నది శాంత.

"ముందర నెయ్యి కలుపుకున్న అన్నమే" జవాబిచ్చింది ఆమె.

కాసేపు ఎలా ప్రారంభించాలో శాంతకే తెలియలేదు మామూలుగా అడిగినట్లుగా అడిగింది.

"దీనికి కారణం ఎవరో తెలిసింది. దీక్ష కదూ!"

ఛాయ సమాధానం చెప్పలేదు.

ఆ తర్వాత మళ్ళీ ఎవరూ ఏం మాట్లాడలేదు.

"అన్నం వండాలి. నేను వండుతాను" అన్నది ఛాయ లేవబోతూ.

"రెండు పావులు పొయ్యి" అన్నది కామేశ్వరమ్మ.

"నాకాకలి లేదు. బాగా కడుపు నిండిపోయిందివ్వాళ" మధ్య గదిలోంచి అరిచాడు అవధాని.

"పావున్నర పొయ్యి, చాలు" అన్నది శాంత.

❀❀❀

"రవీంద్ర భారతిలో 'చింతామణి' నాటకం జరిగింది. ఫోటోలు తీయడానికి వెళ్ళాను. సినిమా యాక్టర్సు ఇద్దరు వచ్చారు" చెప్పాడు దీక్ష శాంతతో కుర్చీలో కూర్చుంటూ.

"భోజనం అయిందా?" అడిగింది శాంత.

"ఓ, ఎంతాలస్యమయినా, పాపం, ఛాయ విసుక్కోకుండా పెడుతుంది. నాతో ఏదో మాట్లాడాలట మరి రాత్రి పదుకొండున్నరయింది. రేపు మాట్లాడచ్చనుకున్నాను. కాని ఎప్పుడూ లేనిది ఇంకా లైటు వెలుగుతుంటే....' ఆపేశాడు.

"మీ కోసమే ఎదురు చూస్తున్నాను"

తలదాకా దుప్పటి కప్పుకుని పడుకున్న శర్మని ఓసారి చూసి అడిగాడు దీక్ష.

"అన్నయ్యకి ఒంట్లో బాగోలేదా?"

"అందరికీ ఒంట్లో బాగానే ఉంది. బెంగపడనక్కరలేదు మీరు. ఇంట్లోనే బాగాలేదు."

దీక్ష కొన్ని క్షణాలు ఆశ్చర్యంగా చూశాడు వదిన కళ్ళలోకి. శాంత అంత కరుకుగా మాట్లాడటం అరుదు.

"ఛాయకి నాలుగో నెల" చెప్పింది.

తృళ్ళిపడతారనుకుంది. నవ్వుతూ చూశాడు దీక్ష శాంత వంక.

"తెలుసు" చెప్పాడు.

"ఎలా తెలుసు?" అడిగింది శాంత.

"అనుమానం వేసి వారం క్రితం నేనే అడిగాను ఆమెని. అవునంది."

శాంత కాసేపు మాట్లాడలేకపోయింది.

"ఎందుకు వేసింది మీకు ఆ అనుమానం?" అడిగింది.

"నాలుగో నెల వచ్చిన అనేకమంది ఆడవాళ్ళను అంతకు మునుపే చూడటం వల్ల" నవ్వుతూ చెప్పాడు.

"మరి ఎవరికీ ఎందుకు చెప్పలేదు?"

" ఆ సంగతి చెప్పటం నాకిష్టం లేక."

"ఎలా నవ్వగలుగుతున్నారు, ఇదంత నవ్వతగ్గ విషయంకాదే?"

"సీరియస్ టాపిక్స్ నవ్వుతూనే మాట్లాడ్డం నాకలవాటు. నా మొహంలోకి ఆ సమయంలో సీరియస్‌నెస్ రాదు. కోర్టులో విడాకులప్పుడు కూడా నవ్వుతూనే మాట్లాడాల్సొస్తుంది నేను."

"ఆమెకు.. కారణం తెలుసా ఎవరో?"

"తెలియదు. అడిగాను, కాని చెప్పలేదు."

"మీరేనని చెప్పింది"

"నేను కాదు. అబద్దం. మరోసారి అడిగిచూడండి" నవ్వుతూ చెప్పిన దీక్ష మొహంలో ఆశ్చర్యం కనిపించింది శాంతకి.

"మీరే"

దీక్ష కుర్చీ వెనక్కి తోసి నిలబడుతూ అన్నాడు.

"మీరు పొరబడ్డారు.. ఆమె కూడా."

"ఆమె స్పష్టంగా చెప్పింది."

"ఎందుకలా అబద్దం చెప్పిందో అడగండి. కేవలం ఆ క్రాస్ ఎగ్జామినేషన్ కోసం మీరింత సేపు నాకోసం ఎదురు చూస్తూ మేలుకుని ఉంటే, అనవసరంగా మేలుకున్నారంటాను."

"ఆగండి. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పి వెళ్ళండి."

గుమ్మం దాటుతూ అన్నాడు దీక్ష. "మీరెన్ని ప్రశ్నలు వేసినా చివరికి వచ్చే సమాధానం అదే, గుడ్‌నైట్"

శాంత గది తలుపులు నిశ్శబ్దంగా మూశాడు దీక్ష.

"వాడు చాలా గట్టి పిండం, బెదరడు" అన్నాడు శర్మ.

***

శాంత ప్రయత్నం వృధా అయింది. అన్నదమ్ములు ముగ్గురిని విడిగా బెదిరిస్తే నిజం బయటపడవచ్చని అభిప్రాయ పడింది. ఆ క్షణంలో ఛాయని ఆ ముగ్గురిలో ఎవరో ఒకరు మోసం చేశారని తెలిసిన క్షణంలో ఉద్భవించిన ఆవేశ పుటలల్లో ఇంక ఏం ఆలోచించలేదు.

తనా విధంగా ముగ్గురినీ బెదిరించడం, కోప్పడ్డం, నిజం రాబట్టే ప్రయత్నం చేయడం మంచిది అవునా, కాదా అని కానీ, అలా చేయడం వల్ల వాళ్ళలో తన స్థానం తగ్గొచ్చేమో అని కానీ తోచలేదు శాంతకి.

రాత్రి చాలా సేపు నిద్రపట్టలేదు. మర్నాడు ఉదయం బాత్‌రూములో స్నానం చేస్తూ ఆలోచిస్తుంటే, అనవసరంగా తొందరపడ్డానేమోననిపించింది శాంతకి.

ముగ్గురి గురించి ఆలోచించింది విడిగా, ఆ ముగ్గురిలో ఎవరు చేసుండొచ్చు ఇంత తెగింపు. దాదాపు పన్నెండేళ్ళుగా తను గమనిస్తున్న ఆ ముగ్గురు అన్నదమ్ములని అంచనా వేయసాగింది శాంత.

శర్మ, తన భర్తకి ఆ తెగింపు ఉంది. అవకాశం ఉంది. తప్పు చేసినా, దొరికితే కానీ తన తప్పు ఒప్పుకోవటం ఆయన జాతకంలో లేదు.

దీక్ష బయటికి ఏమాత్రం తొణకడు ఏ విషయంలో కూడా. లోపల భరించలేనంత మానసిక వేదన అనుభవిస్తూ, బయటకు నవ్వగలడు. మనసులోని విషయాన్ని పొరపాటున కూడా బయటకి దొర్లనివ్వడు, భాష ద్వారాగాని, భావాల ద్వారాగాని.

అవధాని - వయసు వచ్చినప్పుడు ముఖ్యంగా ఆడదాని విషయంలో, మంచి - చెడు విచక్షణా జ్ఞానం ఉండదు చాలా మంది మగవాళ్ళకి. తను అనుకున్నంత అమాయకుడు కాడు అవధాని.

ఆ ముగ్గురిలో ఎవరయినా కావచ్చు. ఎవరో ఆమె చెబితే కాని తెలియటం అసంభవం. ఆమెని గట్టిగా అడగాలి.

స్నానం చేసి ఇవతలకివచ్చింది శాంత. తన గదిలో బట్టలు మార్చుకుంటూ మళ్ళీ ఆలోచించసాగింది. ఈసారి ఆ ముగ్గురి అన్నదమ్ముల గురించి కాదు.

ఛాయ గురించి.

అసలు బయట వాళ్ళెవరితోనయినా సంబంధం ఉందేమో! అబద్ధం ఆడుతుందేమో?

ఛీ! ఆమె అలాంటిది కాదు. అమాయకురాలు. ఎట్టి పరిస్థితిలోనూ అబద్ధం ఆడదు. చేతకాదు. అసలు అబద్ధం ఆడాలనిపించదు ఆమెకి. ఆమెకి అలాంటి అవకాశం ఎప్పుడూ రాలేదు. ఆమె వచ్చినది మొదలు బయటికి వెళ్ళింది తనతోనే. ఇంట్లో ఎవరికీ తెలియకుండా బయటకి వెళ్ళలేదు.

ఇంట్లోకి వచ్చి అంత స్వతంత్రంగా, అంత ధైర్యంగా ఆమెని ఏమైనా చేసే పనివాళ్ళు, బయటివాళ్ళు ఎవరూ లేరు. ఇంట్లో అలా కుదరదు కూడా. కామేశ్వరమ్మ, సోమయాజులు ఇద్దరిలో ఒకరెప్పుడూ ఇంట్లోనే ఉంటారు. పైగా బాబున్నాడు. వాడికి మాటలు వచ్చు.

ఈ అయిదారు నెలలో చుట్టాలు కాని, బయట ఊళ్ళో నుంచి మొగాళ్ళు కానీ ఎవరూ రాలేదు.

పౌడర్ రాసుకుని హేండ్ బాగ్‌లో పెన్ వేసుకుంది. బస్‌పాస్ ఉందో లేదో చూసుకుంది. వంటగదిలోకి వెళ్ళింది తొమ్మిది పదికి.

ఛాయ అన్నం వండుతోంది గ్యాస్ స్టవ్ మీద.

"గ్యాస్ అయిపోవచ్చింది. వాసన వేస్తోంది" శాంత ఆమెతో చెప్పింది, పీట వేసుకుంటూ.

"ఆఫీసునుంచీ ఫోన్ చేసి చెప్పండి" ఛాయ బదులు చెప్పింది.

"వడ్డిస్తావా?" అడిగింది శాంత.

"ఒక్కక్షణం, చారులో తిరగమోత వేసి"

రెండు మూడు నిమిషాలు ఇద్దరూ మౌనంగా ఉండిపోయారు. ఎవరి ఆలోచనలలో వాళ్ళు, ఆమె అన్నం వడ్డించాక, పచ్చడి కలుపుకుంటూ అన్నది శాంత.

"ఇంట్లో వాళ్ళంటే నాకు నమ్మకం కుదరటం లేదు. వాళ్ళు మంచివాళ్ళని నేననుకోను. ఎందుకో వాళ్ళకీ విషయంతో సంబంధం లేదనిపిస్తోంది. నాకు."

"నేను ఎప్పుడూ అబద్ధం చెప్పలేదు. చెప్పను" అంది ఆమె చాలాసేపాగి.

"జరిగిందేదో జరిగిపోయింది. కారణాలు కర్తలు తవ్వుకోవడం వల్ల ప్రయోజనం లేదు. నిన్ను సత్తెనపల్లి తిరిగి పంపించేయడానికి నిశ్చయించుకున్నాను. అత్తయ్య పిచ్చి దానిలా అయిపోయింది నిన్నటి నుంచీ. రెండు, మూడు రోజులయ్యాక ఆవిడ సర్దుకుంటుంది. తర్వాత చెప్పి పంపిస్తాను నిన్ను. ఈలోగా ఉత్తరం వ్రాయిస్తాను. ఏం?" అడిగింది శాంత.

ఆమె మాట్లాడలేదు. ఆమె సమాధానం చెప్పదనుకుంటూండగా శాంతకి బదులు చెప్పింది ఆమె, కొద్దిగా హీనస్వరంతో.

"సత్తెనపల్లిలో నాకెవరూ లేరు."

"ఎందుకంత భయం, ఎందుకు చెప్పవు?" ముందర ఆమెని ప్రశ్నించి, తర్వాత శాంత సమాధానం ఊహించుకోసాగింది తనలో తానే.

తనే ఆమె స్థితిలో ఉంటే ఏం చేస్తుంది? ఇంట్లోని వాళ్ళద్వారా తన బ్రతుకు అన్యాయం అవుతే, ఎవరి ద్వారా అయిందో చెపుతుందా?

చెబితే? నష్టం కలుగుతుందనే భయం వేస్తే చెప్పదు. ఏమిటా కలిగే నష్టం?

తనని మోసం చేసినవాడు తెలిసిపోతే అందరిముందు ఆ ఇంట్లో అందరికీ తెలిసాక, ఒక్కక్షణం కూడా ఆ ఇంట్లో ఉండలేడు. అందరిముందు గిల్టీ కాన్షస్‌నెస్ ఫీల్ అవుతూ.

బయటకి వెళ్ళిపోతాడు. జీవితాంతం తనవాళ్ళు కనపడితే సిగ్గుతో కృంగిపోతాడు. అందుకే చెప్పటం లేదేమో? అలా అయి ఉండొచ్చా?

శాంతకి ఆ ఆలోచన తట్టాక, ఆమె మీద ఎనలేని ఆప్యాయత, గౌరవం కలిగాయి, ఆమె సరిగ్గా అలాగే భావించి ఆ కారణం చేత నిజం చెప్పకపోతే ఆమె సంస్కారానికి, ఆలోచనాశక్తికి అభినందించాల్సిందే

తనయినా చెప్పదు అలాంటి పరిస్థితుల్లో.

ఇంకో ఆలోచన కూడా వచ్చింది. కొంపతీసి,ముగ్గురూ...

తన ఆలోచనకి తనకే అసహ్యం వేసింది. అలా ఎప్పటికీ జరిగుండదు. ఛాయ అన్నిసార్లు, అంత నీచంగా ఎప్పటికీ మోసపోదు.

"ఛాయా ఆ ముగ్గురితో నీకు సంబంధం ఉంది అందుకే నీవు చెప్పటం లేదు కదూ!"

గొంతు తగ్గించి సూటిగా అడిగింది శాంత.

ఛాయ ఒక్కమాటలో సమాధానమిచ్చింది. ఆ ఒక్క అక్షరం వెనక ఎంతో అర్థం కనిపించింది శాంతకి.

"ఛీ"

"ఇప్పుడర్థమయ్యింది నాకు. నువ్వు ఎందుకు చెప్పటం లేదో, వాళ్ళకి తెలిస్తే అందరిముందూ తలవంపులు తెచ్చిన దానివవుతావనా?" తల ఎత్తి అడిగింది శాంత, ఛాయ వంక చూస్తూ.

"అవును"

"నేను చెప్పను ఎవరికీ. కేవలం నా తృప్తికోసం, నా ఆరాటం తగ్గటం కోసం. నాకు చెప్పవూ?"

"ఊహూ, బలవంతం పెట్టినా నిజం చెప్పను, అబద్దం పేరు చెపుతాను దయచేసి నన్నడగకండి."

"ఎన్నటికీ చెప్పవా?"

ఛాయ కాసేపు తన కుడి అరచేతి వంకా, ఎడమ అరచేతివంకా దీక్షగా చూసుకుంది.

"తర్వాత చెపుతాను" చెప్పింది.

"తర్వాతంటే? రేపా, వచ్చేనెలా, వచ్చే సంవత్సరమా, ఎప్పుడు?"

"కూర వేసుకోండి."

కంచంలో కూర వడ్డించి చెప్పింది ఛాయ.

"కానుపు అయ్యాక."

సోమయాజులు, కామేశ్వరమ్మ కొడుకులు ముగ్గురినీ పిలిచి అడిగారు. శాంతకే లభించని సమాధానం తమకి లభిస్తుందనే ఆశ లేకపోయినా.

ముగ్గురూ నాకు తెలియదంటే నాకు తెలియదన్నారు. ముగ్గురూ తలిదండ్రుల నెత్తిమీద చేతులుంచి ప్రమాణాలు చేసారు.

"గుండె కోసి గుండెకాయని నా చేతుల్లో పెట్టే కొడుకు ఒకడున్నాడు మీలో. మామీదే ప్రమాణం చేస్తున్నారు. తండ్రిగా నేను ఇలా మిమ్మల్ని నిలదీసి అడిగే పరిస్థితి తెచ్చిన ఆ అప్రాచ్యుడెవరో కాని వాడు మాకు పుట్టాల్సిన కొడుకు కాదు. గాడిదలకు పుట్టాల్సిన కొడుకు."

గుండె తరుక్కుపోతుంటే అన్నాడు సోమయాజులు. ముగ్గురు కిక్కురుమనలేదు. ఒకరి మొహాలు మరొకరు చూసుకుని బయటికి వెళ్ళిపోయారు.

"కామేశ్వరీ మనం ఎలాంటి సంతానం కన్నామో చూసావుగా" అన్నాడు సోమయాజులు నిస్పృహగా.

"ఛాయ సంగతి ఏం చేద్దాం? అడిగింది కామేశ్వరమ్మ అకస్మాత్తుగా.

"ఏం చేసేదేముంది?"

"సత్తెనపల్లి పంపిచేద్దామా? కానుపు ఖర్చులు సహజానందంగారికి పంపిద్దాం"

"ఏమే. నీకు ఛాయని నిజంగా పంపించేయాలని ఉందా?" సోమయాజులు అడిగాడు.

"ఎందుకుండకూడదూ?'

"ఛాయకీ, ఆ దౌర్భాగ్యుడికి పెళ్ళి కాకపోయినా, ఇప్పుడు ఛాయ దాదాపు శాంతలాంటిది. నూటికి తొంభైపాళ్ళు మన కోడలు."

"నిజమే కానుపు అయ్యాక, పిల్లనో, పిల్లాడినో చూసుకుని తర్వాత పంపించేద్దామా?"

"ముందర కానుపు - కానీ."

కామేశ్వరమ్మ కళ్ళొత్తుకుని అన్నది,

"ఎక్కడా ఇలాంటిది వినలేదు, కనలేదు. కలియుగంలో ముసలం పుట్టటం అంటే ఇదేనేమో?"

"చుట్టుపక్కల వాళ్ళకెవరికయినా తెలిసిందా ఈ సంగతి?" సోమయాజులు కాసేపాగి అడిగాడు.

"ఛాయని చూస్తే తెలియదూ, మనకొచ్చిన అనుమానం వాళ్ళకు మాత్రం రాదూ."

"వస్తుంది అలా అయితే ఛాయని ఏం చేద్దాం?"

"అందుకే అన్నాను సత్తెనపల్లి పంపిచేయమని."

"వద్దు తప్పు"

"సహజానందం గారి నుంచీ ఈ సంగతి ఎంతకాలం దాయగలం."

"ఏమో! శాశ్వతంగా అనుకుంటాను. ఎవరయినా చెపితేనేగా తెలిసేది."

కామేశ్వరమ్మ మాట్లడలేదు,

"మీ చెల్లెలి ఇంటికి పంపిస్తే ఈ అయిదు నెలలూ"

"కడపా. "

"ఆ చెల్లెలు కాదు, అది అసాధ్యురాలు. నెల్లూరు"

"మా బావగారు ఏమీ అనుకోరనుకోండి. అయినా వాళ్ళకి తెలిసిపోతుంది."

"ఎవరికో ఒకరికి తెలియాలి మరి. ఈ అయిదు నెలలూ వీళ్ళమధ్య ఛాయని ఉంచటం తేలికయినపని కాదు."

"అయితే ఉత్తరం వ్రాయండి"

"ఉత్తరం కూడా దేనికి నేనే స్వయంగా తీసుకు వెళతాను అన్నీ మాట్లాడాల్సిన విధంగా మాట్లాడి, దింపి వస్తాను."

"శాంతమ్మ చెవిన కూడా వేయండి ఈ మాట. ఆ తర్వాత తీసుకెళ్ళచ్చు. ఈ ఇంట్లో తెలివంటూ ఎవరికయినా ఉంటే, అది శాంతమ్మకే."

"శాంత నడగకుండా ఏ పనయినా చేస్తానా ఛాయతో చెప్పు నువ్వు నెల్లూరు తీసుకెళతానని."

"అయిదారు వందలయినా ఖర్చవుతుంది. సాయంత్రం బ్యాంక్‌లోంచి డబ్బు తీసి, వెళ్ళేటప్పుడు కూడా పట్టుకెళ్ళి మర్చిపోకుండా ఇచ్చిరండి"

ఇద్దరూ చాలా సేపు అలా మాట్లాడుకుంటూ కూర్చున్నారు. ఛాయ వాళ్ళ మాటలు వింటూ, తన దీనస్థితికి ఏడుస్తోంది. సోమయాజులు వీధిలోకి వెళుతూ చెప్పులు తొడుక్కోబోతూ ఏడుస్తున్న ఛాయని చూశాడు.

వెనక్కి తిరిగి, కామేశ్వరమ్మ దగ్గరికి వచ్చి చెప్పాడు.

"అదొక్కతే ఏడుస్తోంది. కాస్త దగ్గర కూర్చోపెట్టుకుని ఈమాట, ఆ మాట మాటాడు. అంతగా ఏడవటం మంచిది కాదు."

చెప్పులు తొడుక్కుని బయటికి వెళుతూ గుమ్మంలో నిలబడే అన్నాడు సోమయాజులు.

"ఏడవకమ్మా, జరిగిందేదో జరిగిపోయింది. మేమంతా లేమా."

సోమయాజులు, ఛాయ గర్భవతని తెలిశాక ఛాయతో మాట్లాడిన మొట్టమొదటి సందర్భం అదే

## 12

సాయంత్రం శాంత ఆఫీస్ నుంచీ రాగానే కాసేపు విశ్రాంతి తీసుకోనిచ్చి శాంత గదిలోకి వెళ్ళాడు సోమయాజులు.

"కూర్చోండి" అన్నది శాంత గబుక్కున లేచి, సోమయాజులు చాలా అరుదుగా. ఏదయినా పనిఉంటేనే శాంత గదిలోకి వస్తాడు.

శర్మ చెడుతిరుగుళ్ళ గురించి శాంత గట్టిగా అరిచి శర్మని తిట్టినా రాడు లోపలికి. ఒకసారి మాత్రం కోపం విపరీతంగా వస్తే లోపలికి వచ్చి, శాంత ముందే శర్మని ఛడామడా తిట్టి వెళతాడు.

"మా ఆఫీసులోనే పనిచేసే ఓ కొలీగ్ కొన్ని చీరలు తెచ్చింది. అత్తయ్యగారికి ఓ పట్టు చీర తీసుకుందామనుకున్నాను, నెలకి ముప్ఫై చొప్పున తీర్చవచ్చు. చూసి చెప్పండి. మీకు బావుందీ"

శాంత అట్ట పెట్టెలోంచి పట్టు చీర తీసి సోమయాజులకి అందించి చెప్పింది.

"ముదురాకుపచ్చ, అత్తయ్యగారి కిష్టమని తీసుకున్నాను."

"ఎంత?" అడిగాడు సోమయాజులు.

"మూడు వందల పాతిక, పదకొండు నెలలలో తీరిపోతుంది."

"మీ అత్తయ్య నడిగి చూడు"

శాంత మళ్ళీ చీర పెట్టెలో పెట్టేసి అన్నది.

"మీ కేమయినా తీసుకుందామనుకున్నాను కానీ, మీరు ఖద్దరు తప్ప ఇంకేం కట్టరుగా"

"నాకెందుకమ్మా" అని చిన్నగా నవ్వి అన్నాడు సోమయాజులు. "మరి నీకేం తీసుకోలేదా?"

"ఇది తీరాక, నేను మొన్న సంక్రాంతికేగా తీసుకున్నాను."

కొంచెంసేపాగి అన్నాడు సోమయాజులు.

"మరి మన ఛాయకి కూడా ఏమయినా తీసుకుంటే బావుంటుందేమో?"

"అలాగే" కొంచెం అయిష్టంగా అన్నది శాంత.

శాంత స్వరంలోని భేదం గ్రహించి అన్నాడు సోమయాజులు కుర్చీలో కూర్చుంటూ.

"నువ్వూ కూర్చోమ్మా"

"ఫర్వాలేదండి" అన్నది శాంత గోడకి ఆనుకుని నిలబడే

ఆంక్ష అని కాదు కానీ, శాంతకి మామగారిముందు ఒంటరిగా కూర్చోవడం మొదటినుంచీ అలవాటు లేదు.

"ఛాయని నెల్లూరు తీసుకెళదామనుకుంటున్నాను."

"దేనికి"? అడిగింది శాంత.

"ఇక్కడ నలుగురి మధ్యా ఉండటం బావుండదు, నెల్లూరులో అయితే మీ పిన్నత్తగారింట్లో ఈ అయిదు నెలలూ ఉంచితే, ఆ తర్వాత సంగతి తర్వాత చూసుకోవచ్చని. "

శాంత రెండు మూడు నిముషాలు ఆలోచించి అన్నది.

"మీ ఆలోచన బాగానే ఉంది, ఎప్పుడు తీసుకు వెళదామనుకుంటున్నారు?"

శాంత ఎదురుగా గోడకి వేలాడుతున్న తెలుగు కేలండర్ వంక చూసి, దానివైపు నడిచింది, దాన్ని అందుకుని మామగారికి అందించింది.

సోమయాజులు కేలండర్ చూసి చెప్పాడు.

"రేపు, ఎల్లుండి మంచి రోజులు కావు, అవుటాలెల్లుండి తీసుకు వెళతాను, నువ్వుకూడా రారాదు"

"నేనా! ఎందుకు?"

"రెండు రోజులుండి, ఛాయ కొత్త తీరాక రావచ్చు, నేను ఎటూ ఈ తిరుగు బండిలో వచ్చేయాలి"

"అవసరం లేదేమో?" అన్నది శాంత ఆలోచనగా.

"పోయిందేముందు, నీకు ఇష్టం లేకపోతే మాత్రం వద్దు."

"ఇష్టం లేదని కాదు, ఆఫీసులో శలవు దొరికితే అలాగే వస్తాను తప్పక.

"రేపు సాయంత్రం ఏ సంగతి చెపితే బస్సుకి టిక్కెట్ రిజర్వ్ చేయిస్తాను."

"బస్సుకన్నా రైలు మెరుగేమో?"

"రిజర్వేషన్ బస్‌కయితేనే దొరుకుతుంది. రైలు ఇప్పుడు దొరకడం కష్టం."

"అయితే రేపు సాయంత్రం చెపుతాను"

"బ్యాంక్‌లోంచి ఆరువందలు తీశాను. నెల్లూరు ఖర్చులకోసం. ఛాయని కనుక్కుని బట్టలు, ఇంకా ఏం కావాలో అవి కూడా కొనిద్దాం?

"అలాగే కనుక్కుంటాను."

"ఏమిటో జీవితాలు ఎంత విచిత్రమో చూశావా?"

శాంత మాట్లాడలేదు.

"అంతేగా?" అన్నాడు సోమయాజులు ఇక లేచే ఉద్దేశంతో.

"ఆ తర్వాత ఛాయని ఏం చేయాలో ఆలోచించారా?" అడిగింది శాంత.

"ఛాయేకాదు, పుట్టబోయే బిడ్డకూడా ఇంకా ఏం అనుకోలేదు, 'ఫస్ట్ థింగ్స్ ఫస్ట్' అనుకుని ఊరుకున్నాను."

శాంత మళ్ళీ మౌనంగా ఉండిపోయింది.

"ఛాయని చూసినప్పుడు ఆ రోజు సికింద్రాబాద్‌రైల్వేస్టేషన్‌లోనే అనుకున్నాను. ఆమెలాంటి అమ్మాయి ఈ ఇంటికి కోడలుగా వస్తే బావుండునని - అవధానికి అదృష్టం లేదు. అనకూడదు గానీ, నా కోరిక ఈ విధంగా తీరింది."

లేచి నిలబడ్డాడు సోమయాజులు.

"ఏదో కుడుతున్నట్లున్నావ్?" అడిగాడు నేలమీద ఉన్న రంగు రంగుల దారపు ఉండలని, చీరను చూస్తూ.

"ఈ చీర మరీ బోసిగా ఉంది. అందుకని, చిన్న డిజైన్ కుడుతున్నాను చీరమీద."

"మంచిదమ్మా వస్తాను" అని జేబులోంచి డబ్బు తీసి పది రూపాయల నోట్ల దొంతరని టేబుల్ మీద పెట్టి అన్నాడు.

"నీ దగ్గరే ఉంచు ఈ ఆరువందలు. శర్మని పంపించి బస్సు టిక్కెట్లు రిజర్వ్ చేయించు."

సోమయాజులు బయటికి నడిచాడు. శాంత మళ్ళీ నేలమీద చతికిలపడి, చీరమీద కార్బన్ పేపరుతో గీసివున్న గీతల మీద రంగుదారాలు కుడుతూ ఆలోచించసాగింది, సోమయాజులు చెప్పిన విషయాలు.

కుడిచేతి వేల్లో సూది గుచ్చుకోగానే, రక్తం కారుతున్న వ్రేలిని నోట్లో ఉంచుకుంటూ అనుకుంది.

"ఆలోచనలతో నా తల బద్దలయిపోతోంది. ఇంక చస్తే ఆలోచించనెవరి గురించీ."

## 13

మర్నాడు ఉదయం సోమయాజులు ముగ్గురు కొడుకులనీ పిలిచి చెప్పాడు.

"ఛాయని నెల్లూరు తీసుకెళుతున్నాను. కానుపు అయాక బాబుని అనాధ శరణాలయానికి, ఆమెని మీకెవరికీ తెలియని దూర ప్రదేశానికి పంపిస్తాను?"

ఆగి ముగ్గురు మొహాల్లోకి చూశాడు. ఎవరి మొహంలో ఎలాంటి మార్పు లేదు. ఏదో కథ వింటున్న వాళ్ళలాగా నిలబడి వినసాగారు.

"ఎల్లుండి వెళుతున్నాం. తర్వాత మీరు ఆమెను కాని, కొడుకును కాని చూడలేరు."

"అంతేనా?" అడిగాడు అవధాని ఇక వెళ్ళొచ్చా అని అర్థం వచ్చేలా.

"ఆమె ఇక మీకు కనబడదు. అంతే వెళ్ళొచ్చు."

వాళ్ళకన్నా ముందే సోమయాజులు బయటకి వెళ్ళిపోయాడు. సాయంత్రం శాంత చెప్పింది. తనకి శెలవు దొరికిందనీ, బస్ టిక్కెట్స్ రిజర్వు చేస్తాననీ.

"నువ్వెందుకమ్మా శర్మని పంపచ్చుగా" అడిగాడు సోమయాజులు.

"నాకు వారిని పంపటం ఇష్టంలేదు. నిజానికి ఆ ముగ్గురిలో ఎవరిని పంపడానికీ ఇష్టం లేదు."

"నిజమే, నాకు తట్టలేదా సంగతి" అన్నాడు సోమయాజులు నవ్వి.

"రేపు సాయంత్రం ఆమెను బయటకి తీసుకెళతాను బజారుకి, కావలసినవి కొనివ్వడానికి" చెప్పింది శాంత.

"మంచిది.......... ఛాయ ఎందుకా విషయం అంత రహస్యంగా ఉంచుతుందో నీకు చెప్పిందా? తెలిస్తే మనం ఆ దరిద్రపు వెధవని చావచితక తంతామని భయమా అమ్మాయికి?"

"కాదు ఎవరో తెలిస్తే చావచితక తన్నటంతోటే పోదు, అయినా ఈ వయసులో ఒకటి కొడితే రెండు తిరిగి అంటిస్తారు..."

అవధాని గదిలోకి వచ్చి అన్నాడు గట్టిగా.

"వదినా - చూస్తున్నాను! మా ముగ్గురిని మీరు పురుగుల్లాగా చూస్తున్నారు. మీరు మా తల్లిదండ్రులని కొట్టేంత వాళ్ళమనుకోవటం..."

"మా? మా తల్లిదండ్రులు? అదే మా ఇంట్లో అయితే నిజం కక్కించేవాళ్ళు మా తల్లిదండ్రులు. తెలుసా? అయినా గోడ చాటునుంచీ వినటం ఎప్పటి నుంచీ నేర్చుకున్నావయ్యా!" నవ్వుతూనే అన్నది. ఎదురుగా మామగారున్నారని, గట్టిగా ఏం అనలేక.

"నువ్వు బయటికి తగలడు ముందర" అరిచాడు సోమయాజులు.

గిరుక్కున తిరిగి వెళ్ళిపోయాడు అవధాని.

"ఇందాకేదో మాట్లాడుతున్నాం. సరిగ్గా సమయానికి పానకంలో పుడకలా వచ్చాడు రోషంగా" అన్నాడు సోమయాజులు.

"ఛాయ నిజం చెబితే మంచిది కాదని చెప్పలేదు. ఈ విషయంలో నేనూ ఛాయతో ఏకీభవిస్తాను, ఛాయ కోణంలోంచి చూస్తే."

చిన్నగా నిట్టూర్చి అన్నాడు సోమయాజులు.

"ఎలా రాసిపెట్టి ఉంటే అలా జరుగుతుంది."

***

శాంత ఆఫీస్‌కి వెళ్ళలేదు. శెలవు పెట్టింది వారం రోజులు. ఛాయ బదులు ఇంటి పని తనే చేస్తోంది. ఛాయ కొద్దిగా సహాయ పడుతోంది. అంతే, 'నేను చేస్తాను' అని ఛాయ గట్టిగా చెప్పలేదు. చెప్పినాకానీ శాంత వద్దనేది.

ఆ ఆఖరి రెండురోజులూ, ఛాయ ఆ ఇంట్లోంచి హైదరాబాద్ నుంచీ వెళ్ళిపోయే రెండురోజులు ఆ ఇంట్లోవాళ్ళకి రెండూ యుగాలుగా అనిపించాయి.

ఒకరితో ఒకరు మాట్లాడుకోలేదు. మామూలుగా ఏదో ఒక సంగతి మాట్లాడుకునే అలవాటు ఆ రెండు రోజులూ మరచిపోయినట్లు ప్రవర్తించారు. ఒకర్నొకరు తప్పించుకు తిరగడానికి ప్రయత్నించారు. అంతకు మునుపెన్నడూ, సోమయాజులు ఇంట్లో అంత స్థబ్దత, అంత నిశ్శబ్దం, అంత నిస్తేజం రాలేదు. అదే మొదటిసారి.

సాధారణంగా ఉదయం నిద్ర లేచింది మొదలు పడుకునేదాకా, ఆ ఇంట్లో ఉండే ప్రతివాళ్ళకీ ఆమె కావలసి వచ్చేది. ఆమె లేకుండా ఏ పనీ జరిగేది కాదు. ఆమెని ఫలానిది కావాలని, ఫలాన పని చేయమని అడగనివాళ్ళు లేరు. అంతా ఆమె మీదే ఆధారపడేవాళ్ళు.

ఆమె విసుక్కోకుండా చిరునవ్వుతో అందరికి కావల్సినవి అమరుస్తుండేది. మధ్యలో వంటగదిలోకి వెళ్ళి స్టవ్ మీద పడేసిన గిన్నెలలో ఉడికేవాటిని చూస్తుండేది.

"ఛాయ, కొద్దిగా ఈ చొక్కాకి గుండీలు కుట్టివ్" అడిగేవాడు శర్మ. ఎవరూ చుట్టుపక్కల లేకపోతే రహస్యంగా అనేవాడు. "నువ్వుమనుకోకపోతే, కాస్తంత నీ పెదిమల ఎర్రరంగు ఈ గుండీకి పూసి మరీ కుట్టు ఎర్ర చొక్కాకి ఎర్ర గుండీయే కుట్టాలి."

ఆమె మొహంలో ఏ భావమూ ప్రదర్శించకుండా గుండీ, చొక్కా అందుకని కుట్టి ఇచ్చేసేది తిరిగి.

"ఛాయ, స్టూడియో తాళం చెవులగుత్తి ఎక్కడుంది?" అడిగేవాడు దీక్ష. ఎవరూ లేకుండా చూచి, ఆమె చూస్తుండగా ఆమె అందించిన ఆ తాళం చెవుల గుత్తిని ఓ సారి గుండెలకు హత్తుకుని, ముద్దుపెట్టుకునేవాడు దీక్ష.

"ఛాయ, నువ్వు మళ్ళీ లంగా, ఓణీ వేసుకోరాదూ? సినిమా నటిలా ఉంటావ్. నేను సినిమా నటినే పెళ్ళిచేసుకుంటాను, నీలాంటిదాన్ని" రోజుకోసారయినా చెప్పేవాడు అవధాని నవ్వుతూ.

"ఆ పూలు, దారం ఇటివ్వవే తల్లి. దండ కడతాను" కామేశ్వరమ్మ అడిగేది.

"ఛాయా, కాస్తంత కాఫీ ఇవ్వమ్మా" సోమయాజులు కాఫీ ఆమెని తప్ప మరెవరని అడగడు. ఆమె ఎంత పనిలో ఉన్నా. రోజుకి ఏడెనిమిదిసార్లు కాఫీ త్రాగితేగానీ ఆయన ప్రాణం నిలవదు. తృప్తి ఉండదు.

"ఛాయా, ఇవాళ నీ చీర కట్టుకెళతాను కాని, కొంచెం ఇది ఉతికి ఉంచి. సాయంత్రం ఆరితే రేపటికి తడుముకోనక్కరలేదు" శాంత అడిగేది.

ఆమె ఆ ఇంట్లో అందరికీ ఓ నీడలా ఉండేది. నేర్పుగా అందించేది ఎవరూ నొచ్చుకోకుండా, ఎవరికి కావాల్సినవి వాళ్ళకి.

అంతా తమ పనులు తాము చేసుకోవటం మర్చిపోయి ఆరునెలలు దాటిపోయింది. ఇప్పుడు ఎవరి పనులు వాళ్ళే చేసుకుంటున్నారు. ఆమెని అట్టే పరిచయం లేని చుట్టంలా, రెండు రోజులు ఉండి వెళ్ళిపోయే చుట్టంలా చూస్తున్నారు ముగ్గురు అన్నదమ్ములు.

శాంతకి పనితో ఊపిరి సలపటం లేదు. అలవాటు తప్పిపోవటం వల్ల పనిచేయాలంటే కొద్దిగా చిరాకుగా కుడా ఉంది శాంతకి.

ఛాయ వంక కన్నెత్తి చూడటం లేదు ఎవరూ. ఆమెతో తాము వంటరిగా ఉండకుండా జాగ్రత్త పడుతున్నారు ఇంట్లో ఉన్న కాసేపు.

కామేశ్వరమ్మ మాత్రం ఛాయని దగ్గర కూర్చోపెట్టుకుని పెళ్ళయిన కొత్తలో తను పడ్డ కష్టాలు అప్పటి సంసార విషయాలు చెప్పసాగింది! ఎందుకో ఎవరికీ అర్థకాలేదు. ఏదో ఒకటి మాటాడాలని ఆవి చెపుతోంది అనుకుంది శాంత.

ఆ రెండూ రోజులూ చివరికి గడిచాయి. ఆమెని తీసుకుని శాంత సోమయాజులు వెళ్ళే సమయం దగ్గిరపడింది. భోజనాలయాక రాత్రి తొమ్మిదికి టేక్సీ తీసుకు వచ్చింది శాంత.

ఛాయ టేక్సీలో ఎక్కుతుంటే, బాబు నెత్తుకుని కామేశ్వరమ్మ, ముగ్గురు కొడుకులు చూస్తుండిపోయారు గుమ్మంలో నిలబడి, చుట్టూపక్కల ఇళ్ళవాళ్ళు కూడా. చాలామంది పొరుగు వాళ్ళకి ప్రక్క ఇళ్ళలో ఏం జరుగుతుందో ఊహించటంలో ఆనందం అధికంగా ఉంటుంది. ఏదయినా చెడు గురించయితే మరీను,

'వెళ్ళొస్తాను' అంటుందనుకున్నారు అంతా. ఆమె నిశ్శబ్దంగాటేక్సీలో ఎక్కి కూర్చుంది. నీలంరంగు నూలు చీర, శాంత కొనిపెట్టిన మొదటి చీర అది. ఎర్ర జాకెట్, హైదరాబాద్‌లో కొనిచ్చిన చెప్పులు, కొద్దిగా ఎత్తుగా ఉన్న పొత్తికడుపు.

టేక్సీ వెళ్ళిపోయింది ఛాయతో. కానీ, ఆమె వెళ్ళలేదు - వాళ్ళ జ్ఞాపకాలల్లోంచి.

## 14

సోమయాజులు క్లుప్తంగా ఛాయని తీసుకురావడానికి గల కారణాన్ని తన తోడల్లుడికి వివరించి, అర్ధరోజు ఉండి హైదరాబాద్ తిరిగి వచ్చేశాడు.

ఆమె వెళ్ళిపోయిన తర్వాత దొర్లిన మొదటి వారం రోజులు ఆ వేసంకాలంలాగే భరించలేనివిగా అనిపించాయి చిక్కడిపల్లిలోని ఆ ఇంట్లో వాళ్ళకి. ఆమె కోసం బాబు తప్ప బయటికి ఎవరూ ఏడవలేదు కానీ, మనస్సులోనే దుఃఖించారు అంతా. తమ దుఃఖాన్ని మాత్రం ఇతరుల నుంచీ కప్పిపుచ్చారు, మిగతా వాళ్ళు కూడా దాదాపుగా అదే పరిస్థితిలో ఉన్నారని తెలిసినా కూడా.

ఛాయకూడా దుఃఖించింది. బాబులాగే బయటికి ఏడ్చింది, టేక్సీదిగి బస్సులో ఎక్కాక సిటీ దాటాక డ్రయివర్ బస్సులోని దీపాలు ఆర్పేశాక ఆమె నిశ్శబ్దంగా రోదించడం మొదలుపెట్టింది.

శాంత గ్రహించి కూడా ఓదార్చే ప్రయత్నం చేయలేదు. నిద్రపోవడానికి ప్రయత్నించింది ఆ సూపర్ డీలక్స్ బస్సులోని సీటు అందించే సౌఖ్యంలో.

మర్నాడు రాత్రి బయలుదేరి వెళ్ళిపోయాడు సోమయాజులు. నెల్లూరులో, ఆ చిన్న డాబా ఇంట్లో సోమయాజులు తోడల్లుడు, మరదలు, వాళ్ళ కొడుకు ముగ్గురే ఉండేది. కొడుకు పదోక్లాసు చదువుతున్నాడు.

కామేశ్వరమ్మ చెల్లెలు స్వతహాగా కలుపుగోరు మనిషి కావటం వల్ల, ఇంటిపని అట్టే లేకపోవటం వల్ల, ఛాయతో మాట్లాడుతూ, కొత్తవాళ్ళ ఇంటిలో ఉన్నామన్న భావన ఛాయకు కలగకుండా ఉండేందుకు శాయశక్తులా ప్రయత్నించింది శాంత నాలుగురోజులు.

ఛాయ మొహంలో నవ్వు, సహజంగా వచ్చే పరిపూర్ణమయిన నవ్వు, శాంత ఆఖరిరోజుగానీ చూడలేదు. రాబోయే ముందు ఆఖరి ప్రయత్నం చేసింది శాంత - ఛాయని వాళ్ళ డాబా మీదకి తీసుకెళ్ళి.

"రేపు ఉదయం నేను హైదరాబాద్ వెళ్ళిపోతున్నాను చెప్పింది ఛాయతో శాంత.

ఛాయ మాట్లాడలేదు.

"ఆఖరుసారి మళ్ళీ అడుగుతున్నాను చెప్పవా?"

ఛాయ తెచ్చిపెట్టుకున్న నవ్వు సమాధానంగా ఇచ్చి ఊరుకుంది.

"కానుపు అయిన తర్వాత చెపుతానన్నావ్ అప్పుడు ఇలానే నవ్వి ఊరుకుంటావా? " తీవ్రంగా అడిగింది శాంత.

"ఉంటే తప్పకుండా చెపుతాను. ఇంటిలో అందరినీ అడిగానని చెప్పండి"

"ముఖ్యంగా ఎవరిని? " ఆత్రంగా అడిగింది శాంత.

"బాబుని" చిన్నగా నవ్వింది ఛాయ.

"నువ్వు నేననుకున్నంత తెలివి తక్కువదానివికావు"

"అవునా!" మళ్ళీ నవ్వింది ఛాయ.

"ఇక మళ్ళీ హైదరాబాదులోని ఆ ఇంటిలో అడుగు పెట్టలేవు."

ఛాయ కళ్ళ ముందు క్షణకాలం ఆ పెద్ద పందిరి పట్టె మంచం మెదిలింది, ఛాయ కళ్ళలో క్షణకాలం కనబడ్డ విచారరేఖను పసిగట్టింది శాంత.

ఇద్దరూ మౌనంగా ఉండిపోయారు. శాంత పిట్టగోడ మీద నుంచీ వచ్చిన మామిడి కొమ్మకున్న ఆకులని త్రుంచసాగింది. ఛాయ శాంత చేతిని పట్టుకుని అన్నది.

"వద్దు, రాత్రిళ్ళు చెట్లని ముట్టుకోకూడదు"

"ఎవరు చెప్పారట?" నవ్వింది శాంత.

"మా అమ్మ."

"మీ అమ్మ గురించి ఎప్పుడూ చెప్పలేదు నువ్వు?"

"చాలా మంచిది"

"మంచిది కానీ అమ్మేలేదు ప్రపంచంలో అది వివరంకాదు. ఎలా చచ్చిపోయింది?"

"అమ్మని ఆంబోతు పొడిచింది. రెండు కొమ్ములతో పొడిచింది. పరుగెత్తుకు వచ్చి గాలిలో ఇంతెత్తు లేచి ఎగిరిపడింది అమ్మ."

ఛాయ ఆకాశం వంక చూస్తూ ఆ మాటలు అతి నెమ్మదిగా చెప్పింది. ఆ సంఘటనని గుర్తు తెచ్చుకుంటున్నట్లుగా ఎప్పుడూ మాట్లాడనంత నెమ్మదిగా చెప్పింది.

"మూడు రోజుల తర్వాత విజయవాడలో గవర్నమెంటు ఆస్పత్రిలో చచ్చిపోయింది" పూర్తి చేసింది ఛాయ.

శాంత "ఇంక వెళదామా" అందామనుకుంటుండగా ఛాయ చెప్పింది చేత్తో చూపిస్తూ.

"చూడండి ఆ కొబ్బరాకుల మీద వెన్నెల పడితే, ఆ ఆకులు వెండితీగల్లా ఎలా మెరుస్తాయో, హైదరాబాదు వచ్చాక ఇలాంటి దృశ్యం చూద్దామన్నా కనబడలేదు సత్తెనపల్లిలో ఇలాంటి దృశ్యాలు చెప్పలేనన్ని. చిత్రం అప్పుడు 'అద్భుతం' అనిపించేవి కావు."

"ఇంక వెళదామా?" అన్నది శాంత.

ఆకాశంవంక చూసి అన్నది ఛాయ.

"రేపే అనుకుంటా పౌర్ణమి.. నాకు వెన్నెల్లో పడుకోవాలంటే సరదా" అని ఆగి అన్నది కలలో మాట్లాడుతున్నట్లుగా. "వెన్నెల్లో పడుకుంటే, వెన్నెల్లా తెల్లగా చల్లగా ఉండే పాప పుడుతుందట.

శాంతి కదిలింది.

"ఆవిడతో చెప్పండి, నన్ను డాబా మీద పడుకోనివ్వమనండి. వెన్నెల్లో పడుకుంటాను ప్రతిరోజు. అసలు మీరు ఇక్కడికి తీసుకు వచ్చి ఎబార్షన్ చేయిస్తారేమోనని ఎంతో బయపడ్డాను అలా చేయించేటట్లయితే పారిపోదామనుకున్నాను."

"ఎక్కడికి?"

"ఏదో? విజయవాడలోని గవర్నమెంట్ ఆస్పత్రికనుకుంటాను" ఆలోచనని మాటల్లో పెడుతున్నట్లుగా అన్నది ఛాయ.

"అసలా భయం ఎందుకు వచ్చింది నీకు?" అడిగింది శాంత విచిత్రంగా చూస్తూ.

"భయం ఏమో? భయం దేనికి కలుగుతుంది. దెయ్యాలుండవని తెలిసినా, పగలంతా వేపచెట్టుకింద ఆడుకున్నా. రాత్రి చీకట్లో అదే వేపచెట్టు కిందకి వెళ్ళడానికి చిన్నప్పుడు ఎందుకు భయపడేదాన్ని? ఏమో? నాకు తెలియదు. భయం అంటే బహుశా ముందు చూపు అనుకుంటాను. అవును భయం, భయం కాదది ముందుచూపు."

"ఆ ముందుచూపు, ఆ భయం అన్ని విషయాల్లో, అన్ని వేళలా ఉండాలి - ముఖ్యంగా ఆడపిల్ల అన్న తర్వాత ."

ఛాయ శాంత కళ్ళలోకి చూసి నవ్వింది. నవ్వి అన్నది.

"నేనెప్పుడూ భయపడలేదు."

శాంత మెరుపులా కుడిచేత్తో ఛాయ చెంప ఛెళ్ళుమనిపించింది. మెత్తటి ఛాయ బుగ్గలు దవడకున్న ఎముకలకి తన అరచేయి తగిలి బలంగా ఒత్తుకోవటం తెలిసింది శాంతకి.

బుగ్గ ఎర్రగా కందిపోయింది ఛాయకి. ఛాయకి తెలియకుండానే రోషం, కళ్ళలో నీళ్ళు వచ్చాయి. శాంత అరచేతి వేళ్ళు అచ్చుపడ్డాయి కుడి బుగ్గమీద.

చేతిని కుడిబుగ్గమీద వత్తుకుంటూ అడిగింది ఛాయ కళ్ళలో నీళ్ళు తిరుగుతుంటే.

"దేనికి?"

"నిన్న మొదటిరోజు చిక్కడపల్లిలో మా ఇంట్లో బాత్‌రూంలో చూసినప్పుడే ఈ పని చేయాలనిపించింది. చేయలేదు. ఆ తర్వాత చాలాసార్లు అనిపించింది. కానీ బలవంతంగా అణుచుకున్నాను. నీకు కడుపని తెలిసినప్పుడు కూడా ఈ పని చేయలేకపోయాను.

"మరి ఇప్పుడు దేనికి?"

"ఈ కోరిక నిన్ను నేను చూసినంత పాతది. ఇప్పుడు తప్ప మళ్ళీ నాకు జీవితంలో ఇలాంటి అవకాశం రాదు. బహుశా ఇదే మనిద్దరం ఆఖరిసారి కలుసుకోవటం."

ఛాయ వెంటనే నవ్వింది.

ఛాయ మొహంలోని ఆ నవ్వు తెచ్చిపెట్టుకున్నది కాదు. సహజంగా వచ్చే పరిపూర్ణమైన చిరునవ్వు. ఛాయ అందంగా నవ్వింది.

ఛాయ చాలా అందంగా నవ్వింది.

నెల్లూరు వెళ్ళిన అయిదారు రోజుల తర్వాత శాంత హైదరాబాదు తిరిగివచ్చి. ఇంట్లోని పరిస్థితి గమనించి కొద్దిగా ఆశ్చర్యపడింది. తుపాను రాబోయే ముందు వాతావరణంలో ఉండే ప్రశాంతతలాంటి వాతావరణం ఇంట్లో అలుముకుంది. దగ్గరవాళ్ళు చచ్చిపోతే, ఏడ్చి ఏడ్చి, ఇక ఏడ్చే శక్తిలేక మౌనంగా ఉండిపోయే మనుషుల్లా ఉన్నారు అన్నదమ్ములు ముగ్గురూ. మాటలు మరచిపోయిన మనుషుల్లా మునుల్లా, మూగవాళ్ళలా మౌనంగా ఉన్నారు.

సోమయాజులు బాబుని దగ్గరలోనే ఉన్న చిల్డ్రన్స్ కేర్ టేకర్స్‌లో చేర్పించాడు. ఉదయం పదినుంచి సాయంత్రం అయిదు, అయిదున్నరదాకా బాబుని వాళ్ళే ఆడిస్తారు. ట్రెయిన్డ్ నర్సులు చూసుకుంటారు. పళ్ళరసం, పాలు ఇస్తారు. సోమయాజులు వంటమనిషి కోసం వెదుకుతున్నాడు ఓ ముసలాయన రోజుకి అయిదు రూపాయలు తీసుకుని, ఓ పది పదిహేను రోజులు రెండుపూటలా వండిపెట్టడానికి ఒప్పుకున్నాడు.

పదిపదిహేను రోజుల తర్వాత ఆ ముసలాయన వెళ్ళిపోవాలి. ఈ లోపలే ఎవరికయినా కుదుర్చుకోవాలనే ఆదుర్దాతో ఉన్నాడు సోమయాజులు.

"అబ్బ నువ్వు లేకపోతే బ్రతుకు ఎంత దుర్భరంగా ఉందో చెప్పలేను. ఎప్పుడెప్పుడొస్తావా అని ఎదురు చూస్తున్నాను" అన్నాడు శర్మ శాంతతో.

శాంత ఏం మాట్లాడలేదు.

ఆ రాత్రి శాంత మంచం మీద ఉన్న పరుపుతీసి, మంచానికి దూరంగా నేలమీద వేసుకుంది. ఆ పరుపుమీద పడుకుంది, బాబుని పక్కలో పడుకోబెట్టుకుని, కొద్దిగా ఆశ్చర్యపోయాడు శర్మ. శాంత ఎంత కోపం వచ్చినా అలా ఎప్పుడూ చేయలేదు పెళ్ళయిన దగ్గరనుంచి.

"అలిగావా?" అడిగాడు నవ్వుతూ. శాంత సమాధానం ఇవ్వలేదు.

శాంత కోసం ఎదురుచూస్తూ, సిగరెట్ తాగుతూ శర్మ చాలాసేపు మంచం మీద పడుకున్నాడు. నాలుగు సిగరెట్లు కాల్చాక పిల్చాడు.

"రా శాంతా నువ్వు దూరంగా ఉంటే, సిగరెట్స్ ఖర్చు పెరుగుతోంది."

శాంత మాట్లాడకపోవటంతో శర్మేలేచి శాంత దగ్గరికి వెళ్ళాడు. నిద్రపోతుంది శాంత. బాబుని ఎత్తుకుని మంచం మీద పడుకోబెట్టి, వాడు కదిలితే కాసేపు జోకొట్టాడు. తర్వాత శాంత ప్రక్కన కూర్చుని పిల్చాడు.

శాంతకి భర్త చేతి స్పర్శకి మెలుకువ వచ్చింది. ఉలిక్కిపడి లేచి చూసింది భర్తవంక.

"వెళ్ళండి" కసిగా అన్నది శాంత.

తల అడ్డంగా ఊపాడు శర్మ నవ్వుతూ.

"మీకే, మీద చెయ్యి వేస్తే మర్యాద దక్కదు"

శాంత కంఠంలోని తీవ్రతని గుర్తించి అన్నాడు శర్మ కోపంగా.

"ఈ సారి ఏం తప్పు చేశానో?"

శాంత భర్త గడ్డం కింద చేతిని ఉంచి బలంగా శర్మ తలయెత్తి, శర్మ కళ్ళలోకి చూస్తూ చెప్పింది తనకు చేతనయినంత కర్కశంగా.

"నెల్లూరులో నాకు ఛాయ అంతా చెప్పి, ఏడ్చింది. ఈ రోజు నుంచీ మనమధ్య కాపరం చూపురులకి మాత్రమే. నా వంటిమీద మీ స్పర్శపడితేనే నా కసహ్యం" బిత్తరపోయి చుస్తుండి పోయాడ్డు శర్మ. కత్తివాటుకి నెత్తురు చుక్కలేదు పాలిపోయింది మొహం. కాసేపు మాట్లాడలేకపోయాడు.

లేచివెళ్ళి, సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టె తెచ్చుకుని, సిగరెట్ అంటించుకుని చెప్పాడు.

"పూర్తిగా అబద్ధం. ఛాయ నిన్ను చూసి అసూయపడి అలా అబద్దం చెప్పింది. అంతకంటే ఛాయ అలా అబద్దం ఆడటానికి తగిన కారణం నాకు కనిపించటం లేదు."

"దూరంగా వెళ్ళండి"

శర్మ లేచి మంచం మీద కూర్చుని అన్నాడు.

"అలాగే?"

కాసేపు సిగరెట్ తాగుతూ ఆలోచిస్తూ ఉండిపోయాడు, నిద్రపోతున్న బాబువంక చూస్తూ. తర్వాత అన్నాడు నిశ్శబ్దాన్ని చీలుస్తూ.

"దీక్ష, అవధాని వాళ్ళిద్దరిలో ఎవరిపనో తేల్చుకోలేకపోతున్నాను. "

శాంత మనసులో అనుకుంది. దీక్షో, అవధానో కనక అయుంటే తనకి ఎందుకు చెప్పి ఉండదు? తన భర్త కాబట్టే చెప్పలేదు. తప్పకుండా ఈయనే.

మనసు కుతకుతలాడిపోతోంది.

"ఆల్‌రైట్, నీ ఇష్టం. రాపటినుంచీ బయటే పడుకుంటాను. నువ్వు మళ్ళీ రమ్మనేదాకా రాను. నేనే రాత్రయినా ఇంటికి రాకపోతే, కారణం నా భార్య నన్ను పక్కలోనికి రానివ్వకపోవడమే అన్న సంగతి మాత్రం గుర్తుచేసుకుంటూ పడుకో ఆ రాత్రంతా."

సిగరెట్ ఆర్పేసి పడుకున్నాడు శర్మ. మనసులోని బాధని అంత తేలికగా ఆర్పే సాధనం ఏదయినా ఉంటే, మనుషులకి కన్నీళ్ళు ఖర్చు తెలియదేమో!

## 15

ఛాయ ఆ ఇంటిని వదిలి పదిహేను రోజులు గడిచిపోయాయి. ముగ్గురూ వీలయినంత సమయం బయటే గడుపుతున్నారు. భోజనానికి, నిద్రకు మాత్రమే ఇంటికి వస్తున్నారు.

కామేశ్వరమ్మకి కొడుకుల తరహా నచ్చలేదు. ఆగర్భ శత్రువుల్లాగా ఒకరితో మరొకరు మాట్లాడుకోకపోవడం మరీ బాధ కలిగిస్తోంది ఆవిడకి. శర్మ, శాంతా కూడా సఖ్యంగా లేరన్న సంగతి రూఢీ అయిపోయింది ఆవిడకి.

ఆవిడ అనారోగ్యం కన్నా ఆవిడకి ఇంటి పరిస్థితులు ఎక్కువ మనస్తాపాన్ని కలిగిస్తున్నాయి. శాంతని మందలించింది. 'మీ విషయం మీరు చూసుకోండి' అన్నట్లుగా మాటాడింది శాంత.

నెల్లూరు నుంచీ ఉత్తరం వచ్చింది. కామేశ్వరమ్మ చెల్లెలు వ్రాసింది. ఛాయని డాక్టర్‌కి చూపించాననీ, కులాసాగానే ఉందనీ.

భర్తతో అన్నది కామేశ్వరమ్మ ఒకరోజు.

'ఎంతకాలమిలా? పెద్దకొడుకు కాపరం ఇలా ఉంది. రెండోవాడు సరేసరి, మూడోవాడు కూడా ఓ అడ్డదారి తొక్కకమునుపే, మన మాట వినే సమయంలో ఎవరినో ఒకరిని చూసి ముడిపెట్టేయడం ఉత్తమం."

సోమయాజులు నవ్వి అన్నాడు.

"సంబంధాలేమీ రాకపోతే ఏంచేయను? పేపర్లో ప్రకటన వేయించుకుంటావేమిటి? మన సంసారాన్ని చూసి ఎవరు గుమ్మం తొక్కుతారు?"

సుందరి ఫోన్ చేసింది అవధానికి, ఆఫీస్‌కి.

"ట్రంక్‌కాల్ బుక్ చేశాను. మీ పర్సనల్ కాల్ త్వరగా మాటాడండి" అన్నాడు అవధాని ఆఫీసర్.

అవధాని టేబుల్ మీద ఉన్న రిసీవర్ అందుకుని 'హలో' అన్నాడు.

"సుందరిని మాటాడుతున్నాను. ఈ మధ్య దర్శనాలే కరువయ్యాయ్? బ్రతికే ఉన్నావా? " అడిగింది సుందరి నవ్వుతూ.

"దేముడి దయవల్ల"

"రెండు ఆదివారాల నుంచీ నీ పోస్ట్‌కార్డ్ కోసం ఎదురు చూస్తున్నాను. నువ్వయినా వస్తావేమోననుకున్నాను."

"సారీ సుందరి, ఈ మధ్య తీరుబడి లేక..."

అవధాని మాటలను ఖండిస్తూ అన్నది సుందరి. "పెళ్ళిగానీ కుదిరిందేమిటి?

"వచ్చే ఆదివారం కలుద్దాం?"

"వచ్చే ఆదివారం అంటే? మూడు రోజుల తర్వాత వచ్చే ఆదివారమా.. ఆపై ఆదివారమా?"

"మూడు రోజుల తర్వాత వచ్చేది. 25 వ తారీకు."

"గుడ్ ఎక్కడ?"

"పోనీ ఈ రోజు సాయంత్రం?" అడిగాడు అవధాని.

"బెంగాలీ సినిమా ఫస్టుషోలుండవు. ఉన్నా నాకు కుదరదు రావడానికి ఎల్లుండి 25 వతారీకు, ఉదయం పదిన్నరకి సికింద్రాబాద్ క్లాక్ టవర్ దగ్గర. ఛాయనడిగానని చెప్పు. మీ నాన్నగారిని కూడా. గుడ్ బై"

ఫోన్ పెట్టేసింది సుందరి.

మేనెల 25 వ తేదీ, ఆదివారం ఉదయం పదిన్నరకి సుందరిని కలుసుకున్నాడు అవధాని.

"ఏమిటిలా అయిపోయావ్? జ్వరం వచ్చిందని చెప్పలేదే?" చిక్కిపోయిన అవధానిని చూసి నెవ్వెరపోతూ అడిగింది సుందరి.

"జ్వరం రాలేదు"

"మరి?" అడిగింది లోతుకుపోయిన కళ్ళని, ఎండుకుపోయినట్లున్న చెంపలని చూస్తూ.

తటపటాయిస్తూ ఉండిపోయాడు అవధాని కారణం చెప్పడానికి.

"ఏ సినిమాకి వెళదాం? నగరంలో జనాలు రాని మూడు డొక్కు సినిమాలు నడుస్తున్నాయి. మనలాంటి వాళ్ళకోసం"

"సినిమాకి రాలేను ఇవాళ."

"జీతం రాలేదా ఏమిటి? లంఖణాలు చేస్తున్నావా? జీతం ఇస్తే కానీ మీ ఛాయ అన్నం పెట్టదా ఏం?"

"హోటలుకి వెళదాం పద. కూర్చుందాం నీతో చాలా చెప్పాలి"

ఇద్దరూ దగ్గరే ఉన్న ఓ చక్కటి హోటలుకి నడిచారు. కన్నడం వాళ్ళు నడిపే ఆ హోటల్ నీట్‌గా ఉంది. టిఫిన్ ఆర్డరిచ్చాడు అవధాని.

"సినిమా రీళ్ళు తిరిగొచ్చిన నిర్మాతలా అచ్చం. ఏం సినిమా తీశావు?"

"నిన్ను ఇన్నాళ్ళు కలవకపోవడానికి కారణం, జరిగింది నీతో చెపితే బాధపడతావని-."

"ఏం జరిగింది? పెళ్ళా? ఎవరా దుర్మార్గురాలు?" చాలా కాలం తర్వాత అవధానిని చూడటం వల్ల సంతోషం పట్టలేక హుషారుగా మాట్లాడేస్తుంది, సుందరి.

"నీవు నన్ను తప్పు అంచనా వేయనని ముందరే మాట ఇస్తే చెపుతాను."

"సిల్లీమాట! అడగటం సిగ్గుచేటు, నీకు తెలుసు నా మనస్తత్వం, కోపం, ఆలోచనల పద్ధతి ఎట్సెట్రా. నువ్వు చెప్పబోయేది నా మీద ఎలాంటి ప్రభావం చూపబోతుందో నువ్వు అంచనా వేయగలిగినప్పుడు, కొత్తవాళ్ళలాగా ఈ 'మాట' ఏమిటి చెప్పు. ఏ అమ్మాయయినా ప్రేమించానందా?"

"ఛాయ తెలుసుగా."

"ప్రేమిస్తోందా?"

"నెల్లూరు వెళ్ళింది."

"దేనికి?"

"పంపించారు."

"బెంగ పడ్డావా? బెంగ జ్వరమా? మంత్రం పెడతాలేకానీ, ఇలా కట్టె కొట్టె తెచ్చేలా చెప్పక. జరిగింది ఫటాఫట్ చెప్పెయ్ - ఒక్క పేరాలో."

సర్వర్ టిఫిన్ ప్లేట్స్ సర్ది వెళ్ళాడు.

"ఛాయకి అయిదో నెలనుకుంటాను ఇప్పుడు"

"ఎవరికీ? ఛాయకా?" నమ్మలేనట్లుగా చూసింది సుందరి. ఇప్పుడు సుందరి మొహంలో ఇందాకటి చిరునవ్వు, సంతోషం లేదు.

"అవును. అందుకని నెల్లూరు పంపించేశారు. పిన్ని దగ్గరకి. ఛాయ ఎవరో చెప్పలేదు దానికి కారణం. కానీ మా ఇంట మా ముగ్గురు అన్నదమ్ముల్లో ఒకరని మాత్రం స్పష్టంగా చెప్పింది. ఎవరో చెప్పలేదు. మా అన్నయ్యలిద్దరిలో ఎవరో ఒకరౌ అయిఉండాలి. మా ఇంట్లో వదిన, అమ్మ, నాన్నగారు, అన్నయ్యలిద్దరిలో ఆ మరొకరు అంతా నన్ను కూడా అనుమానిస్తున్నారు. ఇంటికి వెళ్ళాలంటేనే భయంగా, సిగ్గుగా, అవమానంగా, ఏడుపుగా ఉంది. ఆమె ఫలాన అతనని చెప్పి చచ్చినా బాగుండేది. చెప్పలేదు, చెప్పకుండా ఆ ఫలానాకి ఏదో గొప్పమేలు చేస్తున్నాననుకుని, చెప్పకపోవడం వల్ల కలిగే కీడు ఆలోచించలేదు, ఎంత అసహ్యకరమయిన పరిస్థితి ఇంట్లో పెద్దవాళ్ళముందు..."

ఎవరితోనూ చెప్పుకోలేక దాచుకున్న బాధనంతా అవధాని తన సుందరికి చెప్పుకున్నాడు. దాదాపుగా అవధాని కళ్ళలో అలా చెపుతున్నప్పుడు నీళ్ళు తిరగడం గమనించింది సుందరి.

మాట, పలుకు లేకుండా నోరు తెరుచుకుని, ఎదురుగా ఉన్న టిఫిన్ తినటం కూడా మర్చిపోయి చూస్తుండిపోయింది సుందరి అవధాని వంక.

ఎంతవరకు నిజం చెపుతున్నాడు అన్నట్టుగా ఉన్నాయి సుందరి చూపులు.

"అందుకనే నన్ను కలవలేదా?" అడిగింది సుందరి ఇద్దరి మధ్య నిశ్శబ్దాన్ని చీలుస్తూ.

"అవును, ఈ సంగతి చెపితే బావుండదని కలవలేదు నేను. ఇప్పుడు కొద్దిగా తేరుకున్నానని చెప్పచ్చు."

మళ్ళీ నిశ్శబ్దం పేరుకుంది ఇద్దరిమధ్యా.

"ఇడ్లీ తిను" అన్నది సుందరి ఓ స్పూన్ అందుకుంటూ సుందరి మొహం ఎర్రగా కందిపోయి ఉండటం గమనించాడు అవధాని. కొద్దిగా కలవరపడుతూ అడిగాడు.

"నన్ను తక్కువ అంచనా వేయటం మొదలుపెట్టావ్."

సుందరి అవధాని మాటలు విననట్లే మౌనంగా ఉండిపోయింది.

"గమ్మత్తు కదూ?" నవ్వడానికి ప్రయత్నించాడు అవధాని.

సుందరి ప్రయత్నించలేదు.

"ఛాయ అంటే నీకంత ఇష్టమని ముందరే నాకు చెప్పిఉంటే బావుండేది. తప్పుకునే దాన్ని. ఈ రోజు ఈక్షణం దాకా రానిచ్చేదాన్ని కాను మన ప్రే...స్నేహం."

అవధాని సుందరి కళ్ళలోకి చూసాడు. సుందరీ అవధాని కళ్ళలోకి చూసింది. కొన్ని క్షణాలు అలా చూసుకుంటూ ఉండిపోయారు ఇద్దరూ ఒకరినొకరు.

అవధాని సమాధానం చెప్పలేదు. తన చేతిని టేబుల్ మీదున్న సుందరి చేతిమీద ఉంచాడు.

"అంటే?" అన్నది సుందరి, తన చేతిమీద అవధాని చేతివంక చూస్తూ, వెంటనే తన చేతిని దూరంగా తీసుకుంది.

దూరంగా మరో టేబుల్ దగ్గర కూర్చున్న ఇద్దరు తమని గమనించటం కనుకొలకుల్లోంచే చూశాడు అవధాని.

"నా మీద నమ్మకం లేదా నీకు!" సూటిగా అడిగాడు వెన్నలో కత్తి గుచ్చినట్టుగా.

"లేదు"

వెన్న అంటకుండా కత్తి బయటికి వచ్చేసింది.

"నిన్ను అన్ని సార్లు ముద్దు అడిగాననా?"

"కాదు, నా మనసులోనూ ఉన్న కోరికే అది. నీకు నేనివ్వడానికి సమ్మతించనిది, పెళ్ళికాకుండా ఛాయ ఇచ్చి ఉంటుందనే నమ్మకం, నీమీదున్న నమ్మకాన్ని కృంగదీసింది."

"సుందరీ తప్పుగా అర్థం చేసుకోకు నువ్వుకూడా, నన్ను నమ్ము. దేముడితోడు"

"నమ్మకం అనేది ఒట్లుతోనూ, అర్థిస్తేనూ రాదు. ఎందుకు వస్తుంది, ఎలా కలుగుతుంది నేను చెప్పలేను కానీ, అది స్వతహాగా రావాలి."

అవధాని సర్వర్‌ని పిలిచి, రెండురూపాయల కాగితం ఇచ్చి విల్స్‌పేకెట్, అగ్గిపెట్టె తెమ్మని చెప్పాడు.

"నేను ఎక్కువసేపు నీతో వాదిస్తూ కూర్చోను అవధాని" అన్నది సుందరి సర్వర్ వెళ్ళగానే.

"బతిమలాడటం నా ధ్యేయం కాదు. నువ్వన్నట్లు అది స్వతహాగా రావాలి. బతిమాలితే వచ్చేది విలువయినది కాదు. కలకాలం ఉండదు. పెళ్ళికి పునాది నమ్మకం. పెళ్ళి తర్వాత ప్రాణం నమ్మకం. అది నశిస్తే ఇద్దరిలో ఎవరికయినా సరే ప్రాణం లేని జీవాల్లా బతకాలి. మా పెద్ద వదిన రెండో వదిన కాపరాలు చూస్తేనే అర్థం అవుతుందా సంగతి. బహుశా మా అన్నదమ్ములు ముగ్గురికీ ఎవరో శాపం పెట్టి ఉంటారు చిన్నప్పుడు. ఆ శాపం ఛాయ రూపంలో వచ్చింది."

సర్వర్ సిగరెట్స్ తీసుకురావడంతో ఆపేశాడు చెప్పటం. సిగరెట్ అంటించుకుని కాఫీ తీసుకురమ్మని చెప్పాడు.

"ఛాయ నాకన్నా బావుంటుందా?" అడిగింది సుందరి.

"అర్థంలేని ప్రశ్న."

"అది నా ప్రశ్నకు జవాబు కాదు."

"అనాకారి కాదు."

"అర్థం లేని ప్రశ్నకు మంచి జవాబది."

కాఫీ తీసుకు వచ్చాడు సర్వర్ బిల్ తో పాటుగా. కాఫీ తాగాక మరో సిగరెట్ వెలిగించి అడిగాడు అవధాని.

"మళ్ళీ కలుద్దామా? ఆఖరా?"

"కలుద్దాం, ఫోన్ చేసి చెపుతాను. కానీ అంత త్వరగా నా ఫోన్ కాల్‌కోసం ఎదురు చూడద్దు. ఎప్పుడో ఓ అప్పుడూ చేస్తాను."

"అయితే నీ పెళ్ళికి తప్పకుండా నన్ను పిలు."

సుందరి నవ్వి అవధాని చెంపని చేతి వేళ్ళతో రాసి అంది. "ప్రేమ తుమ్మ జిగురులాంటిది, పౌడర్‌లాంటిది కాదు. దులుపుకుంటే పోదు. కానీ ప్రేమని జయించే 'మనోబలం' అనేది మరొకటుంది."

"నా కర్థం కాలేదు."

"ఛాయని చూసుకుంటే అర్థం అవుతుంది"

16

అవధాని తను తరచుగా వెళ్ళే బార్‌లోకి వెళ్ళాడు.

ఓ మూల కూర్చున్నాడు. బార్‌లో వెలిగే డిమ్‌లైట్ కాంతిలో ప్రక్క టేబుల్‌ని వదిలి పై టేబుల్ మీద ఒంటరిగా కూర్చుని తాగుతున్న వ్యక్తిని చూసి కొద్దిగా ఉలిక్కిపడ్డాడు.

దీక్ష.

దీక్ష తాగుతున్నాడు.

లేచి వెళ్ళి అన్నయ్య ముందు కూర్చున్నాడు, బాగా తాగి ఉండటం వల్ల దీక్ష చూడలేదు అవధానివంక. అసలు తనముందు మరో మనిషి కూర్చున్నాడన్న సంగతే గుర్తించలేదు.

అవధాని ఖాళీగ్లాసులోకి మరి కాస్త రమ్ పోసి, గ్లాసులోని రమ్‌ని వాసన చూసి దాన్ని టేబుల్ మీద పెట్టి నీళ్ళు కలిపాడు కొద్దిగా. దీక్ష గ్లాసు అందుకుని త్రాగేశాడు పూర్తిగా. ఆ గ్లాసులోకి ఎవరు పంపారో చూడనయినా చూడకుండా.

"అన్నయ్యా" పిల్చాడు అవధాని. దీక్ష కళ్ళు మూసుకుని సోఫాలో వెనక్కి వాలాడు.

"అన్నయ్యా" మళ్ళీ పిలిచాడు అవధాని.

"నా పేరు దీక్షితులు, అయినా తాగుతున్నాను. తాగుతాను."

"దేనికి?" అడిగాడు.

"అందుకే"

"ఎందుకు?"

"ఫోటో స్టూడియోలో చెయ్యి వేశానని వెళ్ళి చెప్పింది. కానీ ఎంతమంది చేతులు వేయించుకుందో ఎవరికీ తెలియదు. నా కాపురం కూలదోసింది మహా రాక్షసి. కత్తి ఉంటే పొడిచేసేవాణ్ణి. పిస్తోలు ఉంటే కాల్చేసేవాణ్ణి. కత్తెరుంటే నాలిక కత్తిరించేవాణ్ణి."

అవధానికి అర్థమయింది దీక్ష తన భార్య స్నేహితురాలు గురించి మాట్లాడుతున్నాడని, ఆ అమ్మాయి మీద దీక్షకి అంత కోపం ఉందని ఎప్పుడూ అనుకోలేదు అవధాని.

"మరి ఛాయ?" అన్నాడు.

ప్రాణాలుగ్గబెట్టుకుని ఏమంటాడో అని చెవులు రిక్కించాడు అవధాని.

"ఛాయ! ఎక్కడుంది ఛాయ? నెల్లూరులో లేదు. సత్తెనపల్లిలో లేదు. చిక్కడిపల్లిలోని బార్‌లో ఉంది. ఇక్కడుంది - నా దగ్గరుంది. ఇందులో ఉంది. గూడుకట్టుకుంది."

చేత్తో గుండీలు ఊడదీసుకుంటూ చొక్కాలోని ఛాతీని చూపించాడు, కళ్ళు మూసుకునే.

బార్ మేనేజర్ దగ్గరకి వచ్చి అవధానిని అడిగాడు.

"మీ తరఫా?"

"అవును"

"అయితే దయచేసి బిల్ పేచేసి తీసుకువెళ్ళండి. అలా అరవటం బావుండదు."

"అలాగే" అన్నాడు అవధాని నవ్వి.

"ఛాయని ఎప్పుడు.. దగ్గరకు తీసుకున్నావ్?" అడిగాడు అవధాని మేనేజర్ వెళ్ళగానే.

"నేనా?"

చేతితో తడిమి, టేబుల్ మీద గ్లాసునందుకుని దాన్ని విసిరికొడుతూ అన్నాడు.

"నేనా? పెళ్ళయితేగానీ ఛాయని ముట్టుకోనని ఒట్టేసుకున్నాను. ఆ శర్మగాడో, ఆ అవధానిగాడో దాన్ని పాడుచేసేశారు. చేస్తే నాకేం? అయినా చేసుకుంటాను. కాకినాడలో ఉన్న దానికెలా తెలుస్తుంది చేసుకున్నట్లు? ఎలా రుజువు చేస్తుంది?"

"చేసుకుంటావా?"

మేనేజర్ దగ్గరికి వచ్చి గట్టిగా అన్నాడు.

"బిల్‌లో గ్లాసు ఖరీదు కూడా వేస్తున్నాం. తక్షణం తీసుకువెళ్ళండి బయటికి."

ఇంటికి రిక్షా మాట్లాడి, బేరర్ సహాయంతో రిక్షాలోకి చేర్చాడు దీక్షని అవధాని. దీక్ష జేబులో డబ్బులేదు. బిల్ ఇరవై ఏడు రూపాయలు తనే చెల్లించాడు.

"ఛాయని నువ్వేం చేయలేదా? అడిగాడు అవధాని మళ్ళీ.

"లేదు, నాతోడు, నీతోడు, అందరితోడు, ఈ రిక్షా తోడు, రిక్షావాడితోడు. ఛాయని ఒకే ఒక్కసారి ముద్దు పెట్టుకోవాలనుకున్నాను, అయినా ధైర్యం చేయలేదు. అంతా పెళ్ళయాకే అనుకున్నాను. ముందే ధైర్యం చేస్తే అందరి దగ్గరా వీడింతే అనుకుంటుంది ఆడది. అయినా నువ్వెవరు? నీకెందుకిదంతా?"

రిక్షా ఇంటికి చేరింది, దీక్షని లోపలికి తీసుకువెళ్ళాడు. పడక్కుర్చీలో పడుకోబెట్టి రిక్షాని పంపించాడు, అవధాని డబ్బు చెల్లించి. శర్మ నైట్ డ్యూటీకి వెళ్ళాడు, లేడు. సోమయాజులు ఇంట్లోనే ఉన్నాడు.

"నాకు తెలీదు. నాకు తెలీదు. నా తోడు.. అంతా పెళ్ళయాకే" దీక్ష ఏడుస్తున్నాడు నిషాలో. ఏడుస్తూ పేలుతున్నాడు.

తన తండ్రి అంత దీనంగా చూడటం ఎప్పుడూ చూడలేదు అవధాని. గుండె కలుక్కుమంది అవధానికి.

"ఎక్కడనుంచీ తెచ్చావ్?" అడిగాడు అవధానిని.

అవధాని బదులు చెప్పలేదు. "నువ్వక్కడికి ఎందుకెళ్ళావ్?" అని అడుగుతారని భయం. బదులు చెప్పకుండా సరాసరి మళ్ళీ అక్కడికే వెళ్ళాడు.

శాంత గదిలోంచీ బయటకి రాలేదు. ఏడుస్తున్న మరిది మాటలకి నవ్వుదామనుకుంది. కానీ నవ్వలేకపోయింది శాంత.

ఏడ్చింది.

అవధాని దీక్షకి ఫోటో అందించాడు.. ఫోటో స్టూడియోలో. దాన్ని చూసి ఉలిక్కిపడ్డాడు దీక్ష.

"నిన్న రాత్రి బార్‌లో బిల్ చెల్లించటానికి నీ జేబులో వెదికితే ఈ ఫోటో దొరికింది" చెప్పాడు అవధాని వెలుగుతున్న లైట్లవంక చూస్తూ.

"కూర్చో, కష్టమర్స్‌ని పంపించి వస్తాను" అని దీక్ష స్టూడియోలోకి వెళ్ళాడు.

నాలుగయిదు నిమిషాల తర్వాత పిల్లలతో ఫోటో తీయించుకున్న దంపతులు బయటికి వెళ్ళిపోయారు.

"చూశావా, స్వర్గం, సుఖం అంటే అలాంటి సంసారం. కలతలు లేకుండా సాఫీగా నడిస్తే అదీ సంసారం. అది కూడా ఓ వరమే."

"నీకలాంటి సంసారం అంటే మక్కువా?"

"అవును"

"అందుకేనా స్టూడియో నిండా పిల్లలతో ఫోటోలు తీయించుకున్న దంపతుల బొమ్మలుంచావు?"

"అవుననుకుంటాను."

"ఛాయ ఫోటో నీ జేబులో ఉండటం నాకు ఆశ్చర్యంగా ఉంది, ఇంంత జరిగాక."

"ఛాయని పెళ్ళాడ్డదామనుకున్నాను."

"వస్తాను" లేచాడు అవధాని.

"ఛాయని నేను పాడు చేయలేదు. నమ్ము నమ్మితే ఇప్పుడు దోషి నువ్వో, పెద్దన్నయ్యో నీ మనసుకే తెలుస్తుంది. ఫోటో తిరిగి ఇచ్చినందుకు థ్యాంక్స్. రాత్రి బార్‌కు వెళుతూ డబ్బున్న కవరు జేబులో పెట్టుకోవడం మర్చాను. ఎంతయింది బిల్లు?"

"ఇరవై ఏడు. అక్కరలేదు."

బయటకి నడిచాడు అవధాని.

## 17

సోమయాజులు పోలీస్ ఇన్‌స్పెక్టర్ లోపలికి రావడం చూసి కొద్దిగా ఖంగారు పడ్డాడు.

"ఎవరు కావాలి?" అడిగాడు.

చిరునవ్వు నవ్వి అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"ఖంగారు పడకండి అవధాని ఉండేది ఇక్కడేగా?"

"అవును ఏం చేశాడు?"

ఆ ముసలాయన మొహంలోంచి తొలిగిపోని ఖంగారును, ఆందోళనని చూసి మళ్ళీ నవ్వి అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"మా ఉద్యోగంలో ఉండే చిక్కు ఇదే అనవసరంగా మమ్మల్ని చూసి భయపడుతుంటారు. అవధాని ఏ తప్పు చేయలేదు. తిరుపతిలో అవధాని తన వస్తువులు పోయినట్లు రిపోర్టు ఇచ్చాడు ఏడెనిమిది నెలల క్రితం. ఆ వస్తువులు దొరికాయి. ఆ సంగతి చెపుదామని."

ముసలాయన మొహం తేటపడింది ఆ సమాధానం విన్నాక "కూర్చోండి" అన్నారు, కుర్చీ చూపించి.

ఇన్‌స్పెక్టర్ కుర్చీలో కూర్చుని జేబులోంచి కొన్ని కాగితాలు తీసి చెప్పాడు.

"తిరుపతిలో జరిగిందా దొంగతనం. ఈ మధ్య రేణిగుంటలో పట్టుకున్నారు ఆ దొంగని అక్కడ పోలీసులు. చాలా వస్తువులు దొరికాయి. తిరుపతిలో దొంగతనం చేసిన వస్తువుల జాబితా అక్కడి పోలీసులకి పంపించరు. అవధాని తన హైదరాబాద్ చిరునామా ఇవ్వడం వల్ల నిన్న నాకు తిరుపతి నుంచీ సమాచారం అందింది. నేను ఇంటికి వెళ్ళేదారి ఇదే గనక దారిలో చెప్పిపోదామని వచ్చాను. దీక్ష మీ అబ్బాయనుకుంటాను?"

"అవును"

"దీక్షని నేను ఎరుగుదును, ఫోటోగ్రాఫర్ కదా?"

"అవును"

"ఓ పెళ్ళిలో చూశాను. ఎవరో చెప్పారు దీక్ష ఉండేది ఇక్కడే అని. దీక్ష నేను అప్పుడప్పుడు కలుస్తుంటాం. అవధాని తిరుపతిలో సామాను పోగొట్టుకున్న సంగతి నాతో చెప్పాడు దీక్ష. మర్చిపోదామన్న మర్చిపోలేని విధంగా ఇంటికి తిరిగి వచ్చాడు అవధాని. అందుకనే గుర్తుంది ఆ సంగతి నాకూ."

కాగితాలు సోమయాజులుకి అందించి చెప్పాడు లేచి నిలబడి.

"రేపు ఉదయం ఓ సారి స్టేషన్‌కి రమ్మని చెప్పండి. ఆ వచ్చేటప్పుడు ఈ కాగితాల మీద సంతకాలు చేసి తెస్తే వారం పదిరోజుల్లో సామాను తిరిగి వస్తుంది."

"అలాగే. పోయిన వస్తువులు దొరకడం నాకు తెలిసినంతలో ఇదే మొదటిసారి."

"మీ ఇంట్లో ఎన్నిసార్లు దొంగతనాలు జరిగాయి?" అడిగాడు ఇన్స్పెక్టర్ నవ్వుతూ.

"ఇదే ప్రథమం."

"మీరెలా చెప్పగలుగుతున్నారు పోయిన వస్తువులు తిరిగి దొరకడం ఇదే మొదటిసారని. చాలా భాగం తిరిగి దొరుకుతాయి."

"కాఫీ తీసుకుని వెళుదురుగాని ఉండండి."

"వద్దు, వెళతాను"

ఇన్స్పెక్టర్ దృష్టి ఆ మాటలంటుండగా వరండాలో గుమ్మంపైన ఉన్న ఫోటో మీద పడింది. దానివంక ఉత్కంఠగా చూసి అన్నాడు కూర్చుంటూ.

"పోనీ ఇవ్వండి."

సోమయాజులు వంటగదిలోనికెళ్ళి, స్వయంగా కాఫీ కలిపి తీసుకువచ్చాడు.

"ఆ ఫోటోలో ఉన్నదెవరు?" అడిగాడు ఇన్స్పెక్టరు కాఫీ త్రాగుతూ.

"మేమంతా కలిసి తీయించుకున్నాం. నేను, నా భార్య, కుడిప్రక్క పెద్దబ్బాయి శర్మ..."

"ఆ అమ్మాయి?"

సోమయాజులు మొహం క్షణకాలం కళతప్పింది. వెంటనే తేరుకుని చెప్పాడు.

"మా పనిమనిషి"

"ఛాయకదా పేరు, నాకు సరిగా గుర్తుంటే."

"అవును. మీకు తెలుసా?"

"తెలుసు ఇంట్లో ఉందా?" అడిగాడు.

"లేదు."

కాఫీ పూర్తిగా త్రాగి, క్రిందపెట్టి అన్నాడు.

"కాఫీ ఛాయ కలిపినట్టు లేదు అందుకే, ఉంటాను. రేపు అవధానిని పంపించండి" బయటికి నడిచాడు పోలీస్ ఇన్స్పెక్టర్.

ఇన్స్పెక్టర్ వెళ్ళిన పదినిముషాలకి వచ్చాడు అవధాని ఆఫీసునుంచీ. మొహం కడుక్కోనిచ్చి ఇన్స్పెక్టర్ వచ్చి వెళ్ళిన సంగతి చెప్పి కాగితాలిచ్చాడు సోమయాజులు. ఛాయ సంగతి కూడా చెప్పాడు.

అవధాని ఆ కాగితాలని అక్కడక్కడా చదివి మడిచి డ్రాయర్‌లో పెడుతూ అన్నాడు.

"ట్రాన్సిస్టర్ తప్ప పనికొచ్చేవి ఏవీ లేవు. అన్నీ కాటన్ బట్టలే. ఆ దొంగ వెధవ ఎన్ని సార్లు వాటిని తొడుక్కుని ఉంటాడో?"

"అయినా రేపు వెళ్ళు."

"ఛాయ ఎలా తెలుసట?" అడిగాడు అవధాని.

"అడగలేదు. ఛాయగురించి ఎక్కువ అడకుండా వెళ్ళిపోయాడు బ్రతుకుజీవుడా అనుకున్నాను."

"రేపు నన్నడిగితే ఏం చెప్పను? నెల్లూరు వెళ్ళిందని చెపుతాను."

"ఏదో చెప్పు."

అవధాని ఆ సంగతి చెప్పడానికి మర్నాటిదాకా ఆగే అవసరం లేకపోయింది. గంట తర్వాత మామూలు బట్టల్లో ఉన్న ఒకతను తన భార్యతో వచ్చాడు. ఇన్‌స్పెక్టర్‌గా పోల్చుకోలేకపోయాడు సోమయాజులు అతన్ని, తనే స్వయంగా చెప్పేదా.

"ఎవరు కావాలి" అని అడిగాడు సోమయాజులు.

"అదేమిటి సార్, గంట ముందేగా వచ్చి వెళ్ళాను. మనిషికన్నా దుస్తుల్నే గుర్తుంచుకున్నట్టున్నారు. పోలీసు దుస్తుల్లో ఉన్న మహత్యమే అది. ఆ దుస్తులు మా వ్యక్తిత్వాన్ని వ్యతిరేకంగా ప్రదర్శిస్తాయి. మేంకూడా మంచి కోసం, న్యాయంకోసమే పనిచేసేది" కొద్దిగా నొచ్చుకుంటూ అన్నాడు.

"కూర్చోండి" అన్నాడూ.

"ఛాయ వచ్చిందా?" అడిగింది ఇన్‌స్పెక్టర్‌తో వచ్చిన భార్య.

"నా భార్య, ఛాయ బాగా తెలుసు" పరిచయం చేస్తూ అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఎలా తెలుసు?" అడిగాడు అవధాని.

"అవధాని మీరేనా?" కొన్ని క్షణాలు నిశితంగా అవధానిని చూసి అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"అవును"

"ఛాయ మా ఇంట్లో పనిచేసింది చాలాకాలం."

"సత్తెనపల్లా మీది?"

"అవును. మా నాన్నగారక్కడ డాక్టరు. తర్వాత ప్రాక్టీసు తెనాలికి మార్చారు. ఛాయ హైదరాబాద్ వచ్చిందని తెలియదు నాకు. పేరుకి పనిమనిషే అయినా మా ఇంట్లో దానిలా... దాదాపుగా నా చెల్లెలులా చూసుకునేవాళ్ళు అమ్మా నాన్నా."

"ఆమె ఊళ్ళోలేదు" చెప్పాడు అవధాని.

"సత్తెనపల్లి వెళ్ళిందా? బయటకి ఏ కూరలు తేవడానికో వెళ్ళిందనుకున్నాను."

"నెల్లూరులో మా తోడల్లుడు భార్యకి కానుపు రోజులు మేమే పంపించాము, ఎవరయినా మనిషిని సహాయానికి పంపమంటే" చెప్పాడు సోమయాజులు.

"అలాగా. ఆమె వచ్చాక ఓసారి మా ఇంటికి తీసుకురండి, ఇల్లు దీక్షకి తెలుసు."

కాసేపు కూర్చుని, కాఫీతాగి, భార్యాభర్తలిద్దరూ వెళ్ళిపోయారు. దీర్ఘంగా నిట్టూర్చాడు సోమయాజులు.

"ఆ పోలీసు ఇన్‌స్పెక్టరు కూర్చున్నంతసేపు గుండె లటుకు లటుకు మంటూనే ఉంది నాకు" అన్నాడు.

శాంత ఆఫీసు నుంచీ తిరిగి వచ్చి అడిగింది.

"మనింట్లోంచి పోలీస్ బయటికి వచ్చినట్లున్నాడు!"

అవధాని క్లుప్తంగా జరిగింది చెప్పాడు. ఛాయ వెళ్ళిన రెండున్నర నెలల తర్వాత అవధాని వదినతో మాట్లాడటం అదే మొదటి సందర్భం.

✡✡✡

"చాలా రోజుల తర్వాత కలుసుకున్నాం" అన్నాడు అవధాని సుందరితో.

"అవును" అన్నది సుందరి చేతిగోళ్ళకున్న నేచురల్ షేడ్ వంక చూసుకుంటూ.

"నువ్వే రమ్మని పిలిచావు, వచ్చాను, నువ్వే చెప్పాలి ఏదయినా"

"ఛాయ సంగతి నువు చెప్పావు రెండుసార్లు కలిశాం మనం. అప్పటికే నేను ఎటూ నిర్ణయించుకోలేకపోయాను. చివరికో తీర్మానికి వచ్చాను."

"ఏమిటా తీర్మానం?"

"సరిగ్గా ఇవాల్టికి ఇరవై ఏడు రోజుల తర్వాత నా పెళ్ళి" చేతి గోళ్ళవంక చూసుకుంటూనే చెప్పింది సుందరి. అవధాని వంక తలెత్తి చూడలేదు సుందరి. చూస్తే జాలివేసి ఉండేది. చాలా సేపటికి తేరుకుని అన్నాడు అవధాని అతిపొడిగా.

"కంగ్రాట్స్"

థాంక్స్ చెప్పలేదు సుందరి.

"నువు దోషి అయి ఉండొచ్చు, కాకపోవచ్చు. కానీ నువ్వు దోషివేమోనన్న అనుమానం పెనుభూతమయి కూర్చుని నన్ను రోజూ ఏడిపిస్తూంటే సుఖంగా బ్రతకలేను. అది నా బలహీనత. నా బలహీనత నాకు తెలుసు. అనుమానం సంసారంలో వచ్చిందంటే ఆ సంసారంలోకి చీకటి వచ్చినట్లే ... "

సుందరి లేచి బయటికి నడిచింది హోటలులోంచి, అతనితోపాటు. అతను బిల్లు చెల్లించటానికి మాత్రం కౌంటర్ దగ్గర ఆగితే, దూరంగా నిలబడింది.

హోటలు గేటు దాటుతూ అన్నాడు అతను.

"మొదటిసారిగా నాకు ఇప్పుడు మా పెద్ద వదినంటే గౌరవం కలుగుతోంది. కాదు కాదు కలిగింది. దానికి కారణం నువ్వే. నేనే శర్మనయి, నువ్వే శాంతవయితే, ఎప్పుడో వీడ్కోలు అయిఉండేది."

సుందరి అతని మాటలు అర్థం కాలేదు. అర్థం అయేలా చెప్పమని కూడా ఆడగలేదు. ఆమెను ఆటో ఎక్కించాడు అతను.

వెళ్ళిపోతున్న ఆటోవంక చూస్తూ నిలబడిపోయాడూ.

"సుందరి అందమయింది" అనుకున్నాడు అతను చాలాకాలం తర్వాత ఆరోజు.

## 18

తొమ్మిదో నెల ఛాయకి, ఇవాళో, రేపో పురుడు రావచ్చు. ఆ సంగతి ఇంట్లో అందరికీ తెలుసు. టెలిగ్రాం రావచ్చు అనుకుంటున్నారు మనసులోనే.

ముక్కుమీద రెండు వేళ్ళుంచుకుని, కూతురు, కొడుకు అనుకుని, ఓ వేలుని ముట్టుకోమన్నాడు శర్మ ఫ్యాక్టరీలో తన మిత్రుల్ని అంతా ఓ వేలు ముట్టుకున్నారు. ఆరుగురు కొడుకు వేలు, ఎనిమిదిమంది కూతురు వేలు పట్టుకున్నారు.

దీక్ష అర్ధరూపాయి బిళ్ళ పైకి ఎగరవేసి, టేబుల్ మీద పడ్డ అర్ధరూపాయి బిళ్ళమీద అరచేతిని మూసి, బొమ్మయితే అమ్మాయి బొరుసయితే అబ్బాయి అనుకుని చేయి తీసి చూశాడు.

"బొమ్మ!"

పదిసార్లు అలా చేశాడు. ఏడుసార్లు బొమ్మ, మూడుసార్లు బొరుసు, అయినా బిళ్ళని ఎగరేస్తూనే ఉన్నాడు.

అవధాని రెండు చీటీల మీద పాప, బాబు అని రాసి, వాటిని ఆఫీసులో లంచ్ అవర్‌లో టెలిఫోన్ ఆపరేటర్ చేత తీయించాడు.

"బాబు"

కామేశ్వరమ్మ, సోమయాజులు రహస్యంగా ఛాయ సంతానం గురించి చర్చించుకున్నారు మొగో, ఆడోనని.

శాంత ఆ రెండు రోజులూ శర్మ వంక కన్నెత్తయినా చూడలేదు పొరపాటునైనా.

బాబుకి స్నానం చేయించలేదు. ఆఫీసులో సరిగా పనికూడా చేయలేకపోయింది. మధ్యాహ్నం సెలవు పెట్టి, రెండు రోజులూ మేట్నీలకి వెళ్ళింది.

ఆ రెండు సినిమాల్లో ఒకటి మొదటిసారి ఛాయతో చూసిన సినిమా. ఆమె ఆ సినిమా గూర్చి వ్యక్తం చేసిన అభిప్రాయం కూడా గుర్తుకువచ్చింది శాంతకి.

సగటు కన్నెపిల్ల ఊహలని, ఆశలని, అభిప్రాయాలని ఆదర్శాలని కలియజూసి, వాటికి పాత్రలు, సన్నివేశాలు కల్పించి, సినిమాగా తీసి, ప్రజల మీదకి వదిలారు. ఛాయ ఆ సినిమా చూసి తెగ మెచ్చుకుంది. ఆమె దెబ్బ తినడానికి ఇలాంటి సినిమాలు కథలు తోడ్పడి ఉంటాయా?

శాంత ఇంటికి రాగానే సోమయాజులు శాంత చేతిలో పెట్టాడు టెలిగ్రాం. చదివింది.

"నిజంగా? అడిగింది భీతిగా సోమయాజులు వంకచూస్తూ.

"అవును."

"హే రాం."

కుప్పలా కూలిపోయింది శాంత. మోకాళ్ళలో తలదాచుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది, ఏడుపు తన్నుకు వస్తుంటే

ఛాయ చచ్చిపోయింది.

ఎవరూ వెళ్ళలేదు.

నెల్లూరికి, ఛాయ దహనానికి ఎవరూ వెళ్ళలేదు. అన్నదమ్ములు ముగ్గురికీ మనసులో వెళ్ళాలన్న కోరిక ప్రగాఢంగా ఉన్నా వెళ్ళలేదు ఎవరూ. అంతేకాదు.

ముగ్గురూ బయటికి ఎవరికీ తెలిసేలా బాధపడలేదు. ఒంటరిగా, ఎవరూ చూడకుండా, తనివితీరా, రహస్యంగా కడుపారా ఏడ్చారు. దీక్ష స్టూడియోలో, అవధాని పబ్లిక్ గార్డెన్స్‌లో లాన్ మీద పడుకుని, శర్మ నైట్ డ్యూటీ అయాక నాయర్ టీస్టాల్‌లో.

ముగ్గురూ మొహాలు కడుక్కుని, ఏడ్చిన గుర్తులు లేకుండా జాగ్రత్తపడి వచ్చారు ఇంటికి. కానీ తమ ఉబ్బిన కళ్ళని మాత్రం గమనించలేదు ముగ్గురూ.

శాంత గమనించింది. ధైర్యంగా ఇంట్లో ఏడవటానికి కూడా చేతకానివాళ్ళ పరిస్థితికి కొద్దిగా జాలి కలిగింది. సోమయాజులు మాత్రం అట్టే బాధపడలేదు అందరిలాగా.

కామేశ్వరమ్మ స్వంత కూతురు చచ్చిపోయినట్లుగా విలవిలా ఏడ్చింది. ఆవిడని ఎవరూ పట్టలేకపోయారు.

"సత్తెనపల్లి నుంచీ అమాయకురాలిని పిలిపించి మనమే మృత్యువుకి అప్పగించాం. మనం నాశనం అయిపోతాం. ఛాయ ఉసురు మనకి తప్పక తగులుతుంది" ఆవిడ నోటికి హద్దుపద్దులేకుండా ఆవేశంగా మాట్లాడింది. భర్తని, పిల్లల్ని, కోడలినీ అందరినీ ఇష్టం వచ్చినట్టు తిట్టింది. తనను తను తిట్టుకుంది. కానీ నెల్లూరు వెళతాననలేదు.

శాంతకి వెళ్ళాలి అనిపించింది. వెళ్ళకూడదు అనిపించింది. రెండుకోరికలూ సమపాళ్ళలో ఉన్నాయి. కాని చివరికి వెళ్ళలేదు.

సోమయాజులు టెలిగ్రాం మనిఆర్డరు పంపారు ఖర్చులకి, సహజానందంగారికి జరిగింది కుప్తంగా ఉత్తరం వ్రాశారు టెలిగ్రాం అందిన మూడోరోజు.

వర్షాకాలం!

వర్షం వస్తోందన్న మిషతో శాంత, శర్మ, దీక్ష, అవధాని ఎవరూ వెళ్ళలేదు ఇంట్లోంచి బయటకి. కుర్చీల్లో శిలల్లా కూర్చుండిపోయారు.

అర్ధరాత్రి, రహస్యంగా నిశ్శబ్దంగా శర్మ రోదిస్తూంటే శాంత భర్త భుజం మీద చెయ్యి వేసింది. ఉలిక్కిపడి తలెత్తాడు.

"అట్టే బాధపడకండి" అన్నది శాంత.

ఛాయ నెల్లూరు వెళ్ళాక మొదటిసారిగా శర్మని తాకింది ఆ రాత్రి.

మొదటిసారిగా పలకరించింది.

"ఛాయ ఇన్నాళ్ళు మనతో ఉండటం వల్ల వద్దనుకున్నా ఆపుకోలేను ఏడుపు" శర్మ చెప్పాడు తొట్రుపాటుగా.

"మీ ఇంట్లో, మీగదిలో ఏడవడానికి కూడా ధైర్యం లేకపోతే ఎలా? తనివితీరా ఏడవకండి. కానీ రహస్యంగా కాదు, లేకపోతే ఛాయ ఆత్మ క్షోభిస్తుంది."

ఛాయకి కొడుకు పుట్టాడు. నాలుగు కేజీల బరువున్నాడు. ఛాయలాగే చామన ఛాయ. పదకొండో రోజు సోమయాజులు, శాంత నెల్లూరు వెళ్ళారు.

"ఇలా జరుగుతుందనుకోలేదండీ! ఛాయ మొదటి నుంచీ భయపడుతూనే ఉంది. కానుపు సరిగ్గా అవుతుందో లేదోనన్న భయం ఒకటి. కానుపుతో తాను చచ్చిపోతాననే పిచ్చి భయం ఒకటి."

"ఎలా జరిగింది?" అడిగింది శాంత నిర్లిప్తంగా. శాంత పిన్నత్తగారు చెప్పారు.

"అర్ధరాత్రి నొప్పులొస్తున్నాయంటే డాక్టర్ దగ్గరకి తీసుకెళ్ళాము. ఆ క్రితం వేరే డాక్టరు పరీక్ష చేసి, ఒకటి రెండు రోజుల్లో నొప్పులొస్తాయని రాకపోతే వచ్చేందుకు మందిస్తానని చెప్పింది.

"అర్ధరాత్రి చేర్పించాము. తెల్లారిన తర్వాత ఆరున్నరకి వచ్చింది పురుడు. కానుపు మామూలుగానే అయింది సహజంగానే, ఆయుధాలేమీ ఉపయోగించకుండానే, నాలుగయిదు కుట్లు పడ్డాయంతే."

కాసేపు ఆగిపోయి మళ్ళీ చెప్పింది శాంతకి, పిన్నత్తగారు.

"పురుడు వచ్చిన రెండు గంటలకి వాతం కమ్మి చచ్చిపోయింది. అసలు నమ్మలేకపోయాము. ఇంత చిన్న వయస్సులో చచ్చిపోతుందనుకోలేదు. శవాన్ని చూస్తే ఎవరూ నమ్మలేరు చచ్చిపోయిందంటే. నిద్రపోతుంది అనుకుంటారు. చచ్చిపోయినా ముఖం మీద ఆ జీవకళ, తృప్తి, సంతోషం చెక్కుచెదరలేదు. నాలుగయిదు రోజులు వరుసగా నిద్రపోని వాళ్ళు ఎంత గాఢంగా నిద్రపోతారో, అంత గాఢంగా నిద్రపోతుంది. లేపితే లేస్తుంది అనిపించేలా ఉంది శవం."

ఆవిడ కళ్ళలో నీళ్ళు తిరిగాయి చెపుతుంటే. శాంతకి ఏడుపు రాలేదు.

"మీకు టెలిగ్రాం ఇచ్చాం. రాత్రిలోపల రాలేరని తెలుసు. అందుకే సాయంత్రం, సూర్యాస్తమయానికి అరగంట ముందు స్మశానికి తీసుకెళ్ళాము. దహనం అవుతుండగా సూర్యుడు అస్తమించాడు. స్మశానానికి వెళ్ళడం ఇదే మొదటి సారి నాకు. అబ్బ అక్కడ ఎంత విచారం కాపురం చేస్తుంటుంది? కొత్త వాళ్ళయినా కళ్ళు చెమరుస్తాయి."

"నిజం, నేనోసారి వెళ్ళాను. నాకు నాన్నలేరు."

"సత్తెనపల్లిలో పుట్టి పెరిగింది, ఇక్కడ రాసి పెట్టి ఉంది కాబట్టే ఈ నేలలో కలిసిపోయింది. నెల్లూరి నేలకి ఛాయ ఏ జన్మలోనో బాకీపడి ఉంటుంది. పిచ్చిపిల్ల."

"పిల్లాడు ఎవరిపోలికో చెప్పగలరా?"

"అప్పుడే ఏం తెలుస్తుంది, మూడో నెలయినా రానిదే?"

కాసేపాగి అడిగింది.

"ఛాయ చెప్పిందా మీకు ఏమయినా?"

"ఆ సంగతా?"

"అవును"

"చెప్పలేదు, చాలాసార్లు నయాన, భయాన అడిగి చూశాను, కానుపయ్యాక చెపుతానంది. కానుపులో తనో, పుట్టేవాళ్ళో చచ్చిపోతామనే భ్రమ ఉండేది ఛాయకి మొదటి నుంచీ"

"నాకు తెలియదే!

"అప్పుడప్పుడు అరచేయి చూసుకుంటుండేది, ఓసారి ఎందుకని అడిగాను, చిన్నప్పుడెప్పుడో ఎవరో జ్యోతిష్కుడో, కోయవాడో చెప్పాడట, మొదటి కానుపులో, తల్లో, పిల్లో ఇద్దరిలో ఒకరే బ్రతుకుతారని, ఆ పిల్ల మనసులో అది బాగా నాటుకున్నట్లుంది.

"అయితే చెప్పనేలేదన్నమాట" నిస్పృహగా అన్నది శాంత.

"లేదు"

"తెలుసుకోవాలనే పట్టుదల ఇంకా ఎక్కువయింది ఇప్పుడు నాలో?"

"కానీ ఎలా? ఇప్పుడసలు చెప్పరే వాళ్ళు."

"అదే ఆలోచిస్తున్నాను" అన్నది శాంత.

సోమయాజులు శాంతని సంప్రదించాడు.

"పిల్లాడిని ప్రస్తుతానికి ఇక్కడే ఉంచి, ఏ అనాధ శరణాలయంలోనో చేర్పించేద్దామనుకుంటున్నానమ్మా."

"మీకు అందుకు మనసు వప్పుతోందా?" అడిగింది

"కన్న తండ్రికి లేని దయ నాకు ఉండాలా?"

"మరి తాత! తండ్రికి దయలేకపోతే, తాతకయినా ఉండదా కనీసం?"

బాధగా ముడుచుకున్నాయి ఆయన కనుబొమ్మలు.

"ఏం చేద్దాం? నీ సలహా ఏమిటి?"

"హైదరాబాద్ తీసుకువెళదాం"

"నీకు సమ్మతమేనా?" ఆశ్చర్యంతో కూడిన ఆనందంతో అడిగాడు సోమయాజులు.

"సమ్మతమే."

"నాకంతకంటే కావల్సింది లేదు"

"మూడో నెల వచ్చేదాక ఇక్కడే ఉంచేద్దాం. తర్వాత తీసుకువెళదాం. మూడోనెల వస్తే కానీ చిల్డ్రన్ సెంటర్‌లో తీసుకోరు పిల్లల్ని అక్కడ. బాబుతోపాటే వాణ్ణీ దిగబెట్టొచ్చు అక్కడ ఉదయం"

"ముందే తీసుకెళ్ళి అక్కడే ఎవరి దగరయినా..."

"అలాగే కానివ్వండి."

"కానీ ఎక్కడ, ఎవరింట్లో ఉంచటం?"

"అది మీరు చెప్పాలి"

ఆయన కాసేపు ఆలోచనలోపడి అన్నాడు.

"కామేశ్వరి చూసుకుంటుంది. అక్కడా ఇక్కడా ఎందుకు?"

"మీ ఇష్టం కాని ముందు నేనో నెలరోజులు సెలవపెడతాను.

"దేనికి?"

"వీడికోసమే"

సోమయాజులు కళ్ళు ఆనందంతో మిలమిల లాడటం గమనించి జాలిపడింది శాంత.

"మంచిది" అన్నాడు

"ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా టిక్కెట్టు రిజర్వ్ చేయించండి హైదరాబాద్‌కి"

"రైల్లో అయితే బావుంటుందేమో? ఇంత పసికందుతో అయితే ఇబ్బందేమో?"

"నేను ఇబ్బందిపడతాను బస్సే."

"నువ్వు కాదమ్మా పసివాడికి ఇబ్బందేమోనని."

"ఫర్వాలేదు."

శాంత పిన్నత్తగారు ఓ విచిత్రమయిన సంగతి చెప్పింది శాంతకి.

"ఛాయ పేరుమీద నాలుగయిదుసార్లు రిజిష్టర్ పోస్టు పార్సెల్స్ వచ్చాయి. ఎవరు పంపారో తెలిసేది కాదు. ఓసారి చీర, 'ఇంటిమేట్' పెర్ఫ్యూం. ఓసారి ఏపిల్ పళ్ళు వచ్చాయి. పంపినవారి పేరు ఉండేది కాదు పార్సిల్ మీద?"

"హైదరాబాద్ నుంచేనా?"

"అవును ఆ పార్సిల్స్ దాచాను."

"మంచిపని చేసాను. వెళ్ళేటప్పుడు తీసుకువెళతాను."

"ఛాయకి తెలిసే ఉండాలి ఎవరు పంపారో"

"ఇంకెవరు. ఆ త్రిమూర్తులలో ఒకరిపని ఇది. ఆ చీర, ఫెర్ఫ్యూం బాటిల్ మిగతాది కూడా తీసుకెళతాను. వాటితో పనుంటుంది నాకు."

"అలాగే తీసుకువెళ్ళు, ఇప్పుడే ఇస్తాను పెట్టెలో పెట్టుకో."

బస్సులో ముగ్గురు హైదరాబాద్ చేరుకున్నారు.

✡✡✡

## 19

టాక్సీలో ఇల్లు సమీపిస్తుండగా చెప్పింది శాంత.

"మరో నెలరోజులదాకా సెలవ పెడతానని చెప్పాగా మీకు?"

"అవును."

టాక్సీ దిగి సోమయాజులు ఇంట్లోకి నడిచారు. డబ్బు శాంత దగ్గర ఉంది ఫేర్ చెల్లించి లోపలికి నడిచింది ఛాయ కొడుకుతో.

అన్నదమ్ములు ముగ్గురు దృష్టి శాంత చేతిలోని ఛాయ కొడుకు మీద పడింది. శాంత చేతిలోని ఛాయ కొడుకు కనబడలేదు వాళ్ళకి. పిల్లాడు కనబడకుండా మిల్లీమీటర్ భాగమయినా కనబడకుండా శాంత పిల్లాడిని సన్నటి బట్టలో చుట్టేసింది.

సరాసరి తన గదిలోకి వెళ్ళిపోయింది. వెళ్ళి మంచం మీద ఛాయ కొడుకును పడుకోబెట్టి, బాబుని బయటికి పంపించి, లోపలికి తన భర్తగానీ, మరెవరూ రాకుండా తలుపేసింది.

శాంత పోస్టులో నెలరోజుల సెలవకి అప్లికేషన్ పంపించింది. సాధారణంగా అయితే స్వయంగా ఆఫీస్‌కి వెళ్ళి దగ్గరుండి, కారణం చెప్పి ఆఫీసర్ చేత శెలవు మంజూరు చేయించుకునేది.

కానీ ఈ సారి అలా వెళ్ళలేదు. సెలవు మంజూరు కాకపోతే జీతం రాదని తెలిసినా బాధపడలేదు. ఓ నెల జీతం మామూలు పరిస్థితుల్లో అయితే వదులుకునేది కాదు శాంత.

లీవ్ అప్లికేషన్ భర్తకి ఇచ్చి పోస్ట్ చేయమని చెప్పింది, నెల్లూరు నుంచీ ఇంటికి తిరిగి వచ్చిన గంటలోనే. భర్తకి తీసుకురావల్సిన సరుకుల జాబితాని కూడా ఇచ్చింది. గ్లాస్కో డబ్బా, పాలతిత్తి, బేబీ పౌడర్ లాంటి సరుకులవి. ఛాయ కొడుకుకు అవసరమయ్యేవి.

"డబ్బు లోపలుంది. నువ్వు అడ్డు జరిగితే తీసుకుంటాను" అన్నాడు శర్మ, ఆ రెంటినీ జేబులో ఉంచుకుని.

"ఎక్కడుంది?" అడిగింది శాంత.

"డ్రాయర్‌లో ఉంది పర్స్"

"ఆగండి"

శాంత భర్త మొహం మీదే తలుపు వేసి, లోపల గడియ పెట్టుకుంది. టేబుల్ దగ్గరకి వెళ్ళి, డ్రాయర్ తెరచి పర్సు తీసుకుని మళ్ళీ గుమ్మం దగ్గరకు వెళ్ళి తలుపు తీసి భర్త చేతిలో ఉంచింది పర్సుని.

శర్మ కొద్దిగా ఆశ్చర్యంగా, దిగ్భ్రమచెందినట్లుగా ముఖం పెట్టి చూశాడు శాంత వంక.

శర్మ సరుకులు తీసుకుని అరగంట తర్వాత తిరిగి వచ్చాడు. సంచీ అందించి షిఫ్టు బస్సు అందుకోవటానికి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి వంటవాడు భోజనానికి పిలిచినప్పుడు శాంత పిల్లవాడిని గదిలో మంచం మీదే వదిలి, తన గది తలుపు గొళ్ళెం పెట్టి తాళం వేసి వంటగదిలోకి వెళ్ళింది.

మరుదులిద్దరికీ వదిన ప్రవర్తన విచిత్రంగా అనిపించింది. భోజనం త్వరగా కానిచ్చి, మళ్ళీ శాంత తన గదిలోకి వెళ్ళిపోయింది.

✡✡✡✡

క్రమంగా శాంత ప్రవర్తన అర్థం అవసాగింది, ముగ్గురన్నదమ్ములకీ కారణం కూడా గ్రహించగలిగారు.

నెల్లూరు నుంచీ ఛాయ కొడుకుతో తిరిగివచ్చాక శాంత, శర్మ తాలూకు బట్టలు, వస్తువులు, పక్కబట్టలు అన్నీ ఇదివరలో ఛాయ ఉండే గదిలోకి మార్చేసింది.

"ఇవాళ్టి నుంచీ నేను చెప్పేదాకా మీరు నా గదిలోకి రాకూడదు" స్థిరంగా చెప్పింది శాంత శర్మకి, ఎందుకలా చేశావని అడగగానే.

"దేనికి?" ఆశ్చర్యంగా అడిగాడు శర్మ.

"త్వరలోనే తెలుస్తుంది"

"పిచ్చి పిచ్చిగా ప్రవర్తించక మొగుడనే వాడు..."

"అనవసరం" తొణకకుండా, ఇంకా స్థిరంగా అన్నది శాంత. అని భర్త మొహం మీదే తన గది తలుపు వేసింది"

ఎక్కువకాలం ఆ గదిలోనే గడుపుతోంది. స్నానం, భోజనం లాంటి నిత్యావసరాలకే బయటికి వెళుతుంది గదిలోంచి. వెళ్ళేటప్పుడు గది తలుపు గొళ్ళెం పెట్టి, గాడ్రెజ్ నవతాళ్ సెవెన్‌లివర్స్ తాళం వేసి, సరిగ్గా పడిందో లేదో లాగి మరీ చూసి వెళుతుంది ఆ సమయాల్లో.

మొదటి రెండు రోజులు శర్మ భోజనాల దగ్గర అందరిముందు అరిచాడు శాంత మీద గట్టిగా. తనని కాదన్నట్లుగా శాంత పట్టించుకోలేదు. శర్మ నాలుగోరోజునుంచీ శాంతతో మాట్లాడ్డం మానేశాడు.

తనని గదిలోకి రానిస్తేకానీ ఇక మాట్లాడనన్నాడు. తన కసలు పెళ్ళేకాలేదు అనుకుంటానన్నాడు. ఈ విధంగా తనను వెలివేయడంకంటే భార్యనుంచీ పొందే నీచం మరింకేం ఉండదన్నాడు. ఈ కాలంలో అంటరాని వాళ్ళని కూడా ప్రజలు అంతదూరంలో ఉంచటం లేదన్నాడు. అక్కసు కొద్దీ ఇంకా చాలా అరిచాడు.

కానీ శాంత తనని ఎందుకు గదిలోకి రానివ్వటం లేదో అర్థం అవగానే నోరెత్తలేదు.

ఆ ఇంట్లో అందరికీ శాంత ఆంతర్యం అవగాహన అయింది అతి త్వరలోనే.

మొదటిసారి ఛాయ కొడుకుని ఆ గదిలోకి తీసుకు వెళ్ళిన దగ్గరనుంచీ, శాంత ఆ పసికందుని బయటకి తీసుకురాలేదు ఎప్పుడూ. ఖైదీలాగా ఆ గదిలోనే ఉన్నాడు వాడు.

శాంత తన స్నానం అయాక ప్లాస్టిక్ బేసిన్ నిండా వేడినీళ్ళు తీసుకుని గదిలోకి వెళుతుంది. గదిలోనే ఛాయ కొడుకుని స్నానం చేయిస్తుంది. పాలు, నిద్ర ఆట అన్నీ వాడికి ఆ గదిలోనే.

ఛాయ కొడుకు ఆ గదిలోకి ప్రవేశించాక, శాంత కొడుకు బాబు తప్ప మరెవ్వరూ ఆ గదిలోకి అడుగుపెట్టలేదు. నాలుగయిదుసార్లు కామేశ్వరమ్మ ప్రయత్నించింది కానీ శాంత అందుకు అనుమతించలేదు.

కోడలి మీద కోపంతో మాట్లాడ్డం మానేసింది కామేశ్వరమ్మ శర్మలాగానే. అత్తగారి కోపం గ్రహించి, ఛాయ కొడుకు నిద్రపోతున్నప్పుడల్లా రోజూ అత్తగారి దగ్గర ఓ గంట కూర్చోవటం మొదలు పెట్టింది శాంత.

మొదట మొదట ముభావంగా ఉన్నా, త్వరలోనే కామేశ్వరమ్మకి శాంతిమీద వాత్సల్యం తిరిగి వచ్చింది. కోపం క్రమంగా క్షీణించిపోయింది.

శాంత అవధాని చేత కానీ, ఎదురింటి పిల్లలచేత కానీ దగ్గరేవున్న సిటీ లైబ్రరీనుంచి పుస్తకాలు తెప్పించుకునేది. గదిలో రోజుకో పుస్తకం చొప్పున చదివేసేది వేరే కాలక్షేపం లేకపోవడం వల్ల.

లేదా పత్రికలలో ప్రచురించిన వాటిమీద విమర్శావ్యాసాలు, ఉత్తరాలు వ్రాసి పంపుతూంటుంది.

ఉదయం ఎప్పుడయినా ఆ గది కిటికీ తలుపులు తెరిచేది శాంత. అలా తెరిచినప్పుడు మాత్రం కిటికీలోంచి ఎవరయినా అకస్మాత్తుగా చూస్తే ఛాయ కొడుకు కనబడకుండా దోమతెర వేసి ఉంచేది దోమ తెరకున్న పల్చటి పొరల్లోంచి, లీలగా వాడి ఆకారం కనబడుతుందనే భయంతో కిటికీవేపు తెరమీద దుప్పట్లో, టవల్సో కప్పిపెట్టేది.

అన్నదమ్ములు ముగ్గురుకీ అర్థం అయింది శాంత ఆంతర్యం.

ఛాయ కొడుకుని ఆ ముగ్గురూ, ఆ ముగ్గురిలో ఎవరూ చూడకుండా జాగ్రత్త పడుతోంది శాంత. అర్ధరాత్రి ఛాయ కొడుకు ఎప్పుడయినా నిద్రలో ఏడిస్తే, ఆ ఏడుపు మాత్రం వరండాలో పడుకున్న దీక్షకి, ఛాయ గదిలో నైట్ డ్యూటీ లేక పడుకున్న శర్మకి, మధ్య హాల్లో పడుకున్న అవధానికి గోలగా వినిపించేది.

ఆ ఏడుపు, అరుదుగా వినిపించే ఆ ఏడుపు తప్ప, ఛాయ కొడుకు గురించి ఆ ముగ్గురికిగాని, ఆ ఇంట్లో మరెవరికి కానీ ఏమీ తెలియదు.

ఎలా ఉంటాడో, ఛామనఛాయో, రంగో ఎలా నవ్వుతాడో, ఛాయ పోలిక అవునో కాదో, ఎవరి పోలికయినా వచ్చిందో లేదో? ఏమీ తెలియదు ఆ ముగ్గురికీ ఛాయ కొడుకు గురించి.

"నేను చూస్తాను, నాకు చూడాలని ఉంది. నాకు చూపించు" అని గట్టిగా ఎవరూ అడగలేకపోయారు. అంత ధైర్యం, సత్తా లేకపోయాయి ముగ్గురికీ.

అలా అడుగుతే, ఎవరూ అడకుండా తనొక్కడే అలా అడుగుతే "నీ కొడుకు కాకపోతే నీకెందుకంత మక్కువ, ఆమె కొడుకుని చూడటానికి? లోపలికి రా. తనివితీరా చూడు" అని శాంత అంటుందని తెలుసు ఆ ముగ్గురికీ.

అందుకే శాంతతో కానీ, మరెవరితోకానీ, తమలో తాము ఛాయ కొడుకు ప్రస్తావన తీసుకురాలేదు.

ఓ రోజు శాంతకి మనియార్డరు వచ్చింది. స్వంత చిరునామా ఉండాల్సిన ఆ చోటవున్న ఎడ్రస్ చూసింది శాంత. చూడగానే గుర్తించింది. అది తప్పు ఎడ్రసు అని.

ఆ డబ్బు పంపిన వ్యక్తి పేరు గలవాళ్ళెవరూ ఆమెకి పరిచయం లేరు. ఏదో పేరు నింపాలి కాబట్టి ఓ పేరు వ్రాసారు. ఏదో చిరునామా ఇవ్వాలి కాబట్టి ఓ చిరునామా ఇచ్చారు.

వంద రూపాయలు సంతకం పెట్టి తీసుకుంది. మనియార్డర్ కూపన్ మీద వ్రాసి ఉన్న ఇంగ్లీష్ వాక్యాలు చదివింది. చేతివ్రాత కాదది. నీట్ గా టైప్ చేయబడి ఉంది.

ఫారంలో పంపేవాళ్ళ సంతకం ఉండాల్సిన చోట నాలుగయిదు అర్థం పర్థంలేని గీతలున్నాయి.

మనియార్డర్ కూపన్ చదివింది శాంత.

"దయచేసి ఈ వందరూపాయలు పెట్టి ఛాయకొడుకుకి - మీ కొడుకుకి - కావల్సిన వస్తువులు కొనండి. మీ డబ్బు వృధా చేసుకోవద్దు."

పోస్ట్‌మేన్‌కి ఏభై రూపాయలు అందించింది శాంత.

"దేనికీ?" అడిగాడు అతను ఆశ్చర్యంగా.

"టిప్"

"ఇంత?" అదిరిపడ్డాడు.

ఆమె లోపలికి వెళ్ళిపోయింది. చేతిలోని ఏభైరూపాయలవంక చూసుకుని, ఓసారి భుజాలెగరేసి, బయటకి నడిచాడు పోస్ట్‌మేన్.

ఆ రాత్రి భోజనాలముందు అంతా కూర్చున్నాక శాంత లేచి నిలబడి చెప్పింది.

"ఇవాళ నాకు ఛాయ కొడుకు తండ్రి వందరూపాయలు మనియార్డర్ పంపించాడు. తన కొడుకు కోసం నన్ను డబ్బు ఖర్చు చేయవదని, ఆ వంద వాడుకోమని పంపాడు"

"నిజమా?" అడిగింది కామేశ్వరమ్మ తెల్లబోతూ. సోమయాజులు తన కొడుకుల మొహాలకేసి చూశాడు నిశితంగా ఉండిపోయారు. "ఆ డబ్బు ఎలా ఖర్చు పెట్టాలో నాకు తెలుసు. ఆ వందలో ఏభై రూపాయలు పోస్టుమేన్‌కి టిప్‌గా ఇచ్చాను."

సోమయాజులు కొడుకులవంకే చూస్తున్నాడు. ముగ్గురు నిర్వికారంగా కూర్చున్నారు.

"నా జీవితంలో నా చేత పోస్టుమేన్‌కి అంత పెద్ద టిప్ ఇప్పించినందుకు సంతోషం."

సోమయాజులు తన దృష్టి మరల్చలేదు కొడుకుల మీదనుంచి.

"చిన్నప్పటినుంచీ నాకో వింత కోరికుండేది. నాకున్న అనేక వింత కోరికల్లో ఇది ముఖ్యమయింది. పదిరూపాయల కాగితాలని పరపరా చింపేయాలన్నది నా కోరిక, మన దేశంలో ఉన్న కోట్ల మందిలో అలా మనస్ఫూర్తిగా చేయగల వాళ్ళని వేళ్ళ మీద లెక్కపెట్టవచ్చు."

తెల్లబోయి చూస్తున్నాడు వంటవాడు కూడా. ఆమె అయిదు పది రూపాయల నోట్లని బయటకి తీసి వాళ్ళ కళ్ళముందే పరపరా చింపేసింది. ముక్కలు ముక్కలుగా, క్రోధంగా, కోపంగా.

సోమయాజులు రెప్పవాల్చకుండా కొడుకుల వంక చూశాడు. ఆయనకి ఎవరిలోనూ ఎలాంటి చలనం కనబడలేదు. ఎవరికీ కనుబొమ్మలు కోపంతో ముడుచుకోలేదు. ఆశ్చర్యంతో రెప్పలు అల్లల్లాడలేదు. పెదిమలు బిగించుకోలేదు ఎవరూ.

ఏం జరగనట్లు కూర్చున్నారు.

"ఇప్పుడా కోరిక తీరింది."

శాంత రౌద్రంగా చూసింది ముగ్గురివంకా.

"అండర్ స్టుడ్? ఇంకోసారి ఇలాంటి పిచ్చి పిచ్చి వేషాలు వేయక, మొగాడయి పుట్టి కూడా సిగ్గులేదూ? స్వంత కొడుకుని చూసుకోవాలనే తపన, ప్రేమలేని నువ్వు ఉత్తకాముకుడివి నీచుడివి, ఛాయ దేహం నీకు ముఖ్యం కాని, నీవల్ల పుట్టిన నీకొడుకు కాదు. వాడు నీకేం కాదు. ఓ వంద వాడి మొహాన తగలేస్తే నీ మనసుకి శాంతి లభిస్తుందనుకున్నావా? లభించదు. నన్ను ఇంత క్షోభపెట్టి నా చేత కన్నీళ్ళని తెప్పించిన నువ్వు అందరిలా చావవు. యు విల్ డై లైకే డాగ్... లైఏ పిగ్. యు ఆర్ బార్బరస్. ఐ హేట్ యు యు ఆర్..."

శాంత కోపం, రౌద్రం, ఆవేశం అన్నాళ్ళుగా దాచుకుంటున్నవి దుఃఖంలోకి దిగాయి. ఇక భరించలేకపోయింది. కుండ పగిలినట్లుగా కూలబడిపోయింది. నేలమీద పడుకుని వెక్కి వెక్కి విలవిలా, చంటిపిల్లలా, గట్టు తెగిన చెరువులా, గుండెలో కాల్చిన కత్తి దిగిన మనిషిలా ఏడుస్తోంది శాంత. ఇక మాట్లాడలేక.

కామేశ్వరమ్మ అపర కాళిలా రూపం దాల్చిన శాంతిని చూసి భయపడిపోయింది. కానీ అంతలోనే పసిపిల్లలా నేలమీద పడుకుని ఏడుస్తున్న శాంతని చూశాక జాలి ప్రేమ ముంచుకొచ్చాయి.

శాంత తలని తన ఒళ్ళోకి తీసుకుని, నిమురుతూండిపోయింది. "ఊరుకోమ్మా ఊరుకో" అంటూ.

సోమయాజులు ఇంత జరిగినా ఓ క్షణకాలం కూడా శాంత వైపు చూడలేదు. తన చూపును ఆ ముగ్గురు కొడుకుల మీద కేంద్రీకరించి చూస్తుండిపోయాడు వాళ్ళనే.

ఆ ముగ్గురూ అలాగే శిల్లా ప్రాణం లేని బొమ్మల్లా కూర్చున్నారు చెవులప్పగించి వింటూ.

వంట వాడికి ఆ పరిస్థితిలో ఏం చేయాలో తెలియక బయటికి వెళ్ళిపోయాడు.

దాదాపు పావుగంట దాకా నిశ్శబ్దం తాండవం చేసింది వంటగదిలో, వాళ్ళ మధ్య. ఎవరూ దగ్గనయినా దగ్గలేదు. క్రమంగా శాంత ఏడుపు ఆపుకుంది.

ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ శాంత గదిలోంచి ఛాయ కొడుకు ఏడుపు వినిపించసాగింది అలలు అలలుగా.

శాంత లేచి నిలబడి, కళ్ళని, బుగ్గల్ని పైట చెంగుతో తుడుచుకుని "అయామ్ సారీ. ఇంకెప్పుడూ ఇలా అరవను" అని వెళ్ళిపోయింది.

ఆ రాత్రి వంటవాడు చాలా అన్నం - ఆరుగురికి సరిపడే అన్నం తన ఇంటికి తీసుకెళ్ళాడు.

## 20

ఆ సంఘటన జరిగిన తర్వాత నాలుగయిదు రోజులు ఆ ఇంట్లో ఓ రకమైన ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. తల్లితో కొడుకు, కొడుకుతో తండ్రి, వదినతో మరిది, కోడలితో అత్త, మామతో కోడలు ఎవరూ ఎవరితో మాట్లాడుకోలేదు.

శాంతకి నాలుగురోజుల తర్వాత ఓ కవరు వచ్చింది. చింపి చదివింది. తన చిరునామా టైప్ చేసివున్న ఆ కవరుని చింపి ఉత్తరం తీసి చదివింది. ఇంగ్లీషులో టైప్ చేసి ఉంది ఉత్తరం. కింద సంతకం లేదు పైన తనని సంభోదిస్తూ కూడా ఏమీ వ్రాసి లేదు.

ఒకే ఒక వాక్యం ఉంది. చాలా పెద్ద వాక్యం "మీకు తీరని మనస్తాపం, ఇంట్లో అశాంతి కలిగిస్తున్న నేను క్షంతవ్యుణ్ణి, మిక్కిలి దురదృష్టవంతుడిని, ఛాయ కొడుకుని మనసారా ప్రేమించే తండ్రిని, పిరికివాణ్ణి, కనీసం ఈ ఉత్తరాన్నయినా బాబుకి తాకించండి (దీన్ని ముద్దు పెట్టుకుని పోస్ట్ చేస్తున్నాను)

ఆ ఉత్తరం చదువుకుని దిగులుగా నవ్వుకుంది శాంత.

ఆ ఉత్తరాన్ని కాసేపు ఆలోచించి చింపేసింది శాంత. ముక్కలని హాల్లో టేబుల్ మీద అందరికీ కనపడేలా కుప్పగా పోసింది శాంత.

నెలరోజులు గడిచాయి. శాంత సెలవు గడువు ఆ మర్నాడే పూర్తవుతుంది.

"అవును నాకు తెలుసు" చెప్పింది శాంత.

"శెలువు పొడిగించేటట్లయితే అప్లికేషన్ వ్రాసియ్యి కొత్తది. పోస్టు చేస్తాను" చెప్పాడు శర్మ పొడిగా.

చిన్నగా నవ్వింది శాంత. క్రమంగా ఆ నవ్వు పెద్దదయి పోయింది. పగలబడి నవ్వింది.

నొచ్చుకోలేదు శర్మ.

"ఆ నవ్వు సమాధానం అయితే, నాకు ఆ నవ్వులో అర్థం కనబడలేదు" చెప్పాడు.

శాంత నవ్వు నాపుకుని చెప్పింది.

"కనబడదు నాకే తెలియదు కనుక. వచ్చింది, నవ్వానంతే."

"ఇప్పుడు ఆగింది నా ప్రశ్నలకు సమాధానం?"

"రిజైన్ చేద్దామనుకున్నాను"

అదిరిపడ్డాడు శర్మ.. శాంత మొహంలోకి నమ్మలేనట్లుగా చూస్తూ అన్నాడు.

" ఆ ఉద్యోగం పోతేరాదు మళ్ళీ. జీవితాంతం ఛాయ కొడుకుతోనే. ఇలాగే గడుపుతావా? అది సాధ్యమా?"

"చాలా రోజుల తర్వాత ఈ ఇంట్లో ముఖ్యంగా మీ నోటివెంట విన్నాను ఛాయ పేరు."

"మనం నీ ఉద్యోగం గురించి మాట్లాడుతున్నాం"

"కాదు. ఛాయ కొడుకుని గురించి, ఇంకోవారం పొడిగిస్తాను శెలవు"

"నీ ఇష్టం."

"శెలవు లేదింక, అయినా తప్పదు."

"నీ ఇష్టం."

రెండూ రోజుల తర్వాత శాంత చెప్పింది భోజనాల దగ్గిర ముగ్గురన్నదమ్ములుండగా.

"నిన్నటినుంచి ఛాయ కొడుక్కి జ్వరంతో ఒళ్ళు కాలిపోతోంది. ధైర్యం ఉంటే ఛాయ కొడుకు తండ్రి... సారీ, ధైర్యం కాదు, ప్రేమ ఉంటే ఛాయ కొడుకు తండ్రి వెళ్ళి డాక్టర్‌ని పిల్చుకు రావడం ధర్మం. పచ్చకామెర్లని డాక్టర్‌తో చెబితే మరీ మంచింది."

"మనమే తీసుకు వెళదాం" అన్నది కామేశ్వరమ్మ వెంటనే.

"చస్తే అలా చేయను. మీకిష్టం లేదంటే ఈ క్షణంలో మొత్తం వదిలేసి వెళతాను, ఛాయ కొడుకుని తీసుకు మరీ వెళతాను. మళ్ళా తిరిగిరాను. నా బాబు కోసం కూడా రాను. ఈ ఇంట్లో మొండివాళ్ళు ఇద్దరున్నారు. ఛాయ కొడుకు తండ్రి, నేను. ఇప్పుడే చెపుతున్నాను డాక్టరుని స్వయంగా తీసుకురాకపోతే ఛాయ కొడుకు చచ్చిపోతే శవాన్ని చూడాల్సొస్తుంది. అందుకు నేను బాధ్యురాలిని కాను. డాక్టర్ వంటరిగా వస్తే ప్రవేశం లభించదు నా గదిలోకి.

ఆ గదిలో, సూర్యరశ్మి లేక ఇంతకాలం ఉండటం వల్ల వచ్చినట్లుంది పచ్చకామెర్లు. నేను ఆ గదిలోకి వెళ్ళను డాక్టర్ వచ్చేదాకా అంటువ్యాధది.

శాంత తాళం తెరిచి ఆ గదిలోకి వెళ్ళలేదు సాయంత్రం దాకా, నాలుగయిదుసార్లు లోపలనుంచి ఛాయ కొడుకు ఏడుపు వినిపించింది. అంతా విన్నారు. కానీ ఎవరూ ఏం మాట్లాడలేదు.

శాంత చలనం లేని బొమ్మలా పుస్తకం చదువుకుంటూ కూర్చుంది.

అవధాని బయటకెళదామని లేవబోయాడు.

శాంత పుస్తకంలోంచి అంది, అవధాని బయటికి వెళ్ళే ప్రయత్నంలో ఉండటం చూసి

"ఛాయ కొడుకు తండ్రి, తన కొడుకు ఏడుపుని భరించలేని పక్షంలో, బయటికి వెళ్ళాలనుకుంటే నా కభ్యంతరం లేదు." అవధాని ఆగిపోయాడు.

సాయంత్రం అయింది. రాత్రయింది. ఎవరూ బయటకు కదలలేదు. శాంత పుస్తకం వదలలేదు. ఆ హెరాల్డ్ రాబిన్స్ లావుపాటి పుస్తకం చదువుతూనే ఉంది.

లోపలనుంచి ఏడుపు వినబడటం లేదు చాలాసేపటి నుంచి.

శాంత ఠక్కున పుస్తకం నేలకేసి విసిరికొట్టి అన్నది కంటినిండా నిండిన నీరుతో.

"ఛీ హృదయం, ప్రేమలేని ఈ ఇంట్లోకి బానిసగా, భార్యగా రావటం నేను ఏ జన్మలోనో చేసుకున్న పాపం."

తాళం తెరచుకుని లోపలికి వెళ్ళి తలుపు లోపల గడియ పెట్టింది.

బయటకెళదామనుకున్నారు ముగ్గురూ. వేగంగా తలుపు తెరచి, గుమ్మం మీద కూలబడి, మోకాళ్ళలో మొహం దాచుకుని చెప్పింది శాంత.

"దుర్మార్గురాల్ని, నన్ను మీరంతా కలిసి శిక్షించండి. ఛాయ కొడుకు పోయాడు."

స్తబ్ధత, నిశ్శబ్దం.

చేతులెత్తి అందరికీ దణ్ణం పెడుతూ అన్నది. "చచ్చిపోయాడు కసాయిదాన్ని నేను. నా కభ్యంతరం లేదు. ఎవరయినా వెళ్ళి ఏర్పాటు చూడండి. ఛాయ కొడుకు తండ్రి అయితే మరీ సంతోషిస్తాను. నా కళ్ళముందునుంచీ తీసుకుపొండి ఆ పసికందుని."

ఎవరూ కదలలేదు. ముగ్గురూ కుర్చీలకి అతుక్కుపోయినట్లుగా కూర్చున్నారు.

"వెళ్ళరా?" లేచి నిలబడి గద్దించింది శాంత. "కొడుకు అంతిమయాత్ర ఏర్పాట్లు చేయడానికయినా వెళ్ళరా? అబ్బ ఎంత ఎడారి హృదయం? ఆ తండ్రి హృదయంలో ఎంత ఎండకాస్తోంది?"

ఎవరూ చిటికెన వ్రేలయినా కదపలేదు.

శాంత ముగ్గురి వంకా దాదాపు పది నిముషాల సేపు చూస్తుండిపోయింది నెమ్మదిగా లోపలనుంచీ ఛాయ కొడుకు ఏడుపు వినబడింది.

"పచ్చకామెర్లు రాలేదు. చచ్చిపోలేదు. అబద్ధం ఆడాను."

గిరున తిరిగి గదిలోకి వెళ్ళి తలుపేసుకుంది. మళ్ళీ స్తబ్దత, నిశ్శబ్దం ఆవరించి ఆ గదిలోకి జీవితం ప్రవేశించింది.

"నేను సిగరెట్ తాగాలి"

ఎవరితోనో చెపుతున్నట్లుగా కాకుండా, గొణుగుతూ బయటికి వెళ్ళాడు శర్మ.

మిగతా ఇద్దరూ కూడా బయటికివెళ్ళారు, ఒకరి తర్వాత మరొకళ్ళు.

ముసలిదంపతులు, బాబూ మిగిలిపోయారాగదిలో.

"కోడలు ఇంత ఆగం చేస్తున్నా కిక్కురుమనరే, ఆడదాన్ని నాలుగంటిస్తేగాని..." కామేశ్వరమ్మ మాటలని పూర్తికానివ్వలేదు సోమయాజులు.

"నీకు తెలీదు నువ్వూరుకో" అన్నాడు.

"అంటే శాంతమ్మ ఇలా ప్రవర్తించటం మీకిష్టమేనా" రుసరుసలాడింది.

"అసలు మన ఇంటిలో జరుగుతున్న కథే వింతయింది. ఎలా పూర్తవుతుందో చూద్దాం. అసలిది పూర్తయే  కథ కాదనిపిస్తోంది నాకు. ఎవరి పట్టుదలలు వాళ్ళవి.ఇప్పుడు శాంతమ్మ మనమాట వింటుందనుకుంటున్నావా. మనం ఏం చెప్పినా?"

"అబ్బ. శాంతకు ఇంత కాఠిన్యం ఉంటుందని నేనేప్పుడూ అనుకోలేదండి. మీరే ఏదయినా చెప్పి శాంతపరచాలి."

"మనసు మెత్తగా ఉండే వాళ్ళలో కాఠిన్యం ప్రవేశిస్తే ఆ మనసు బండరాయికన్నా కఠినమయిపోతుంది."

మర్నాడు ఉదయం సోమయాజులు, శాంత స్నానానికి వచ్చినప్పుడు పలకరించాడు.

"ఆఫీస్‌కి శెలవు పొడిగించడం నాకు అట్టే ఇష్టం లేదమ్మా."

"నాకూ ఇష్టం లేదు" నవ్వింది.

సోమయాజులు కూడా బదులుగా నవ్వాడు.

"మీరు నా మానాన్న నన్ను వదిలేసి, నేను చేసే పనులకి కోపం తెచ్చుకోకుండా ఉండటం నా అదృష్టం" చెప్పింది.

"నాలో విచారం, దుఃఖం జరిగిపోయేదాకా నేనేం పట్టించుకోదలచుకోలేదు. ఆ విచారమే కోపంగా మారి నా చేత అలా చేయిస్తోంది. నీమీద నాకు పరిపూర్ణమయిన  విశ్వాసం ఉంది. కానీ ఇలా ఇంకా ఎక్కువ కాలం సాధ్యం కాదనుకుంటాను"

"కాదు నాకూ తెలుసా సంగతి"

"అంటే?"

"ఛాయ కొడుకు విషయంలో. నేను కూడా మళ్ళా చూడలేదు అప్పటి నుంచి"

శాంత నవ్వి అన్నది.

"అదే ఆలోచిస్తున్నాను"

బాత్‌రూంలోకి వెళ్ళిపోయింది. సరిగ్గా రెండురోజుల తర్వాత శాంత ఆఫీసుకి వెళ్ళిపోవాలి. శెలవు పొడిగించినా మంజూరు కాదని, తప్పక వచ్చి ఆఫీసులో చేరాలని ఆఫీసునుంచి శాంతకి 'రికార్డెడ్ డెలవరీ' ఉత్తరం వచ్చింది కూడా.

స్నానం చేశాక తన గదిలో ఛాయ కొడుకుకు స్నానం చేయిస్తూ అదే ఆలోచించసాగింది. తను ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆ దోషి ఛాయ జీవితంతో, వంటితో ఆటాడుకున్న ఆ మగపురుగు - లొంగలేదు తనకి.

తనెవరో తెలపలేదు.

తన కొడుకు మరణించడానికయినా సిద్ధపడ్డాడు కానీ, తనెవరో తెల్పడానికి ఇష్టపడలేదు ఎంతమాత్రం.

అతనికి తప్పకుండా తన కొడుకు మీద ప్రేమ ఉంది. వాత్సల్యం ఉంది. ఆప్యాయత ఉంది. లేకపోతే ఛాయకి, నెల్లూరుకి ఏపిల్స్ పంపివుండడు. వందరూపాయలు తనకి మని ఆర్డరు చేసి ఉండడు. తనకా ఉత్తరం వ్రాసి ఉండడు.

కానీ ఆ ప్రేమ అణుచుకుంటున్నాడు. తన బలహీనత అందరికీ తెలిసిపోవడం ఇష్టం లేదు. బయటపడడు కూడా ఇక.

కనీసం కొంతకాలం దాకా బయటపడడు. ఏది ఏమయినా సరే. తనేర్పరచుకున్న ఆ ఇనుప తెర వెనకే దాగి ఉంటాడు. తను ఫలానా అని తెలిస్తే తలితండ్రులముందు, అన్నదమ్ములముందు, తన ముందు, లోకం ముందు అవమానంతో సిగ్గుతో పశ్చాత్తాపంతో తల వాలిపోతుంది.

ఆ అవమానం, ఆ సిగ్గు, ఆ పశ్చాత్తాపం ఇనుపతెరలా నిలిచి ప్రేమని జయించలేకపోతున్నాయి. ఒకరోజు కాకపోతే ఒక రోజయినా ప్రేమ వాటన్నిటినీ జయిస్తుంది. కన్నకొడుకు మీద తీపి వాటిని ఛేదించుకుని బయటపడుతుంది.

ప్రత్యేక పరిస్థితుల్లో తప్ప, సాధారణంగా అలా జరగాలంటే ఏం చేయాలి? ఏం చేయాలి? ఏం చేయాలి?

ప్రశ్నలు. ప్రశ్నలు. ప్రశ్నలు. తలనిండా ప్రశ్నలు.

తనకి సమాధానం రాబట్టుకోవాలనే పట్టుదల. ఆ దుర్మార్గుడికి సమాధానం దొరకకుండా చేయాలనే పట్టుదల. ఈ రెండు పట్టుదలల విలువ ఒకటే - శక్తి సమానమే.

తనది ఎప్పటికీ క్షీణించదు. రోజులు గడుస్తున్న కొద్దీ, తన పట్టుదల పెరుగుతుంది తప్ప క్షీణించదు.

కానీ ఆ దుర్మార్గుడి పట్టుదల పెరగదు. రోజులు గడిచేకొద్దీ, పుత్రప్రేమ పొంగి పొరిలే కొద్దీ పట్టుదల తరుగుతుంది. రాజీకి వద్దామనే ఆలోచన పెరుగుతుంది. రాజీకి రావాలనే అవసరం కూడా పెరుగుతుంది.

అలా పెరిగేలా, అలా జరిగేలా చేయాలి. రెండు రోజుల్లో ఆలోచించి చేయాలి కాని ఎలా? ఏం చేయాలి?

భగవాన్. నన్నేం చేయమంటావ్?

శాంత ప్రశాంతంగా నిద్రపోతున్న ఛాయ కొడుకు వంక చూస్తూ ఆలోచిస్తూండిపోయింది ఆ రాత్రంతా.

ఉదయం సూర్యకిరణాలు పృధ్విని స్పర్శించేవేళ, మొదటిసారిగా వంగి ఛాయ కొడుకుని ముద్దుపెట్టుకుంది శాంత.

## 21

శాంత గది తలుపులు బార్లా తెరచి ఉండడం గమనించి అన్నదమ్ములు ముగ్గురూ ఆశ్చర్యపోయారు.

ఛాయ కొడుకుకు ఏమీ అయివుండదు కదా? అని మనసులో కీడు శంకించారు.

ఆ రాత్రి భోజనాల దగ్గర చెప్పింది శాంత.

"నేను రేపటి నుంచి ఆఫీస్‌కి వెళుతున్నాను."

ఎవరూ మాట్లాడలేదు.

"ఛాయ కొడుకు తండ్రి మీ ముగ్గురిలో ఎవరయినా కావచ్చు. ఐ కంగ్రాట్యులేట్ హిమ్. మనిషికి ఎంత ఇనుప హృదయం ఉండగలదో నిరూపించాడు."

ఆమె మొహంలో ఆ క్రిందటి రోజు దాకా ఉన్న కోపం, విచారం అట్టే లేకపోవటం గమనించారంతా. ఏదో తెరిపి ఉంది.

"ఛాయ చచ్చిపోయినా, ఇక్కడ, ఈ ఇంట్లో తక్కువ కాలమే ఉన్నా, మన జీవితాల్లో ఎక్కువ కాలం భాగం పంచుకోకపోయినా, మన జీవితాంతం మన ఛాయగా అంటే నీడగా మనల్ని వెంటాడుతూనే ఉంది. మనమంతా మట్టిలో కలిసేదాకా ఆమె మన మనసుల్లో ఓ భాగం అయిపోయింది.

నిశ్చలంగా ఉన్న సరస్సులోని నీళ్ళలో ఓ రాయి వేస్తే? ఆ రాయిపడ్డ చోటునుంచి, చుట్టూతా గుండ్రంగా అనేక అలలు పుడతాయి. పుట్టి చాలా దూరం వెళతాయి. ఆ అలలు.

అలా నిశ్చలంగ ఉండే నీళ్ళలా ఉన్న మన జీవితాల్లో ఓ రాయి - ఛాయ వచ్చింది. అనేక కలతలు - అలలు సృష్టించి, నీళ్ళలోని రాయిలా అడుక్కు మట్టిలోకి వెళ్ళిపోయింది. పైన అలలు అనేకం పుట్టాయి. ఛాయ వల్ల మన జీవితంలో అనేక సంఘటనలు, అనేక ఓటమిలు. అన్నిటినీ భరించాం.

నీళ్ళలో అలలు అలా కలకాలం ఉండవు. మళ్ళీ నీళ్ళు నిశ్చలంగా ఉండిపోతాయి. మన జీవితాలు కూడా అంతే. ఛాయ గురించి నేను ఇదే ఆఖరిసారి మాట్లాడేది."

అంతా శ్రద్ధగా వింటున్నారు

"ఛాయ కొడుకు ఇప్పుడు మనింట్లో లేడు."

మౌనం.

"క్షేమంగానే ఉన్నాడు. దూరంగా ఉన్నాడు. నాకు తెలిసిన ఒకళ్ళకి అప్పగించాను. ఇప్పుడు రైల్లో వెళుతూంటాడు చాలా చాలా దూర ప్రదేశానికి. అక్కడే పెరిగి పెద్దవాడవుతాడు. బహుశ, నేననుకున్నట్లుగా అంతా సక్రమంగా జరిగితే."

ఆగి, చిన్నగా నవ్వి చెప్పింది.

"తన కొడుకుని ఆ తండ్రి ఇంకా చూసుకోలేడు. తనే తండ్రినని నా ముందు వప్పుకునేదాకా చూసుకోలేడు. అంతదాకా తన కొడుకు ఎక్కడున్నాడో ఎలా వున్నాడో, అసలు ఎలా ఉంటాడో కూడా తెలియదు, తెలుసుకోలేడు. తెలియనివ్వను."

ఆగి, అందరివంకా చూసి, మళ్ళీ చెప్పసాగింది.

"ఎప్పుడయినా కొడుకుని చూసుకోవాలన్నంత ప్రేమ కలిగితే, నాతో తన తప్పు ఒప్పుకుంటే చెపుతాను సంతోషంగా, తండ్రీకొడుకుల నిద్దరినీ కలుపుతాను - ఆరోజు ఎంతో దూరంలో ఉండదని కూడా అంతా అనుకుందాం."

సోమయాజులు నవ్వుతూ చూశాడు కోడలివంక.

"మానవ జీవితాలు స్థిరంకావు. రేపు ఎలా ఉంటుందో చెప్పలేం. ఇవాళ పడుకున్న నేను రేపు లేకపోవచ్చు. డాక్టర్ ఏ హెమరేజ్ వచ్చిందో అని చెప్పవచ్చు లేదా బస్సు కింద పడచ్చు రోడ్డు దాటుతుంటే. నా కేదయినా కావచ్చు కాబట్టి నేను చచ్చిపోయేలోపలే తన కొడుకు సంగతి తెలుసుకోవాలా తండ్రి. ఎందుకంటే, వాడెక్కడున్నాడో నాకు తప్ప మరెవరికి తెలియదు. తెలియకుండాఉండటానికి అన్ని జాగ్రత్తలూ తీసుకున్నాను."

నిశ్శబ్దం.

"ఇవాల్టితో ఛాయ కొడుకు అధ్యాయం ముగిసింది. రేపటినుంచీ మళ్ళీ మనం పాత జీవితాల్నే కొనసగిద్దాం. జరిగినదంతా పీడకల అనుకుందాం." ఇంకా మౌనం, ఇంకా నిశ్శబ్దం.

"వాడి తండ్రి. ఛాయ కొడుకు తండ్రి మనమధ్యే ఉన్నాడు. కానీ ఎవరో తెలియదు. ఛాయ కొడుకు. ఛాయ కొడుకు తండ్రి కొడుకు - అలా పలకటానికే గమ్మత్తుగా లేదూ ఎక్కడో దూరంగా ఉన్నాడు. ఆమె కొడుకు తండ్రెవరో ఒక్కరికే తెలుసు. ఆమె కొడుకు ఎక్కడున్నాడోకూడా ఒక్కరికే తెలుసు. ఈ ఇద్దరి మధ్య సంధి జరిగితే కాని నాకు శాంతి లేదు."

ఎవరూ పెదవి విప్పలేదు."

"రేపెప్పుడో వాడు నా కొడుకే" అని చెపుతారు మీలో ఒకరు నాతో రహస్యంగా. నేనా రహస్యాన్ని అలాగే ఉంచుతాను. నా తృప్తికోసం తెలుసుకుంటానంతే."

చిరునవ్వు నవ్వి పూర్తి చేసింది శాంత తను మాటాడదలచుకున్నది, అన్నం కలుపుకోబోయే ముందు.

"అందుకే వాడు రేపటి కొడుకు."

- అయిపోయింది -